



www.andhrajyothy.com

# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

ఆదివారం | 12-4-2020 | పేజీలు: 8 + 4 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 60 సంచిక (Issue) : 358 | శ్రీశార్వరినామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, చైత్రమాసం, బహుళపక్షం; తిథి: పంచమి సా. 5.16 వరకు తదుపరి షష్ఠి; నక్షత్రం: జ్యేష్ఠ రా. 7.13 తదుపరి మూల; వర్జ్యం: సా. 5.40-7.13, తె. 3.09-4.45; దుర్ముహూర్తం: సా. 4.49-5.38; అమృతఘడియలు: ఉ. 10.46-12.18; రాహుకాలం: సా. 4.30-6.00; సూర్యోదయం: 6.05; సూర్యాస్తమయం: 6.28 | విజయవాడ సిటీ*

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bangalore


వరల్డోమీటర్ ప్రకారం శనివారం రాత్రి 11:00 గంటలకు

| | మొత్తం కేసులు | కొత్త కేసులు | మృతులు |
|---|---|---|---|
| ప్రపంచం | 17,55,319 | 87,644 | 1,06,935 |
| భారతదేశం | 7,529 | 768 | 242 |
| ఆంధ్రప్రదేశ్ | 405 | 24 | 6 |
| తెలంగాణ | 503 | 16 | 14 |
| అమెరికా | 5,21,041 | 32,198 | 20,042 |






# దాచాలంటే దాగదులే!

ప్రధాని ముందూ తప్పుడు వివరాలు

వీడియో కాన్ఫరెన్స్‌లో వింత లెక్కలు

20 కేసులు దాటిన జిల్లాలు ఏడు

కానీ... మ్యాప్‌లో కేవలం రెండు జిల్లాలే

తీవ్రత తగ్గించి చూపేందుకు తాపత్రయం

అన్ని రాష్ట్రాల్లో జిల్లా యూనిట్‌గా లెక్కింపు

ఏపీలో మాత్రం కొత్తగా మండలాల లెక్క

సీఎం తీరుపై అధికారుల్లోనే ఆందోళన



కరోనాతో దాగుడు మూతలు

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

అతిగా భయపడొద్దు! అలాగని అలసత్వమూ ప్రదర్శించవద్దు! ఒక్కసారి గేట్లు ఎత్తేస్తే ఏం జరుగుతుందో ఊహకు కూడా అందదు! అందుకే... లాక్‌డౌన్ పొడిగించాలని అనేక రాష్ట్రాలు అభిప్రాయపడుతున్నాయి. శనివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన ప్రధాని మోదీకి ఆయా రాష్ట్రాల సీఎంలు ఇదే సూచన చేశారు. కానీ... ఆర్థిక వ్యవస్థ, సామాన్యుల కష్టాల నేపథ్యంలో రెడ్ జోన్లలో మాత్రమే లాక్‌డౌన్ కొనసాగించాలని సీఎం జగన్ కోరారు. ఈ వాదనలోనూ హేతుబద్ధత ఉండొచ్చు. అయితే, కరోనా తీవ్రతను తగ్గించి చూపించేందుకు ముఖ్యమంత్రి చేసిన ప్రయత్నం, పడిన తాపత్రయం ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. సీఎం ఇచ్చిన ప్రజంటేషన్ ప్రకారం... మార్చి 20వ తేదీ నాటికి ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో మాత్రమే, అదీ పదికిలోపు కరోనా కేసులు నమోదయ్యాయి. మరో 20 రోజుల్లో అంటే, శుక్రవారం నాటికి విజయనగరం, శ్రీకాకుళం మినహా అన్ని జిల్లాలకు వైరస్ పాకింది. అందులోనూ కర్నూలు, నెల్లూరు జిల్లాల్లో 20కిపైగా కేసులు నమోదయ్యాయని ఈ ప్రజంటేషన్‌లో వివరించారు. ఈ రెండు జిల్లాలను మాత్రమే 'ఎరుపు' రంగులో చూపించారు. కానీ, వాస్తవ పరిస్థితి దీనికి పూర్తి భిన్నంగా ఉంది. అధికారిక

మిగతా 7వ పేజీలో...

# మరో 2 వారాలు

## సీఎంలదీ ఇదే మాట.. కానీ గతంలోలా ఉండదు

మనమూ ఉండాలి.. ప్రపంచమూ ఉండాలి: మోదీ

ప్రాణంతోపాటు ఆర్థికమూ ముఖ్యమే

వివిధ రంగాల్లో దశలవారీగా ఎత్తివేత!

సాగుకు ప్యాకేజీ.. నేరుగా అమ్ముకునే వీలు

కేంద్రం యోచన.. నేడో రేపో మోదీ ప్రకటన

**రాష్ట్రాలకు ప్యాకేజీ ఇవ్వాలి**

వలస కార్మికులను ఎన్నాళ్లుంచుకోవాలి?

ప్రధానికి ముఖ్యమంత్రుల డిమాండ్ల వర్షం

ఆరు రాష్ట్రాల్లో లాక్‌డౌన్ పొడిగింపు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): కరోనా కట్టడి నిమిత్తం ప్రకటించిన లాక్‌డౌన్‌ను మరో రెండు వారాల పాటు పొడిగించాలని కేంద్రం సూత్రప్రాయంగా నిర్ణయించింది. మార్చి 25న మొదలైన ఈ దేశవ్యాప్త లాక్‌డౌన్ ఈనెల 14న ముగియాల్సి ఉంది. కొవిడ్-19 ఉధృతి ఇంకా అదుపులోకి రాలేదని, రోగుల సంఖ్య పెరుగుతూనే ఉందని, అందుచేత

మిగతా 8వ పేజీలో...

### రెడ్ జోన్‌లలో చాలు

మిగతాచోట్ల లాక్‌డౌన్ ఎత్తివేయాలి

ఆర్థిక వ్యవస్థనూ చూడాలి

అనేక వర్గాలకు కష్టనష్టాలు

లక్షలాది కుటుంబాలకు ఇబ్బంది

కరోనాపై కేంద్రం చర్యలు భేష్

రాష్ట్రంలో పటిష్ఠ ప్రణాళిక

595 మండలాలు గ్రీన్ జోన్‌లోనే

రెడ్‌జోన్‌లో 37 మండలాలు

ప్రధానికి సీఎం జగన్ వివరణ

7



ఎస్ఈసీగా బాధ్యతలు స్వీకరిస్తున్న జస్టిస్ కనగరాజ్

# ఎస్ఈసీగా జస్టిస్ కనగరాజ్

బాధ్యతల స్వీకరణ.. గవర్నర్‌తో భేటీ

ఎన్నికల కార్యాలయ సిబ్బందితో సమావేశం

స్థానిక ఎన్నికల ప్రక్రియపై రేపు చర్చ!

అమరావతి/చెన్నై, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌గా మద్రాస్ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ కనగరాజ్ నియమితులయ్యారు. ఎస్ఈసీగా హైకోర్టు రిటైర్డ్ జడ్జిని నియమించాలని రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఆర్డినెన్స్ జారీచేసిన విషయం తెలిసిందే. ఈ పదవిలో ఎవరిని నియమిస్తారన్న విషయాన్ని గోప్యంగా ఉంచింది. శనివారం జస్టిస్ కనగరాజ్ బాధ్యతలు చేపట్టే సమయంలోనే పంచాయతీరాజ్ శాఖ

మిగతా 7వ పేజీలో...



స్థానికం వాయిదా వేశాననే..

# టార్గెట్ చేశారు!

వాయిదా వేయకుంటే రాష్ట్రం కరోనా హాట్‌స్పాట్ అయ్యేది

వైసీపీ నేతలపై వచ్చిన ఫిర్యాదులపై నివేదికలు కోరడమే తప్పా?

రాజకీయ ప్రయోజనానికే ఆర్డినెన్స్

నిష్పాక్షికతే నా తొలగింపునకు కారణం

ఆ జీవోలను రద్దు చేయండి

హైకోర్టును ఆశ్రయించిన నిమ్మగడ్డ రమేశ్

7



7

## విమాన చార్జీలకు రెక్కలు

బుకింగ్ ప్రారంభించిన స్పైస్‌జెట్, ఇండిగో

రేట్లు పెరిగినా జోరుగా టికెట్ల అమ్మకాలు

15 తర్వాత వారం వరకూ సీట్లన్నీ ఫుల్

లాక్‌డౌన్ మార్గదర్శకాల కోసం ఎదురుచూపు

# ఒకే కుటుంబంలో 11 మందికి

వీరిలో పదేళ్లలోపు చిన్నారులు ఆరుగురు.. గుంటూరులో మరో 17 కరోనా కేసులు

కర్నూలులోనూ ఐదుగురికి పాజిటివ్.. ప్రకాశం, కడపల్లో ఒక్కొక్కరు చొప్పున

ఒకేరోజు 24 మందికి వైరస్ నిర్ధారణ.. రాష్ట్రంలో 400 దాటిన పాజిటివ్ కేసులు

### లెక్క తగ్గడం లేదు

11 రోజుల్లోనే 361 పాజిటివ్ కేసులు

శరవేగంగా విస్తరిస్తున్న కరోనా వైరస్

గుంటూరు, కర్నూలులో డేంజర్ బెల్స్

గుంటూరులో తొలి కేసు డిశ్చార్జ్

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

కరోనా వైరస్ నానాటికీ విజృంభిస్తోంది. రాష్ట్రంలో పాజిటివ్ కేసుల సంఖ్య 405కు చేరింది. శనివారం ఒక్కరోజే 24 కొత్త కేసులు నమోదయ్యాయి. వీటిలో గుంటూరులో 17, కర్నూలులో 5, ప్రకాశం, కడప జిల్లాల్లో ఒక్కొక్కటి చొప్పున ఉన్నాయి. ఈ మహమ్మారి తీవ్రతకు గుంటూరు జిల్లా విలవిల్లాడుతోంది. కొత్తగా వైరస్ సోకినట్లు నిర్ధారణ అయిన వారిలో 17మంది గుంటూరు నగరానికి చెందినవారే. వీరిలో 11మంది ఒకే కుటుంబానికి చెందినవారు. ఇందులో పదేళ్ల లోపు చిన్నారులు ఆరుగురు (ముగ్గురు బాలికలు, ముగ్గురు బాలురు) ఉన్నారు. ఇదే కుటుంబంలో ఇద్దరు మహిళలకు కూడా ఈ వ్యాధి సోకింది. నగరంలో రెడ్‌జోన్ ప్రాంతంగా గుర్తించిన ఓ వీధిలో ఇప్పటికే 22మందికి కరోనా నిర్ధారణ కావడంతో అక్కడ నివసించేవారు బెంబేలెత్తుతున్నారు. గుంటూరులో వేర్వేరు ప్రాంతాలకు చెందిన మరో ఆరుగురికి కూడా వైరస్ సోకినట్లు శనివారం నిర్ధారణ అయింది. కొత్తగా

మిగతా 8వ పేజీలో...

# అగ్రరాజ్యంలో మృత్యుఘోష

కరోనా కరాళ నృత్యంతో 24 గంటల్లో

**2047 మంది మృతి**

40 మంది భారతీయులూ తుదిశ్వాస

మృతుల్లో ఇద్దరు ఆంధ్రప్రదేశ్‌వాసులు

2

ఇప్పటికి 20,042 మంది మృతి

ఇటలీని అధిగమించిన అమెరికా

5 లక్షలు దాటిన కేసుల సంఖ్య

చేయాల్సింది చేస్తున్నాం.. ఇక ప్రజల చేతుల్లోనే: అధ్యక్షుడు ట్రంప్ వ్యాఖ్యలు



ఎన్నికలు జరుగుతున్న దక్షిణ కొరియాలో కరోనా బారిన పడినవారి కోసం ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో పూర్తి రక్షణ దుస్తులతో పోలింగ్ సిబ్బంది

## కోలుకున్న వారికి మళ్లీ కరోనా!?

దక్షిణ కొరియాలో 91 మందికి పాజిటివ్

## ఎవరి సొమ్ముతో ఎవరికి అండ?

ముఖ్యమంత్రి పత్రికకు మంత్రి సురేశ్ ప్రకటన

టారిఫ్ విలువ రూ.1.36 కోట్లు.. సమగ్ర శిక్షా విభాగంపై భారం!?

తలలు పట్టుకున్న అధికారులు.. జగన్ పత్రికకు వరుసగా మంత్రుల ప్రకటనలు



3

# లోపాలు చూపితే శాపాలా..?

## కొత్త పలుకు



"నాకు కరోనా వైరస్ సోకాలని తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ శపించారు. ఆయనకంటే అత్యంత శక్తిమంతుడైన దేవుడి దయవల్ల నేను ఇప్పటివరకు క్షేమంగానే ఉన్నాను. మీడియాను బెదిరించడానికి అలవాటుపడిన కేసీఆర్, ఇప్పుడు సూచనలను కూడా స్వీకరించే స్థితిలో లేరు. శిక్షలు విధిస్తామని హెచ్చరికలు చేస్తున్నారు. 'ఆంధ్రజ్యోతి'కి ఇలాంటి హెచ్చరికలు అలవాటే! మీరు గుడ్లు ఉరిమితే ఇక్కడెవరూ భయపడరు.

దేనికైనా సమయం, సందర్భం చూసుకోవాలంటారు. కానీ, జగన్‌కు ఇవేమీ పట్టవు. సభ్య సమాజం నివ్వెరపోయే నిర్ణయాలు తీసుకోవడం ఒక్క జగన్మోహన్‌రెడ్డికే సాధ్యం! రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పదవీ కాలాన్ని మూడేళ్లకు కుదించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి కూడా తిక్కరేగి దేశంలో ముఖ్యమంత్రుల పదవీకాలాన్ని రెండేళ్లకో, మూడేళ్లకో కుదిస్తూ రాజ్యాంగ సవరణకు పూనుకుంటే జగన్ సమర్థిస్తారా?

- కొత్తపలుకు 4వ పేజీలో...






పరంజ్యోతి

## అదృష్టమా? పురుషప్రయత్నమా?



అదృష్టమా? పురుష (మానవ) ప్రయత్నమా? ఈ రెండింటిలో ఏది గొప్పది? మత్స్యావతారం దాల్చిన ఆ శ్రీ మహావిష్ణువే ఈ ప్రశ్నకు ఎప్పుడో సమాధానం చెప్పాడు! దైవం/అదృష్టం కన్నా పురుషప్రయత్నమే గొప్పదని తేల్చిచెప్పాడు!! మత్స్యపురాణంలో విష్ణుమూర్తి చెప్పినదాని ప్రకారం.. తొలి జన్మలలో మనిషి చేసుకున్న కర్మలకే దైవమని పేరు. మంచివారు, సాత్వికులు, ఇతరులకు కష్టం కలగకూడదనే బుద్ధితో పనులు చేసేవారు, ఇతరులకు ఉపకారం చేసేవారు చేసే కర్మ సాత్వికమై ఫలిస్తుంది. ఆ కర్మఫలితాలు సాత్విక దైవాలు. చెడ్డ పనులు చేసేవారి కర్మలు ప్రతికూల దైవాలవుతాయి. అలాంటివారు కూడా మంచి పనులు చేయడం మొదలుపెడితే (పురుషప్రయత్నంతో) ప్రతికూల దైవాలను కొట్టివేయవచ్చని సాక్షాత్తూ ఆ పరమాత్మే చెప్పాడు. పౌరుషం లేనివారే కేవలం దేవుడి మీద భారం వేసి, దేవుడే దిక్కు అనుకుంటూ ఉంటారని.. కానీ, సర్వకాల సర్వావస్థల్లోనూ తమ శక్తియుక్తులన్నీ పెట్టి ప్రయత్నం చేసేవారికే దైవం అనుకూలిస్తాడని మత్స్యమూర్తి ఉవాచ. దైవం, పురుష ప్రయత్నం, కాలం.. ఈ మూడూ కలిసి మనిషికి కర్మఫలానుభవం ఇస్తాయని పరమాత్మ తెలిపాడు. ఉదాహరణకు.. కృషికి (వ్యవసాయం చేయడం- అంటే పురుష ప్రయత్నం) వర్షం (దైవం) తోడైతే పంట పండుతుంది. కర్మ అనుకూల దైవమైతే వర్షం సకాలంలో కురుస్తుంది. చేసిన కర్మ ప్రతికూల దైవమైతే అకాలంలో కురిసి ప్రతికూల ఫలితాన్నిస్తుంది. కాబట్టి ఈ భూమీద సకల వృత్తులు, ప్రవృత్తులూ దైవ, మానుషాధీనాలై ఉన్నాయి. పురుష ప్రయత్నం పైకి కనిపిస్తుంది. దైవానుగ్రహం అంతర్గతమై ఉంటుంది.

*దైవం సంప్రేరయతి మామితి దగ్ధధియాం ముఖమ్*
*అదృష్ట శ్రేష్ఠ దృష్టీనాం దృష్ట్వా లక్ష్మీర్నివర్తతే*

అదృష్టం వల్లనే నేనీ పనులన్నీ చేయగలుగుతున్నానని భావించేవారి ముఖం చూడ్డానికి కూడా లక్ష్మీ దేవి ఇష్టపడదని వశిష్ఠ గీత చెబుతోంది.

*శుభేన పురుషార్థేన శుభమాసాద్యతే ఫలం*
*అశుభేనాశుభం రామ యథేచ్ఛసి తథాకురు*

"ఓ రామా.. మంచి (శుభ) పురుషప్రయత్నం వల్ల మంచి ఫలితం లభిస్తుంది. అశుభప్రయత్నం వల్ల అమంగళమే లభిస్తుంది. నీవు దేన్ని కోరుకుంటావో అదే చెయ్యి" అని వశిష్ఠుడు రాముడికి ఉపదేశించాడు. అంతేకాదు..

*జగతి పురుషకార కారణే స్మిన్*
*కురు రఘునాథ చిరం తథా ప్రయత్నమ్*

"రఘునాథా.. ఈ ప్రపంచంలో అభీష్టసిద్ధికి పురుషప్రయత్నమే కారణం" అని తేల్చిచెప్పాడు. అసలు పురుష ప్రయత్నం ఎంత గొప్పదో చెప్పేందుకే ఆ పరమాత్మ రామావతారం దాల్చాడు. సాక్షాత్తూ భగవంతుని అవతారమే అయినా సామాన్య మానువునిలా జీవించాడు. ఎన్నికష్టాలెదురైనా వాటిని పురుషప్రయత్నంతో అధిగమించవచ్చని నిరూపించాడు. క్షత్రియుడైన విశ్వామిత్రుడు సైతం తన పురుష ప్రయత్నం చేతనే బ్రహ్మర్షి అయ్యాడు తప్ప అదృష్టంతో కాదు. ఆ మహాపురుషులే మనందరికీ ఆదర్శం.

**- కొత్తపల్లి యజ్ఞ దత్త ఆదినారాయణ అవధాని, 9030222444**

లోకం తీరు




# అగ్రరాజ్యంలో మృత్యుఘోష

## కరోనా కరాళ నృత్యంతో ఒక్కరోజులో 2,047 మంది మృతి

- **మృతుల్లో 40 మంది భారతీయులు**
- **వారిలో ఇద్దరు ఏపీ వాసులు..**
- **శనివారం నాటికి 20,042 మంది మృతి**
- **చేయాల్సింది చేస్తున్నాం.. ఇక ప్రజల చేతుల్లోనే**
- **మీడియాతో అధ్యక్షుడు ట్రంప్ వ్యాఖ్యలు**


చికాగోలో నిర్మిస్తున్న క్వారంటైన్ సెంటర్

| మృతి చెందిన ప్రవాస భారతీయులు | |
|---|---|
| కేరళ | 17 మంది |
| గుజరాత్ | 10 మంది |
| పంజాబ్ | నలుగురు |
| ఏపీ | ఇద్దరు |
| ఒడిసా | ఒకరు |

న్యూఢిల్లీ, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): అమెరికాలో కరోనా కరాళ నృత్యం చేస్తోంది. ఒక్కరోజులోనే 2,047 మంది పౌరులు కరోనాకు బలయ్యారు. వైరస్ బారినపడి ఇప్పటి వరకు 40 మంది ప్రవాస భారతీయులు మృతిచెందారు. వీరిలో ఇద్దరు ఏపీకి చెందిన వారు. మరో 1500 మంది భారతీయులు, భారత సంతతికి చెందిన వారిలో పాజిటివ్ నమోదైంది. ఇక, పాజిటివ్ కేసుల విషయంలో అమెరికా ప్రపంచ రికార్డును అధిగమించింది. దేశంలో మొత్తం పాజిటివ్ కేసుల సంఖ్య 5,21,042 దాటినట్టు జాన్స్ హాప్కిన్స్ యూనివర్సిటీ వెల్లడించింది. గడిచిన 24 గంటల్లో 35 వేల పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. అమెరికాలో కొవిడ్-19 వ్యాప్తికి న్యూయార్క్ కేంద్రంగా ఉన్నట్టు తెలిపింది. దీని తర్వాత స్థానంలో న్యూజెర్సీ ఉంది. ఈ రెండు ప్రాంతాల్లోనే ప్రవాస భారతీయులు ఎక్కువగా నివసిస్తుండడం గమనార్హం. అదేవిధంగా న్యూయార్క్‌లోనూ 15 మంది ప్రవాస భారతీయులు కరోనాకు బలయ్యారు. మరో నలుగురు పెన్సిల్వేనియా, ఫ్లోరిడాల్లో మృతి చెందారు. టెక్సాస్, కాలిఫోర్నియాల్లోనూ ఒక్కొక్కరు చొప్పున ప్రాణాలు కోల్పోయారు. శనివారం రాత్రికి అందిన లెక్కల ప్రకారం అమెరికాలో 20,042 మంది కరోనాతో మృతి చెందారు. దీంతో కరోనా మరణాల్లో ఇటలీని అమెరికా అధిగమించేసింది. అయితే, తమ దేశంలో కరోనామృతుల సంఖ్య మొదట్లో అనుకున్న దానికన్నా తగ్గుతుందని, ఇది 60 వేల లోపు ఉండొచ్చని అధ్యక్షుడు ట్రంప్ చెప్పారు. పౌరులను కాపాడేందుకు ప్రభుత్వం రేయింబవళ్ల శ్రమిస్తోందని, ఇక కరోనా పరిష్కారం ప్రజల చేతుల్లోనే ఉందన్నారు. జాతీయ అత్యయిక స్థితిని ప్రకటించిన ట్రంప్, 50 రాష్ట్రాలను అతి పెద్ద పెనుముప్పు ఉన్నవిగా ప్రకటించారు.ఆయా రాష్ట్రాల్లో ప్రజలు ఇంటికేపరిమితం కావాలన్నారు.

### దయనీయ అంతిమం!

న్యూజెర్సీలోని ఎడిసన్‌లో సన్నోవా అనలటికల్ సంస్థ సీఈవో మారేపల్లి హన్మంతరావు కరోనాకు బలయ్యారు. ఈయన ఆంధ్రప్రదేశ్ వాస్తవ్యుడు. ఎంతో మందికి ఉపాధి కల్పించిన హన్మంతరావు అంతిమ సంస్కారాలు అత్యంత దయనీయంగా నిర్వహించాల్సి వచ్చిందని సంస్థ ఉద్యోగులు, అభిమానులు కన్నీటి పర్యంతమయ్యారు. ప్రభుత్వం కేవలం తొమ్మిది మందికి మాత్రమే అనుమతి ఇచ్చింది. దీంతో అంతిమ సంస్కారాలను ఆన్‌లైన్ వీడియోలో వీక్షిస్తూ నివాళులర్పించారు. హన్మంతరావుకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. హన్మంతరావు మృతి పట్ల ఉత్తర అమెరికా తెలుగు సంఘం(నాటా) సంతాపం వ్యక్తం చేసింది.

### ప్రభుత్వ పరంగా గట్టి చర్యలు



అమెరికాను చుట్టుముడుతున్న కరోనాను నిరోధించడానికి రాష్ట్ర ప్రభుత్వాలు పటిష్టమైన చర్యలు చేపట్టాయి. నేను ప్రాతినిధ్యం వహిస్తున్న న్యూజెర్సీలో కరోనా బాధితులు అధికంగా ఉన్నారు. ఇక్కడ తెలుగువారూ అధికమే. న్యూజెర్సీ గవర్నర్ సారథ్యంలో ప్రభుత్వం కరోనా నిరోధానికి ప్రచారం చేపట్టింది. మరణాల సంఖ్య తగ్గించడానికి పరీక్షలు చేపడుతున్నాం. భారతీయులు, తెలుగువారిలో ధైర్యం నింపుతున్నాం.

**- చివుకుల ఉపేంద్ర, న్యూజెర్సీ రాష్ట్ర కమిషనర్**

### ఆర్థికంపై పెను ప్రభావం



నేను కాలిఫోర్నియాలోని సిలికాన్ వ్యాలీలో ఉంటున్నాను. ఇక్కడి తెలుగువారంతా క్షేమంగానే ఉన్నారు. లాక్‌డౌన్‌తో సిలికాన్ వ్యాలీలో కార్యకలాపాలు మందకొడిగా సాగుతున్నాయి. ఫలితంగా చాలా ఉద్యోగాలు పోయాయి.

**- కూచిభొట్ల ఆనంద్, సిలికాన్ ఆంధ్ర వ్యవస్థాపక అధ్యక్షులు**

### మహాసభలు వాయిదా



అమెరికాలో కరోనా ప్రభావం తెలుగువారిపై పరోక్షంగా పడుతోంది. తెలుగువారి ఉద్యోగాలకు భద్రత కరువైంది. నేను అధ్యక్షునిగా ఉన్న అమెరికా తెలుగు అసోసియేషన్(ఏటీఏ) మహాసభలను డిసెంబరు వరకు వాయిదా వేశాం.

**- భీమిరెడ్డి పరమేష్, ఆటా అధ్యక్షులు**

### భౌతిక దూరమే రక్షరేకు



కరోనాను కట్టడి చేయడానికి అమెరికాలోని వైద్య పరిశోధన కేంద్రాల్లో 24 గంటలూ ప్రయోగాలు జరుగుతున్నాయి. కరోనా మహమ్మారి దరిచేరకుండా ఉండాలంటే ఇంట్లో కూర్చోవడమే ప్రస్తుతానికి సరైన మందు. డెట్రాయిట్‌లో కరోనా పేషంట్లకు రాత్రింబవళ్లు చికిత్స అందిస్తున్నారు. ఇక్కడ తెలుగువారు అత్యధికంగా ఉన్నారు.

**- పొలిచర్ల హరనాథ్, న్యూరాలజిస్ట్, డెట్రాయిట్**

**(న్యూయార్క్ నుంచి కిలారు అశ్వనీ కృష్ణ)**

## చైనాపై మరోమారు ట్రంప్ కన్నెర్ర

### మమ్మల్ని వాడుకుని ఆ దేశం ఎదిగింది

- **డబ్ల్యూటీవోలో చేరాకే పురోగమనం**



వాషింగ్టన్, ఏప్రిల్ 11: చైనాపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోమారు ఫైర్ అయ్యారు. "చైనా ఎదగడానికి 30 ఏళ్ల పాటు అమెరికాను వాడుకుంది. అమెరికా మద్దతుతోనే అభివృద్ధి సాధించింది. ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీవో)లో చేరాకే.. ఆ దేశం ఎదుగుదల మొదలైంది. ఆ దేశ ఆర్థిక వ్యవస్థ రాకెట్ స్పీడ్‌తో దూసుకుపోయింది. డబ్ల్యూటీవో నిబంధనలను చైనా అనుకూలంగా మార్చుకుంది. ఆ నిబంధనలు మాకు ప్రతికూలంగా ఉన్నాయి. అభివృద్ధి చెందుతున్న దేశం అనే పేరుతో చైనా ఎన్నో ప్రయోజనాలు పొందింది. ఆ దేశం మా పట్ల గౌరవ భావంతో లేకుంటే.. మేం దాన్ని వదిలేస్తాం" అని వ్యాఖ్యానించారు. శుక్రవారం ఆయన వైట్‌హౌస్‌లో విలేకరులతో మాట్లాడుతూ.. చైనాను ఇంకా ఒక అభివృద్ధి చెందుతున్న దేశంగా పరిగణిస్తే.. అమెరికా కూడా అదేకోవలోకి వస్తుందన్నారు. "భారత్ అభివృద్ధి చెందుతున్న దేశం. అమెరికా చాలా అభివృద్ధి చెందిన దేశం. ఇంకా ఎంతో అభ్విద్ధి చేసే అవకాశం మాకు ఉంది. చైనా తన మారక విలువను తగ్గించుకోవాలి. విపత్కర పరిస్థితుల్లో వితరణకు సిద్ధమవ్వాలి" అని అన్నారు. కాగా.. అమెరికాలో లాక్‌డౌన్ వల్ల ఆర్థిక వ్యవస్థ రోజురోజుకీ దిగజారిపోతోందని ట్రంప్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో లాక్‌డౌన్‌ను ఎత్తివేయడంపై త్వరలో ఒక కఠిన నిర్ణయం తీసుకుంటానన్నారు. "నా జీవితంలో ఎన్నడూ అంతపెద్ద నిర్ణయం తీసుకుని ఉండను" అని ఆయన వ్యాఖ్యానించారు. అయితే.. లాక్‌డౌన్‌ను ఎప్పుడు ఎత్తివేస్తారని విలేకరులు అడిగిన ప్రశ్నకు సమాధానాన్ని దాటవేశారు. అటు ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో)కు నిధులు ఇవ్వడంపై వచ్చేవారం నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. కరోనా విజృంభన నేపథ్యంలో వీసాలపై ఆంక్షలు విధించాలంటూ ట్రంప్ ఓ మెమొరాండమ్‌ను విడుదల చేశారు. ఆ ఆదేశాలు వెంటనే అమల్లోకి వస్తాయన్నారు. దీని మేరకు.. కొత్త వీసా దరఖాస్తులను ఎలాంటి వివరణ ఇవ్వకుండానే.. ఈ ఏడాది చివరి వరకు పెండింగ్‌లో పెడతారు. దేశ చట్టాలను ఉల్లంఘించిన వీసాదారులను గుర్తించి, వారి దేశాలకు తిప్పి పంపుతారు. కరోనా కాంటాక్ట్ ట్రేసింగ్ కోసం టెక్ దిగ్గజాలు గూగుల్, యాపిల్ సంయుక్తంగా అప్లికేషన్‌ను అభివృద్ధి చేస్తాయని ట్రంప్ వెల్లడించారు. పౌరుల వ్యక్తిగత భద్రతకు భంగం వాటిల్లకుండా ఈ సాంకేతిక ఉంటుందని గూగుల్ , యాపిల్ వెల్లడించాయి.

### ఎండాకాలం

| కేంద్రం | గరిష్ఠం | కనిష్ఠం |
|---|---|---|
| ఏలూరు | 41.0 | 24.0 |
| కడప | 40.0 | 25.0 |
| కర్నూలు | 39.9 | 25.3 |
| విజయవాడ | 38.5 | 25.4 |
| విశాఖపట్నం | 36.0 | 25.2 |
| హైదరాబాద్ | 35.2 | 23.4 |
| ప్రకాశం | 34.6 | 26.0 |

### రాయలసీమలో ఎండ తీవ్రత

విశాఖపట్నం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ, దక్షిణ కోస్తాల్లో ఎండ తీవ్రత కొనసాగింది. కర్నూలులో 40 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. కాగా మధ్యప్రదేశ్ నుంచి విదర్భ మీదుగా తమిళనాడు వరకు కొనసాగుతున్న ద్రోణి పడమర వైపునకు మళ్లింది. దీంతో కోస్తా, రాయలసీమల్లో వర్షాలు తగ్గనున్నాయని వాతావరణ అధికారి ఒకరు తెలిపారు. అయితే సముద్రం నుంచి వచ్చే తేమగాలులతో రానున్న 24 గంటల్లో ఉత్తరకోస్తాలో అక్కడక్కడా ఉరుములతో వర్షాలు కురుస్తాయని, దక్షిణ కోస్తా, రాయలసీమలో పొడి వాతావరణం నెలకొంటుందన్నారు. కాగా శనివారం ఉత్తర కోస్తా ఏజెన్సీ ప్రాంతాల్లో వర్షాలు కురిశాయి.

### కోలుకున్న వారికి మళ్లీ కరోనా!?

- **దక్షిణ కొరియాలో 91 మందికి పాజిటివ్**

సియోల్, ఏప్రిల్ 11: కరోనా వైరస్ బారిన పడి కోలుకున్న రోగులకు మళ్లీ వైరస్ సోకుతుందా? అంటే కచ్చితంగా చెప్పలేని పరిస్థితి. కానీ, తాజాగా దక్షిణ కొరియాలో వైరస్ బారిన పడి కోలుకున్న 91 మందికి పరీక్షలుచేస్తే మళ్లీ పాజిటివ్ 'వ్యాధుల నియంత్రణ, నిరోధక కేంద్రాలు(కేసీడీసీ)' డైరెక్టర్ జియాన్‌కయాంగ్ వెల్లడించారు. ఈ రోగుల్లో వైరస్ మళ్లీ క్రియాశీలమైందా (రీయాక్టివేట్) లేక మళ్లీ సోకిందా (రీ ఇన్‌ఫెక్షన్) అన్న విషయాన్ని పరిశీలిస్తున్నట్లు తెలిపారు. రీయాక్టివేట్ అంశంపైనే ఎక్కువగా దృష్టి పెట్టామని, దీనిపై సమగ్ర అధ్యయనం చేస్తున్నామని వివరించారు. ఈ అంశాన్ని నిశితంగా పరిశీలిస్తున్నామని కెనడాకు చెందిన అంటువ్యాధుల నిపుణుడు డేవిడ్ కెల్విన్ చెప్పారు. రీ ఇన్‌ఫెక్షన్ దాదాపు అసాధ్యమన్నారు. ఒక్కోసారి వైరస్ అవశేషాలు రోగుల శరీరంలో మిలిగిపోయే అవకాశం ఉంటుందన్నారు. కానీ, వాటివల్ల వ్యాధి ఇతరులకు సోకదని కెల్విన్ తెలిపారు.

### హెచ్-1బీ గడువు పొడిగించండి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 11 : కరోనా నేపథ్యంలో భారతీయుల హెచ్-1బీ, ఇతర వీసాల గడువును పొడిగించాలని అమెరికాకు భారత్ విజ్ఞప్తి చేసింది. హెచ్-1బీ వీసాదారుల సేవలను ముగించివేయాలని అక్కడి కంపెనీలను అమెరికా ప్రభుత్వం కోరుతోందని వార్తలు వచ్చిన నేపథ్యంలో మన అధికారులు అమెరికా అధికారులతో మాట్లాడారని అధికారిక వర్గాలు తెలిపాయి. అమెరికా ప్రభుత్వం నుంచి అటువంటి ఆదేశాలు కానీ, సూచనలు కానీ కంపెనీలకు అందలేదని, హెచ్-1బీ వీసా ఉద్యోగులను అక్కడే ఉండనివ్వాలని భారత్ కోరిందని ఆ వర్గాలు వెల్లడించాయి. ఈ విషయంలో భారత విదేశాంగ కార్యదర్శి హర్ష్ శ్రింగ్లా అమెరికా విదేశాంగ డిప్యూటీ కార్యదర్శి స్టీఫెన్ బీగన్‌కు ఫోన్ చేసి మాట్లాడారని పేర్కొన్నాయి.

# గడప దాటని ప్రపంచం

### ఇళ్లలోనే గుడ్‌ఫ్రైడే, ఈస్టర్.. 16 లక్షల పాజిటివ్ కేసులు.. లాక్‌డౌన్‌వైపే దేశాలు మొగ్గు

- **మే నెలలోనూ లాక్‌డౌన్ కొనసాగింపు**
- **ఫ్రాన్స్, స్పెయిన్, ఇటలీల్లో ఐసీయూ కేసులు తగ్గుముఖం**
- **కోలుకొన్న బ్రిటన్ ప్రధాని**
- **టర్కీలో 93ఏళ్ల బామ్మ సేఫ్**
- **సింగపూర్‌లోని 668 మందిని విమానాల్లో తీసుకొచ్చిన భారత్**



రోమ్, ఏప్రిల్ 11: ప్రపంచానికి గుడ్‌ఫ్రైడే సంతోషాన్నీ, ఈస్టర్ వారాంతర సందడినీ కరోనా దూరం చేసింది. చర్చిలు, ప్రార్థనాలయాలు వెలవెలబోయాయి. కరోనా మరణాలు లక్ష దాటిపోవడంతో ప్రజలంతా ఇళ్లకే పరిమితమయ్యారు. శనివారం నాటికి ప్రపంచ మరణాలు 1,06,935కు చేరుకోగా, 17,55,319 పాజిటివ్ కేసులు బయటపడ్డాయి. ఇందులో 70% విషాదాన్ని ఒక్క యూరప్ దేశాలే మోస్తున్నాయి. స్పెయిన్, ఇటలీలో వైరస్ వ్యాప్తి మందగించింది. మూడు, నాలుగు వారాలుగా లాక్‌డౌన్‌లో ఉన్న దేశాలు తొందరపడి దానిని సడలించొద్దని, మరికొన్ని వారాలు పొడిగించాలని డబ్ల్యూహెచ్‌వో హెచ్చరించింది. లేదంటే చైనాలో మాదిరిగానే తగ్గుముఖం పడుతున్నదల్లా ఒక్కసారిగా తిరగబెట్టే ప్రమాదముందని పేర్కొంది. కాగా.. 1930 నాటి ఆర్థిక మాంద్యం రోజులు పునరావృతమైనట్లు అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ ప్రకటించింది. అత్యధికంగా 19,468 మరణాలు నమోదైన ఇటలీలో ఐసీయూ కేసులు తగ్గుతున్నాయి. వరుసగా మూడోరోజు మరణాలరేటు తగ్గిన స్పెయిన్‌లో 24 గంటల్లో 383మంది మరణించారు. ఫ్రాన్స్‌లో పదేళ్ల బాబు కరోనాతో చనిపోయాడు. ఇప్పటికి ఇక్కడ 16,353 మంది చనిపోయారు. కరోనాబారిన పడి కోలుకొన్న ప్రధాని బోరిస్ జాన్సన్ ఆస్పత్రిలో కొంత నడవగలుగుతున్నారని, సినిమాలు చూస్తున్నారని వైద్యులు తెలిపారు. 125మంది మృతితో ఇరాన్‌లో మరణాల సంఖ్య 4,357కు చేరింది. రష్యా రాజధాని మాస్కోలో లాక్‌డౌన్‌ను మరోవారం పొడిగించారు. బ్రెజిల్‌లో ఇప్పటికి వెయ్యిమంది చనిపోగా, 19,638 కేసులు బయటపడ్డాయి. టర్కీకి చెందిన 93 ఏళ్ల అలెయ్ గుండజ్ అనే బామ్మ కరోనా నుంచి కోలుకుని శనివారం డిశ్చార్జి అయ్యారు. కాగా.. సింగపూర్‌లో చిక్కుకొన్న 699 మంది భారతీయులను మనదేశం ప్రత్యేక విమానాల్లో తీసుకొచ్చింది.

#### ప్రమాదంలో బ్రిటన్ వైద్యులు

తీవ్ర ప్రమాదకర పరిస్థితుల మధ్య వైద్యులు కొవిడ్-19 ఆస్పత్రుల్లో సేవలందిస్తున్నారని భారత సంతతి వైద్యుడు, బ్రిటన్ మెడికల్ అసోసియేషన్ మండలి చైర్మన్ చాంద్ నాగ్‌పాల్ ఆందోళన వ్యక్తం చేశారు. వ్యక్తిగత రక్షణ దుస్తుల కొరత వారి ప్రాణాలను ఆపదలో పడేస్తోందని ఆయన వాపోయారు.

#### ఇంటి వద్దే 'పీపీఈ'ల పని

ఇండోనేసియాలో కరోనాపై పోరాటం చేస్తున్న వైద్యులు, సిబ్బందికి కొరత పడిన వ్యక్తిగత రక్షణ దుస్తులను (పీపీఈ) కుట్టి ఇవ్వడానికి మర్యాతీ డీముర్సీ అనే మహిళ ముందుకొచ్చారు. వైద్యులు పంపించిన హజ్మట్ కోటు ఆధారంగా మరిన్ని కోటులను దర్జీల ద్వారా ఆమె సిద్ధం చేయించారు. ఇప్పటికి 20 ఆస్పత్రులకు పీపీఈలను అందించారు. ఆర్డర్ మేరకు రాత్రింబవళ్లు వాటిని సరఫరా చేస్తున్నారు.

నవ్య | చిత్రజ్యోతి

### ఎంత ఉపయోగపడిందన్నదే ముఖ్యం

**- రకుల్**



"మనం సంపాదించిన దానిలో ఎంతో కొంత సమాజానికి తిరిగి ఇవ్వాలన్న సిద్ధాంతాన్ని నేను నమ్ముతాను. చిన్నప్పటి నుంచి నేను అలాగే పెరిగాను. 18 ఏళ్ల వయసులో నేనందుకున్న మొదటి జీతాన్ని మా నాన్న గురుద్వార్‌లో విరాళంగా ఇప్పించారు. కష్టంలో ఉన్నవారికి సాయం చేయగలిగే శక్తి నాకుంది" అని రకుల్ తెలిపారు. లాక్‌డౌన్ కారణంగా గురుగామ్‌లోని స్లమ్ ఏరియాలో నివసిస్తున్న 200 మందికి నెలరోజులపాటు, అవసరమైతే మరో నెలకి కూడా భోజనం అందిస్తానని ఇటీవల రకుల్‌ప్రీత్ సింగ్ తెలిపిన సంగతి విదితమే! ఆమె మాట్లాడుతూ "ప్రస్తుతం ఉన్న క్లిష్ట పరిస్థితుల్లో అవసరమైన వాళ్లకి తగినంత సాయం అందించడం చేయగల స్థాయిలో ఉన్నవారి బాధ్యత. మా సొసైటీలో ఆరోగ్యవంతంగా తయారు చేసిన ఆహారాన్ని కొద్దిరోజులుగా మురికివాడలోని ప్రజలకు అందిస్తున్నాం. వాళ్లకి భోజనం పంపిణీ చేసే సమయంలో సామాజిక దూరం పాటించేలా జాగ్రత్తలు తీసుకుంటున్నాం. చేసిన సాయం చిన్నదా? పెద్దదా? అన్నది ముఖ్యం కాదు. ఆ సాయం ఎంతమందికి ఉపయోగపడిందనేది ముఖ్యం" అని రకుల్ అన్నారు.



### నిజమైన హీరోలకు సెల్యూట్

**- వెంకటేశ్**

"ప్రస్తుతం దేశం ఉన్న క్లిష్ట పరిస్థితుల్లో నిద్రాహారాలు మాని మన కోసం.. మన వారి కోసం ఎంతో శ్రమిస్తున్న వైద్యులు, పోలీసులు, పారిశుద్య కార్మికులే నిజమైన హీరోలు' అని వెంకటేశ్ అన్నారు. లాక్‌డౌన్ కారణంగా దేశవ్యాప్తంగా పోలీసులు అందిస్తున్న సేవలను ఆయన ప్రశంసించారు. "తమ కుటుంబాలను విడిచి కరోనా బాధితుల ప్రాణాలను కాపాడటంలో తీవ్రంగా శ్రమిస్తున్న వైద్యులు, కొవిడ్-19పై చేస్తున్న పోరాటంలో అద్భుతమైన సేవలు అందిస్తున్న పోలీసులకు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు. ఇలాంటి కష్టకాలంలో మన కోసం, మన కుటుంబాల కోసం కష్టపడుతున్న సిబ్బంది అందరికీ ధన్యవాదాలు. నిజమైన హీరోలైన మీ అందరికీ ఇదే నా సెల్యూట్" అని వెంకటేశ్ ట్విటర్‌లో పేర్కొన్నారు. "ఈ సంక్షోభ సమయంలో పని చేస్తూ, మనల్ని (ప్రజల్ని) కాపాడుతున్న మన సూపర్ హీరోలు... పోలీసులకు కృతజ్ఞతలు" అని వరుణ్ తేజ్ సామాజిక మాధ్యమాల్లో పేర్కొన్నారు.

### సాయం కాదిది.. తోడు

**- కొరటాల శివ**



కరోనా, లాక్ డౌన్ నేపథ్యంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న సినీ కార్మికుల అండగా నిలుస్తున్న కరోనా క్రైసిస్ ఛారిటీకి దర్శకుడు కొరటాల శివ రూ.5లక్షల విరాళం ప్రకటించారు. "పరిశ్రమలో రోజువారీ వేతనాతో జీవించే సినీ కార్మికులకు తోడుగా ఉంటాం. ఈ అందమైన కుటుంబంలో నేనూ భాగమే! అంతా కలిసే కఠిన పరిస్థితిపై పోరాడుదాం. నేను చేసింది. 'సాయం కాదు.. తోడు' అని ఆయన ట్విట్టర్‌లో పేర్కొన్నారు. ఇంతకుముందు ఆంధ్రా ముఖ్యమంత్రి సహాయనిధికి రూ. 5లక్షలు, తెలంగాణ సహాయనిధికి రూ. 5లక్షలు కొరటాల శివ అందించిన సంగతి తెలిసిందే!



### లాక్‌డౌన్ బ్రేక్ చేయవద్దు

**- విజయ్ దేవరకొండ**

"లాక్‌డౌన్ ఇంత విజయవంతంగా సాగుతుందంటే దానికి పోలీసులు, పభుత్వం నియమాలే కారణం. టైమ్‌పాస్ కోసం రోడ్ల మీదకొచ్చి లాక్‌డౌన్ బ్రేక్ చేయవద్దు" అని విజయ్ దేవరకొండ ప్రజల్ని కోరారు. లాక్ డౌన్ నేపథ్యంలో విధి నిర్వహణలో తీవ్రంగా కృషి చేస్తున్న హైదరాబాద్ పోలీసులకు డాక్టర్స్ అసోసియేషన్ ఫేస్ ప్రొటెక్షన్ కిట్‌లను అందజేసింది. ఈ కార్యక్రమానికి అతిథిగా హాజరైన విజయ్ దేవరకొండ మాట్లాడుతూ "లాక్‌డౌన్ సక్రమంగా సాగడానికి కృషి చేస్తున్న పోలీసులను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను. 24 గంటలూ పోలీసులు మనకోసం పని చేస్తున్నారు. వారికి సహకరించాల్సిన బాధ్యత మనపై ఉంది. ప్రజలు అందరూ ఇళ్లల్లోనే ఉండండి. త్వరలోనే ఈ కఠిన పరిస్థితి నుండి బయటపడతామనే నమ్మకం ఉంది" అని అన్నారు. పోలీసులకు మద్దతు తెలిపిన విజయ్‌కు తెలంగాణ డీజీపీ మహేందర్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

### థియేటర్లలోనే చూద్దాం

**- రామ్**

"రామ్ ఎటువంటి డైలమాలో లేడు. స్వీయ నిర్బంధం, సామాజిక దూరం వంటి ప్రభుత్వ ఆదేశాలను అనుసరిస్తూ... ఇంటిలో హాయిగా ఉన్నాడు (పదిహేనేళ్లుగా అతను ఉంటున్నట్టే). అలాగే, అతని అభిమానులు 'రెడ్' చిత్రాన్ని బిగ్ స్క్రీన్ (థియేటర్ల)లో చూడాలని ఎదురు చూస్తున్నాడు" అని హీరో రామ్ ట్వీట్ చేశారు. 'ఇస్మార్ట్ శంకర్' విజయం తర్వాత రామ్ నటిస్తున్న చిత్రం 'రెడ్'. 'స్రవంతి' రవికిశోర్ నిర్మాత. కిశోర్ తిరుమల దర్శకుడు. ఈ నెల 9న విడుదల చేయాలనుకున్నారు. లాక్‌డౌన్ కారణంగా సినిమా విడుదల కాలేదు. ఓటీటీ నుండి మంచి ఆఫర్ రావడంతో వాళ్లకు సినిమాను ఇవ్వాలా? వద్దా? అని రామ్ డైలమాలో ఉన్నట్టు ఆంగ్ల పత్రికలో వార్త వచ్చింది. దానిపై ఆయన స్పందించారు. డైలమాలో లేనని, థియేటర్లలో చిత్రాన్ని విడుదల చేయాలనుకుంటున్నట్టు రామ్ స్పష్టం చేశారు.



## డాక్టర్ సుధాకర్ సస్పెన్షన్‌ను రద్దు చేయాలి: హెచ్‌ఆర్‌ఎఫ్

విశాఖపట్నం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): నర్సీపట్నం ఏరియా ఆస్పత్రి ఎనస్థీషియన్ డాక్టర్ సుధాకర్‌ను సస్పెండ్ చేస్తూ ప్రభుత్వం జారీచేసిన ఉత్తర్వులను రద్దు చేయాలని మానవ హక్కుల వేదిక (హెచ్‌ఆర్‌ఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుధ, విశాఖ జిల్లా అధ్యక్షుడు శరత్ డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఎన్-95 మాస్కులను అవసరమైనన్ని సరఫరా చేయడం లేదన్నందుకు డాక్టర్‌ను సస్పెండ్ చేయడం, పోలీస్ కేసులు పెట్టడం అన్యాయమన్నారు. మాస్కుల కొరత విశాఖ జిల్లాలోనే కాక దేశవ్యాప్తంగా ఉందని, అందులో అవాస్తవం ఏమీలేదని వారు పేర్కొన్నారు.

### వైద్యుడి సస్పెన్షన్ రద్దు చేయాలి: పీఎంఎస్ఎఫ్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 11: నర్సీపట్నం ఏరియా ఆస్పత్రి వైద్యుడు సుధాకర్‌ను సస్పెండ్ చేస్తూ ప్రభుత్వం జారీచేసిన ఉత్తర్వులను రద్దు చేయాలని ప్రోగ్రెసివ్ మెడికోస్ అండ్ సైంటిస్ట్స్ ఫోరం(పీఎంఎస్ఎఫ్) డిమాండ్ చేసింది.

### 'నాడు-నేడు' వాయిదా వేయాలి: 'ఫ్యాప్టో'

అమరావతి, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): కరోనా వైరస్ వ్యాప్తి కారణంగా రాష్ట్రవ్యాప్తంగా లాక్‌డౌన్ కొనసాగుతున్న వేళ పాఠశాలల్లో 'నాడు-నేడు' పనులు వాయిదా వేయాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. రవాణ సౌకర్యాలు లేవని, గ్రామాల్లోనూ వ్యవసాయ పనులకే అనుమతిస్తున్నారని తెలిపింది. ఇనుము, ఇటుక, సిమెంట్ సేకరించేందుకు షాపులు లేవని.. ఈ పరిస్థితుల్లో నాడు-నేడు కొనసాగించాలని ఆదేశించడం వల్ల ప్రధానోపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ముఖ్యమంత్రికి రాసిన లేఖలో ఫ్యాప్టో పేర్కొంది. స్థానికంగా ఉన్న పాఠశాల విద్యా కమిటీలు కూడా పూర్తిగా పని చేయలేని పరిస్థితి నెలకొందని, ప్రధానోపాధ్యాయులు సమావేశాలు నిర్వహించడం, రవాణా లేని కాలంలో సామగ్రి కొనుగోలు సాధ్యం కావడం లేదని తెలిపింది.

### లాక్‌డౌన్ ఉల్లంఘన.. ఎమ్మెల్యేపై కేసు నమోదు

బుచ్చిరెడ్డిపాళెం, ఏప్రిల్ 11: లాక్‌డౌన్, 144 సెక్షన్ ఉల్లంఘనపై నెల్లూరు జిల్లా కోవూరు ఎమ్మెల్యే నల్లపురెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డితోపాటు, 9 మంది వైసీపీ నాయకులపై బుచ్చిరెడ్డిపాళెం పోలీసులు కేసు నమోదు చేశారు. బుచ్చిలోని డీఎల్ఎన్ఆర్ హైస్కూలు ప్రాంగణంలో ఎస్సీ, ఎస్టీలకు శుక్రవారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. అయితే, ఇక్కడ ఎమ్మెల్యే ప్రసన్న, అధికారులు లాక్‌డౌన్ నిబంధనలు ఉల్లంఘించారంటూ కొంతమంది సామాజిక మాధ్యమాల్లో వీడియో పోస్టు చేశారు. దీనిపై ఎస్పీ ఆదేశాల మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. తమపై కేసు నమోదు చేయడాన్ని నిరసిస్తూ వైసీపీ నాయకులతో కలిసి శనివారం బుచ్చి పోలీస్ స్టేషన్ ఎదుట ప్రసన్నకుమార్‌రెడ్డి ధర్నా చేశారు. పేదలను ఆదుకునేందుకు నిత్యావసర సరుకులు పంపిణీ చేసే కేసులు పెడతారా!? అంటూ నిలదీశారు.

### సారా తరలిస్తూ వలంటీర్ అరెస్ట్

ప్రత్తిపాడు, ఏప్రిల్ 11: సారా తరలిస్తూ ఓ గ్రామ వలంటీర్ ఎక్సైజ్ పోలీసులకు చిక్కాడు. ఈ సంఘటన శనివారం తూర్పుగోదావరి జిల్లా ప్రత్తిపాడు మండలం పెదశంకర్లపూడిలో చోటుచేసుకుంది. పెదశంకర్లపూడికి చెందిన గీసాల లోవరాజు గ్రామ వలంటీర్‌గా పనిచేస్తున్నాడు. విలాసాలకు అలవాటుపడి డబ్బు కోసం సారా తయారీకి పూనుకున్నాడు. పెదశంకర్లపూడిలోని స్నేహితుడు పిల్లి స్వామి సహాయంతో ఏలేరు రిజర్వాయర్ పరివాహక ప్రదేశాలు, ఏలేరు ఎడమకాలువ సమీపంలోని రహస్య ప్రదేశాలలో సారా బట్టీలను నడుపుతూ సారా తయారుచేసి ప్రత్తిపాడు, ఏలేశ్వరం మండలాల్లో అమ్ముతున్నాడు. ఈ క్రమంలో లోవరాజు, స్వామి సారా తరలిస్తుండగా పెదశంకర్లపూడి వద్ద ఎక్సైజ్‌పోలీసులు అరెస్ట్ చేశారు.

### వ్యాపారాల్లో మోసాలపై 585 కేసులు

అమరావతి, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో లాక్‌డౌన్ విధించిన తర్వాత ఇప్పటివరకూ వ్యాపారాల్లో మోసాలకు పాల్పడుతున్న వారిపై 585 కేసులు నమోదు చేసినట్లు లీగల్ మెట్రాలజీ కంట్రోలర్ కాంతారావు తెలిపారు.

### వెటర్నరీ వర్సిటీలో 'ఆన్‌లైన్' బోధన

తిరుపతి(విద్య), ఏప్రిల్ 11: కరోనా వైరస్ కారణంగా అన్ని విద్యాసంస్థలూ మూతపడిన విషయం తెలిసిందే. మరో రెండు నెలలకుపైగా విద్యార్థులకు తరగతులు బోధించే అవకాశం కనిపించడం లేదు. దీన్ని దృష్టిలో ఉంచుకుని తిరుపతిలోని శ్రీవేంకటేశ్వర వెటర్నరీ యూనివర్సిటీలో ఆన్‌లైన్ తరగతులకు వీసీ వై.హరిబాబు చర్యలు చేపట్టారు. ఈ నెల 9 నుంచే ఈ తరగతులు జరుగుతున్నాయి. వెటర్నరీ డీన్ డాక్టర్ టీఎస్ చంద్రశేఖరరావు, పాథాలజీ ప్రొఫెసర్ డాక్టర్ డాక్టర్ ఆనందకుమార్ సహకారంతో జూమ్ క్లౌడ్ మీటింగ్ యాప్ ద్వారా వెటర్నరీ (బీఎస్సీ) విద్యార్థులకు ఆన్‌లైన్‌లో పాఠ్యాంశాలు బోధిస్తున్నారు.

### మే 31 వరకు లాక్‌డౌన్ విధించాలి: చింతా మోహన్

తిరుపతి, ఏప్రిల్11(ఆంధ్రజ్యోతి): కరోనాను సమర్థంగా ఎదుర్కోవాలంటే మే 31వ తేదీ వరకు లాక్‌డౌన్ కొనసాగించాలని కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ సూచించారు. కరోనాను తేలిగ్గా తీసుకోవద్దని, అది పది నాగుపాముల కాటుతో సమానమని హెచ్చరించారు. వెంటిలేటర్లు కూడా ఉపయోగపడవని, వైరస్ వ్యాప్తిని అడ్డుకోవడమే ప్రధాన లక్ష్యమని, చైనా 70 రోజుల లాక్‌డౌన్ ఫలితాలను పరిశీలించి అయినా మనం కొనసాగించాలని ఆయన కోరారు.

### కృష్ణపట్నం పోర్టు ద్వారా మిర్చి ఎగుమతి

గుంటూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): క్లస్టర్ కంటైన్‌మెంట్ జోన్ కారణంగా ఈ నెలాఖరు వరకు గుంటూరు మిర్చియార్డుకు జిల్లా యంత్రాంగం లాక్‌డౌన్ ప్రకటించింది. అయితే ఇదే సమయంలో మొన్నటి వరకు నిలిచిన ఎగుమతుల ఆర్డర్స్ వచ్చాయి. వాటిని వదులుకోవడానికి ఇష్టపడని ఎక్స్‌పోర్టర్లు జీరో బిజినెస్‌కు తెరలేపారు. పైగా గతంలో ఎక్స్‌పోర్టు చేసినందుకు ఇన్‌పుట్ రూపంలో కేంద్రం 5 శాతం ఇచ్చే సబ్సిడీని తాజాగా 6.75 శాతానికి పెంచింది. ఇది ఎగుమతులకు మరింత ఊతమిస్తోంది. దీంతో కొంచెం ధర ఎక్కువ పెట్టి అయినా మిర్చిని ఎగుమతిదారులు కొనుగోలు చేస్తున్నారు. చైనా, మలేషియా, తైవాన్, సింగపూర్, కొలంబో నుంచి మిర్చి దిగుమతి ఆర్డర్స్ రావడం... అందుకు ఊతంగా నెల్లూరు జిల్లాలోని కృష్ణపట్నం పోర్టు తెరుచుకోవడం... లారీలు రాష్ట్రాల సరిహద్దులు దాటాల్సిన పరిస్థితి లేకపోవడంతో మిర్చి ఎగుమతులు జోరందుకొన్నాయి. నిత్యం లారీలు, కంటైనర్ల ద్వారా మిర్చి లోడింగ్ చేసి కృష్ణపట్నం పోర్టుకు తరలిస్తున్నారు. ఆ పోర్టు నెల్లూరులో ఉండటం, వ్యవసాయ ఉత్పత్తుల రవాణాకు ఎలాంటి ఆటంకాలు కలిగించొద్దని ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావడం వ్యాపారస్తులకు కలిసొచ్చాయి. జీరో బిజినెస్ వలన మిర్చియార్డు రూ.4 కోట్లు ఆదాయం కోల్పోతుందని భావిస్తున్నారు.

### నీటితొట్టిలో పడి చిన్నారి మృతి

లాక్ డౌన్ కారణంగా రాలేకపోయిన తండ్రి

రాజంపేట, ఏప్రిల్ 11: ఆత్మీయులు మృతి చెందినా కరోనా మహమ్మారి వల్ల కడసారి చూపునకూ నోచుకోలేకపోతున్నారు. శనివారం కడప జిల్లా రాజంపేటలోని బి.ఎస్.హాల్ సమీపంలో సన అనే మూడేళ్ల చిన్నారి నీటితొట్టిలో పడి చనిపోయింది. కువైత్‌లో ఉన్న ఆ చిన్నారి తండ్రి మస్తాన్.. విమాన రాకపోకలు లేకపోవడంతో బిడ్డను కడసారి చూసుకునేందుకు రాలేకపోయాడు. భార్య, బంధువులు వీడియో కాల్‌ద్వారా చిన్నారి మృతదేహాన్ని మస్తాన్‌కు చూపిస్తూ కన్నీటిపర్యంతమయ్యారు.

## చితికిన బంతి రైతు బతుకు!

▸ ధరల పతనం.. పంట పశువులపాలు

బంతిపూల రైతు బతుకు చితికిపోయింది.. లాక్‌డౌన్ వారి ఆదాయానికి తీవ్రంగా గండికొట్టి అప్పులపాల్జేశాయి.. ధరలు ఒక్కసారిగా పడిపోవడంతోపాటు, కొనేవారే లేకపోవడంతో చిత్తూరు జిల్లాలోని కుప్పం నియోజకవర్గవ్యాప్తంగా రైతులు గగ్గోలు పెడుతున్నారు. ఈ సీజన్‌లో ఏకంగా రూ.6 కోట్ల ఆదాయాన్ని రైతులు నష్టపోయారు. నియోజకవర్గంలో ఆఫ్రికన్ మేరీగోల్డ్ రకం హైబ్రిడ్ బంతిపూల సాగు అధికం. ప్రతి సీజన్‌లో 400-500 ఎకరాల్లో బంతి సాగుచేస్తారు. ఎకరా సాగుకు రూ.50 వేల వరకు ఖర్చవుతుంది. 3-5 టన్నుల దాకా దిగుబడి వస్తుంది. డిమాండు అధికంగా ఉన్నప్పుడు కిలో పూలు రూ.80.. అథమంగా రూ.25-రూ.30 పలికేది. ప్రస్తుతం లాక్‌డౌన్ పరిస్థితులతో రవాణా సౌకర్యాలు లేక, మార్కెట్ పూర్తిగా స్తంభించిపోయి ఇతర ప్రాంతాలకు ఎగుమతులు నిలిచిపోయాయి. ఫలితంగా కిలో పూలు రూ.3 నుంచి రూ.5కు పడిపోయాయి. ఇప్పుడు ఆ ధరకూ కొనేవారు లేక వీధుల్లో పారబోస్తున్నారు. అధికశాతం మంది రైతులు పూలను కోయకుండా పశువులకు ఆహారంగా వదిలేస్తున్నారు. అప్పులు తెచ్చి సాగు చేశామని, ఇప్పుడు నిండా మునిగిపోయామని ప్రభుత్వమే ఆదుకోవాలని వేడుకుంటున్నారు. -కుప్పం



కుప్పం పూల మార్కెట్టు వద్ద పారేసిన బంతిపూలను మేస్తున్న పశువులు, బంతిపూల తోట (ఇన్‌సెట్లో)

## ఉత్పత్తి లేదు.. ఆదాయం రాదు

▸ కరోనా కష్టాలు.. లాక్‌డౌన్‌తో ఇబ్బందులు
▸ ఎగుమతుల్లేవు. దిగుమతుల్లేవు
▸ చిన్న, మధ్య పరిశ్రమల మనుగడకే ముప్పు
▸ 2 వేల కోట్లు బకాయిపడిన ప్రభుత్వం
▸ ఏడాదికిపైగా ప్రోత్సాహకాలు పెండింగ్
▸ ఇవన్నీ ఇస్తేనే కొంతైనా ఊరట
▸ లేదంటే మూతపడడం ఖాయం
▸ పారిశ్రామిక వర్గాల ఆవేదన

అమరావతి, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): తక్కువ పెట్టుబడితోనే ఎక్కువ మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు.. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ఆదాయం సమకూర్చే చిన్న, మధ్యతరగతి పరిశ్రమ(ఎస్ఎంఎస్ఈ)లను కరోనా కష్టాలు చుట్టుముడుతున్నాయి. సుదీర్ఘ లాక్‌డౌన్‌తో ఉత్పత్తి ఆగిపోవడం, ఎగుమతి, దిగుమతులు నిలిచిపోవడంతో వాటికి ఆదాయమే లేకుండా పోయింది. అదే సమయంలో కార్మికులు వేతనాలు, ఇతర స్థిర ఖర్చుల చెల్లింపు భారంగా మారుతోంది. ఫలితంగా.. అసలే అంతంత మాత్రంగా ఉన్న వాటి ఆర్థిక పరిస్థితి మరింత ఇబ్బందికరంగా పరిణమిస్తోంది. ఇప్పటివరకు జరిగిన పరిణామాలు ఒక ఎత్తయితే.. భవిష్యత్ ఎలా ఉంటుందన్నది అగమ్యగోచరంగా ఉందని ఆయా పారిశ్రామిక వర్గాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. లాక్‌డౌన్ తర్వాత ఈ కష్టాల నుంచి గట్టెక్కాలంటే ప్రభుత్వం తమకు ఇవ్వాల్సిన ప్రోత్సాహక బకాయిలు ఇస్తేనే కొంతైనా ఊరట లభిస్తుందని అంటున్నారు. ప్రభుత్వం చిన్న, మధ్యతరగతి పరిశ్రమలకు ఇవ్వాల్సిన పెట్టుబడి రాయితీలు, ఇతర ప్రోత్సాహకాలు కలిపి సుమారు రూ.2వేల కోట్లున్నాయి. వాస్తవానికి ప్రతి మూడు నెలలకు ఒకసారి వీటిని చెల్లించాలి. అయితే 2018 డిసెంబరు తర్వాత ఈ ప్రోత్సాహకాలను చెల్లించలేదని సమాచారం. సుమారుగా ఏడాది పైనుంచి ఎంఎస్ఎంఈలకు వీటిని చెల్లించలేదు. టెక్స్‌టైల్స్ రంగంలోని చిన్న, మధ్యతరగతి పరిశ్రమలకు కలిపి చెల్లించాల్సిన బకాయిలు రూ.1,500 కోట్లు, ఫుడ్ ప్రాసెసింగ్‌లో సుమారు రూ.120 కోట్లు, ఆక్వా రంగ పరిశ్రమలకు రూ.100కోట్లు బకాయిలు ఉన్నాయి. కొన్ని ఇతర రంగాల పరిశ్రమలకూ ఇలాంటి బకాయిలు ఉన్నాయని సమాచారం.

#### మధ్యలో ఆగినవి కొన్ని..

రాష్ట్రంలో టెక్స్‌టైల్స్, ఆహారశుద్ధి, ఆక్వా తదితర రంగాల్లో పలు చిన్న, మధ్యతరహా పరిశ్రమలు ఉన్నాయి. వీటిని నెలకొల్పే సమయంలో అవసరమయ్యే పెట్టుబడిలో కొంత ప్రమోటర్, కొంత బ్యాంకు రుణం, మరికొంత ప్రభుత్వ ప్రోత్సాహకంగా ఉంటుంది. ఈ మూడూ భాగాలు కలిస్తేనే పరిశ్రమ స్థాపన పూర్తవుతుంది. ఇలాంటివి అన్ని రంగాల్లో కలిపి సుమారు 200 పరిశ్రమలు ఉన్నాయి. ఇవన్నీ ఇప్పుడు నిర్మాణ, స్థాపన దశల్లో ఉన్నాయి. ప్రభుత్వం నుంచి రావలసిన పెట్టుబడి రాయితీ రాకపోవడం వల్ల పలు పరిశ్రమల స్థాపన మధ్యలోనే ఆగిపోయింది. కొందరికి ప్రభుత్వం ఆ తర్వాత రాయితీలిచ్చినా..

ముందు పరిశ్రమ నిర్మాణం పూర్తిచేయాలన్న సంకల్పంతో అప్పులు చేసి మరీ కిందామీద పడుతున్నారు. మరికొందరు తమ వల్ల కాదని వదిలేస్తున్నారు. ఇప్పుడు కరోనా, లాక్‌డౌన్ ప్రభావంతో పరిస్థితి మరింత ఇబ్బందిగా మారనుందని పలువురు పేర్కొంటున్నారు. ఇలా నిర్మాణ దశల్లో ఉన్న పరిశ్రమలన్నిటికీ రాష్ట్ర ప్రభుత్వం బకాయిలు చెల్లించాలంటున్నారు. మరోవైపు.. ఇప్పటికే నడుస్తున్న పరిశ్రమలకు సంబంధించి...ఇవ్వాల్సిన రాయితీలు, ప్రోత్సాహకాలు కూడా ఉన్నాయి. వీటిలో చాలా భాగం కేంద్ర ప్రభుత్వం నుంచే వస్తోంది. కేంద్రం నుంచి రాష్ట్రానికి వస్తే.. రాష్ట్ర ప్రభుత్వం పరిశ్రమలకు ఇవ్వాలి. కేంద్రం వాటా నిధులు వచ్చినా.. రాష్ట్ర ప్రభుత్వం వాటిని వేరే అవసరాలకు వినియోగించుకుని ఉండొచ్చని అంచనా వేస్తున్నారు. ఇది సహజంగా చాలాచోట్ల జరిగే ప్రక్రియే అయినా...ఈ లాక్‌డౌన్ నేపథ్యంలో ఇప్పుడు ఎంఎస్ఎంఈలకు బకాయిలు సర్దుబాటు చేయకుంటే మాత్రం ఇబ్బంది అవుతుందని సంబంధిత వర్గాలు వాపోతున్నాయి.

#### ఆదాయానికి, ఉపాధికి గండి

లాక్‌డౌన్ అనంతరం ఎంఎస్ఎంఈలకు ఇవ్వాల్సిన నిధులను విడుదల చేయడమే కాకుండా.. వాటిని సరైన రీతిలో ఆదుకోకపోతే ఆ ప్రభావం రాష్ట్ర ఆదాయం, యువత ఉద్యోగాలపైనా పడుతుందని అంటున్నారు. పరిశ్రమలు నడవలేని పరిస్థితి వస్తే.. లేదంటే వాటి ఆదాయాలు తగ్గిపోతే ఆ మేరకు ఉద్యోగుల సంఖ్యలో కోత విధిస్తాయి. ఈ ఉద్యోగాల కోత మరింతమంది జీవితాలపై దుష్ప్రభావం చూపుతుంది. అదే సమయంలో ప్రభుత్వ ఆదాయంలోను కొంత కోత పడుతుంది. ఉదాహరణకు మ్యాంగో పల్ప్ తయారు చేసే పరిశ్రమను తీసుకుంటే.. అది తయారైన ఉత్పత్తిపై అటు కేంద్ర, ఇటు రాష్ట్ర జీఎస్టీని చెల్లిస్తుంది. పరిశ్రమ ఇబ్బందుల్లో ఉండి నడవకుంటే ఈ జీఎస్టీ ఆదాయం ప్రభుత్వానికీ తగ్గుతుంది. ఈ నేపథ్యంలో లాక్‌డౌన్ కష్టాలను ఎదుర్కోవడానికి బకాయిలు విడుదలతో పాటు ఇతరత్రా ప్రోత్సాహకాలు ఇస్తే తప్ప పరిశ్రమల మనుగడ, ఉపాధి అవకాశాలు, ఆదాయాల సముపార్జన జరిగే పరిస్థితి ఉండదని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

## ధాన్యం కొను'గోల'!

▸ ఎకరానికి 2.88 టన్నులకే అనుమతి
▸ పరిమితి పెంచాలని రైతుల డిమాండ్

తాడేపల్లిగూడెం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ధాన్యం కొనుగోలుకు పరిమితులు విధించడం రైతులను ఇబ్బందులకు గురిచేస్తోంది. గత ఖరీఫ్‌లో ఎకరాకు 2.88 టన్నుల మేర కొనుగోలు చేసేందుకు అనుమతిచ్చింది. ఇప్పుడు అదే పరిమితిని రబీకి వర్తింపజేయడం విమర్శలకు దారితీస్తోంది. పశ్చిమ గోదావరి జిల్లాలో రబీ సీజన్‌లో ఎకరాకు నాలుగు టన్నులకు పైగా ధాన్యం దిగుబడి ఉంటుంది. సగటున 55 బస్తాల వరకు దిగుబడి వచ్చే అవకాశం ఉంది. ప్రభుత్వం మాత్రం ఎకరాకు 2.88 టన్నుల కొనుగోలుకు పరిమితి విధించడంతో మిగులు ధాన్యాన్ని ఎలా విక్రయించాలన్న విషయమై రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ రబీలో 13.60 లక్షల టన్నులు దిగుబడి వస్తుందని అంచనా. రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుత సీజన్‌లో జిల్లాలో 10 లక్షల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ప్రాథమికంగా నిర్ణయించింది. అందుకు అనుగుణంగా ప్రతి మండలంలో కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్నారు. జిల్లా నుంచి కృష్ణా, తూర్పు గోదావరి జిల్లాలకు కొంతమేర ధాన్యం ఎగుమతులు జరుగుతుంటాయి. మిగిలిన ధాన్యాన్ని రైతులు జిల్లాలోనే అమ్ముకోవాల్సి ఉంటుంది. అయితే రబీ ధాన్యానికి బహిరంగా మార్కెట్‌లో అంతగా డిమాండ్ ఉండదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం విధించిన కొనుగోలు పరిమితితో దళారులకే ప్రయోజనం చేకూరే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రభుత్వం కొనుగోలు చేయగా మిగిలిన ధాన్యాన్ని దళారులు మద్దతు ధర కంటే తక్కువకు కొనుగోలు చేస్తారు. తాము నష్టపోకుండా ప్రభుత్వమే ధాన్యం కొనుగోలు పరిమితిని పెంచాలని, ఆ దిశగా అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.



కొవ్వలిలో ఎద్దుల బళ్లపై ధాన్యం తరలిస్తున్న రైతులు

## కరోనా పెన్షన్.. రాష్ట్రానికి టెన్షన్

కేంద్రం ఇచ్చే పింఛను సాయం ఏంచేద్దాం!.. అది వచ్చేది 9 లక్షల మందికే

▸ రాష్ట్రంలో 53 లక్షల మంది లబ్ధిదారులు
▸ అందరికీ పంచితే అదనపు భారం
▸ కొందరికే పరిమితం చేస్తే తీవ్ర అసంతృప్తి
▸ మల్లగుల్లాలు పడుతున్న రాష్ట్రప్రభుత్వం

అమరావతి, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): కేంద్రం నుంచి రాష్ట్రానికి కరోనా సాయం కింద రూ.10 వేల కోట్ల నిధులు వస్తున్నాయని రాష్ట్రప్రభుత్వం ఓవైపు సంతోషిస్తున్నా.. మరోవైపు ఈ నిధులు దానికి ప్రాణసంకటం కూడా అవుతున్నాయి. కేంద్రప్రభుత్వం లబ్ధిదారులకే నేరుగా ప్రయోజనాలు అందిస్తున్నా.. కొన్ని రకాల సాయం రాష్ట్ర ప్రభుత్వ సహకారంతోనే అందించాల్సి ఉంది. కరోనా సాయం కింద కేంద్రం దేశవ్యాప్తంగా వృద్ధులు, వికలాంగులు, వితంతు పింఛనుదారులకు వచ్చే మూడు నెలల్లో అదనంగా రెండు దఫాలుగా మరో రూ.1000 అందించాలని నిర్ణయించింది. అది రాష్ట్రాలకు ఇచ్చే దామాషా ప్రకారం మన రాష్ట్రంలో ఈ మూడు కేటగిరీలకు చెందిన లబ్ధిదారుల సంఖ్య 9 లక్షలుగా లెక్కించింది. అంటే కేంద్ర ప్రాయోజిత పథకం ద్వారా ప్రతి ఏటా కేంద్రం నుంచి రాష్ట్రానికి 9 లక్షల మందికి ఈ మూడు రకాల పెన్షన్లకు నిధులందిస్తోంది. అయితే రాష్ట్రంలో 58 లక్షల మందికి సామాజిక పింఛన్లు అందిస్తుండగా.. వారిలో వృద్ధులు, వితంతువులు, వికలాంగులే 53 లక్షల మంది ఉన్నారు. కేంద్రం ప్రకటించిన ప్రకారం రాష్ట్రంలోని సామాజిక పెన్షనర్లందరికీ కేంద్ర సాయం అందించాలంటే రూ.530 కోట్లు అవసరం. అయితే కేంద్రం ఆంధ్రప్రదేశ్‌కు.. 9 లక్షల మంది పెన్షనర్లకు అదనపు సాయంగా రూ.90 కోట్లు మాత్రమే అందిస్తోంది. అందులో భాగంగా మొదట ఒక్కొక్కరికి రూ.500 చొప్పున అందించేందుకు ఇప్పటికే రాష్ట్రానికి రూ.45 కోట్లు మంజూరుచేసినట్లు సమాచారం. త్వరలో రెండో విడత రూ.45 కోట్లు మంజూరవుతాయి.

#### రాష్ట్రప్రభుత్వం తర్జనభర్జన..

కేంద్రమిచ్చిన పెన్షనర్ల సాయం రాష్ట్రంలో పంపిణీ చేయాలా.. వద్దా అనే మీమాంసలో ప్రభుత్వం పడింది. కేంద్రమిస్తున్న సాయం ఎటూ చాలదని.. ఎలాగూ దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో ఒక్కో పింఛనుదారుకు రూ.2,250 ఇస్తున్నందున కేంద్ర సాయం పంచకపోవడమే మంచిదని కొందరు ఉన్నతాధికారులు సలహా ఇస్తున్నట్లు తెలిసింది. ఇప్పటికే బీజేపీ నేతలు కేంద్ర పథకాల పంపిణీకి సంబంధించి రాష్ట్రప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారు. ఇప్పుడు కేంద్ర సాయం పంచకుంటే మరింతగా విమర్శిస్తారని మరికొందరు పేర్కొంటున్నారు. ఈ మూడు రకాల పెన్షనర్ల కోసమే కేంద్ర ప్రభుత్వం సాయం ప్రకటించింది. అయితే మన రాష్ట్రంలో 10 రకాల పెన్షన్ దారులు ఉన్నారు. ఈ 3కేటగిరీలు మినహాయిస్తే మిగిలిన పెన్షన్‌దారులు మరో 6 లక్షల మంది ఉన్నారు. పెన్షన్ దారులకు కేంద్ర సాయం పంపిణీ చేయాల్సి వస్తే.. మొత్తం 58 లక్షల మందికి పంపిణీ చేయాలని... అప్పుడే రాష్ట్ర ప్రభుత్వంపై అసంతృప్తి లేకుండా ఉంటుందని అంటున్నారు. సామాజిక పెన్షనర్లను సంతృప్తిపరచాలని నిర్ణయం తీసుకుంటే రాష్ట్ర ప్రభుత్వంపై రూ.490 కోట్లు భారం పడుతుందని చెబుతున్నారు. ఈ పరిస్థితుల్లో కేంద్ర సాయం పంపిణీపై ముఖ్యమంత్రి జగన్ తుది నిర్ణయం తీసుకుంటారని అధికారులు పేర్కొంటున్నారు.

### జ్యోతీరావ్ పూలే సేవలు చిరస్మరణీయం: సీఎం

అమరావతి, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి) మహాత్మా జ్యోతిరావు పూలే సేవలు చిరస్మరణీయమని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి జగన్ నివాళులు అర్పించారు. నేటి తరానికి ఆయన సేవలు స్ఫూర్తిదాయకమన్నారు. పూలే ఆశయాలే స్ఫూర్తిగా పాలన సాగిస్తున్నామని సీఎం అన్నారు.

### పూలే టీడీపీకి స్ఫూర్తి: చంద్రబాబు

"తెలుగుదేశం పార్టీ స్థాపనకు స్ఫూర్తి ప్రదాతల్లో జ్యోతిరావ్ పూలే ఒకరు. ఎన్నో సామాజిక సంస్కరణలకు నాంది పలికి, సమసమాజ స్థాపనకై తన జీవితాన్ని అంకితం చేసిన ఆ మహానుభావుని స్ఫూర్తితోనే బీసీల అభ్యున్నతికి ఆది నుంచి కృషి చేస్తోంది" అని టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు పేర్కొన్నారు. పూలే జయంతి సందర్భంగా శనివారం ట్విటర్ వేదికగా నివాళులర్పించారు.

### పరిశ్రమల శాఖ ప్రత్యేక కార్యదర్శిగా బాలసుబ్రమణ్యం రెడ్డి

అమరావతి, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): పరిశ్రమలు, వాణిజ్య శాఖలో ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శిగా ఎస్.బాలసుబ్రమణ్యం రెడ్డిని నియమించారు. పెట్టుబడులు, ఉక్కు శాఖల వ్యవహారాలను ఈయన చూస్తారని పేర్కొన్నారు. ఐటీఎస్ అధికారిగా ఆయన అడిషనల్ డైరక్టర్ జనరల్ ఫారిన్ ట్రేడ్ విభాగంలో పనిచేశారు. డిప్యూటేషన్‌పై వచ్చిన ఆయనను పరిశ్రమలశాఖలో నియమిస్తూ శనివారం ఉత్తర్వులిచ్చారు.

### రైతు కన్నీరు పెడుతుంటే... రాజకీయాలా?: లోకేశ్

అమరావతి, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): "ఆరుగాలం శ్రమించి దేశానికి అన్నం పెట్టే రైతన్న సర్వం కోల్పోయి పొలంలో కన్నీరు పెడుతున్నాడు. సీఎం జగన్మోహన్ రెడ్డి మాత్రం రాజకీయాల్లో బిజీగా ఉన్నారు" అని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ విమర్శించారు. తక్షణమే ప్రభుత్వం పంట నష్టాన్ని అంచనా వేసి రైతాంగాన్ని ఆదుకోవాలని లోకేశ్ శనివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు.

### మత్తులో సంతకాలు.. తలుచుకొంటే బాధేస్తోంది: బుద్దా

విజయవాడ, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): సీఎం జగన్ తీరుపై ట్విటర్ వేదికగా ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న మరోసారి వ్యాఖ్యలు చేశారు. "నమ్మినవారిని తనతోపాటు జైలుకి తీసుకెళ్లడం జైలు జగ్గడుకి అలవాటు. దేశంలోనే ఉత్తమ ఐఏఎస్ అధికారులుగా ట్రాక్ రికార్డు ఉన్న అధికారులకు బ్లూ వైరస్ ఎక్కించి జీవచ్ఛవాలుగా మార్చేసి ఆసుపత్రి పాలుచేశాడు. తండ్రి అధికారంలో ఉంటేనే అంతమందిని మింగేశాడు. ఇక ఇప్పుడు అధికారంలో ఉన్నాడు. మత్తులో సంతకాలు పెడుతున్నవారి పరిస్థితి తలచుకుంటేనే బాధేస్తోంది" అని వెంకన్న ట్వీట్ చేశారు. డీజీపీకి లేఖ రాస్తూ.. "లాక్‌డౌన్ నిబంధనలను ఉల్లంఘిస్తున్న మంత్రులు, వైసీపీ నేతలపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి. తక్షణం వారిని క్వారంటైన్ చేయాలి" అని డిమాండ్ చేశారు.

### చిన్న వ్యాపారి పెద్దమనసు

వెంకటగిరి, ఏప్రిల్ 11: హైదరబాదులో చిరు వ్యాపారం చేస్తున్న నెల్లూరు జిల్లా వెంకటగిరి వాసి కరోనా బాధితులకు ఆపన్న హస్తం అందించారు. వెంకటగిరి ఎన్టీఆర్ కాలనీకి చెందిన రాజేంద్రప్రసాద్ హైదరాబాదులో చీరల వ్యాపారం చేస్తున్నారు. కరోనా బాధితుల కోసం ఆయన ఆ రాష్ట్ర మంత్రులు కేటీఆర్, తలసానికి రూ.2 లక్షలు చొప్పున శుక్రవారం విరాళం అందజేశారు.

## ఎవరి సొమ్ముతో ఎవరికి అండ?

▸ సీఎం పత్రికకు మంత్రి సురేశ్ ప్రకటన
▸ టారిఫ్ విలువ రూ.1.36 కోట్లు
▸ సమగ్ర శిక్షా విభాగంపై భారం!?
▸ తలలు పట్టుకున్న అధికారులు
▸ సీఎం పత్రికకు వరుసగా మంత్రుల ప్రకటనలు

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

'ముఖ్యమంత్రికి అండగా ఉందాం' అంటూ వరుసగా మంత్రులు సీఎం సొంత పత్రికలో మొదటి పేజీ ప్రకటనలు గుప్పిస్తున్నారు. అదేదో... ఎవరో చెప్పినట్లుగా ఒకరి తర్వాత ఒకరు ప్రకటనలు ఇచ్చేస్తున్నారు. వారి అధికారిక హోదాతో ప్రకటన ప్రచురితమవుతోంది. ఇదే కోవలో... విద్యాశాఖ మంత్రి ఆదిమూలపు సురేశ్ ఈ నెల 8వ తేదీన జగన్ పత్రికకు మొదటి పేజీ ప్రకటన ఇచ్చారు. ముఖ్యమంత్రిగారికి అండగా ఉందాం... అని ప్రజలకు పిలుపునిస్తూ, కరోనా వ్యాధి లక్షణాలు ఎలా ఉంటాయి? తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన శుభ్రత నియమాల గురించి ప్రకటనలో వివరించారు. సీఎం పత్రికలో మొదటి పేజీ మొత్తం (ఫుల్ పేజీ) ప్రకటన విలువ 1.36 కోట్ల రూపాయలు. కరోనా క్లిష్ట సమయంలో మంత్రులు ఇచ్చే ప్రకటనలు సీఎం సొంత పత్రికకు 'ఆర్థికంగా' అండగా ఉంటాయనడంలో సందేహంలేదు. (ముఖ్యమంత్రికి అండగా ఉండటమంటే ఇదేనా... అనే గుసగుసలూ వినిపిస్తున్నాయి) అయితే, మంత్రి ఆదిమూలపు సురేశ్ ఈ మొత్తాన్ని ఆయన సొంత జేబు నుంచి చెల్లిస్తున్నారా? లేక... సొంత శాఖ ద్వారా చెల్లించాలని ఆదేశించారా? అనేదే ఇక్కడ ప్రశ్న. ఇది సమాచార, పౌర సంబంధాల శాఖ (ఐ అండ్ పీఆర్) ద్వారా జారీ అయితే... ఆ వివరాలను ప్రకటన చివర్లో పొందుపరుస్తారు. అంటే, మంత్రి సొంతంగా ఇచ్చినట్లే. మరి... జీఎస్టీతో కలిపి రూ.1.36 కోట్లు నిజంగానే మంత్రి చెల్లిస్తారనుకోవాలా? పోనీ... 50 శాతం డిస్కౌంట్ ఇచ్చినా... రూ.68 లక్షలు ఆయన కడతారా? అంత డబ్బు ఎక్కడి నుంచి తెస్తారు!?

#### సమగ్ర శిక్షా విభాగంపై...

ఉద్యోగుల వేతనాలకు కోత పెట్టిన క్లిష్ట సమయంలో ప్రభుత్వ సొమ్ముతో ముఖ్యమంత్రి పత్రికకు ప్రకటన ఇవ్వడానికి మించిన దారుణం ఇంకొకటి ఉండదు. అలాకాదని... అది మంత్రి సురేశ్ సొంత ప్రకటన అంటే మరిన్ని చిక్కులు వస్తాయి. ఈ నేపథ్యంలో... ఈ ప్రకటన ఖర్చును తన పరిధిలోని విభాగాల ద్వారా చెల్లింపునకు ఒత్తిడి తెస్తున్నట్లు తెలిసింది. అంటే... ఇదీ ప్రజల సొమ్మే. సీఎం పత్రిక ఇచ్చిన 'అండగా ఉంటాం' ప్రకటన భారాన్ని ప్రకాశం జిల్లా సమగ్ర శిక్షా విభాగంపై మోపుతున్నట్లు తెలిసింది. కోటిపైనే విలువైన ప్రకటన ఖర్చును ఏ పద్దులో, ఎలా సర్దుబాటు చేయాలో అర్థంకాక అధికారులు తలలు పట్టుకున్నట్లు సమాచారం. కరోనా దెబ్బకు వ్యాపార, వాణిజ్య రంగాలే కాదు... మీడియా కూడా ఆర్థిక ఇబ్బందులకు గురవుతోంది. ప్రకటనల ఆదాయం దారుణంగా పడిపోయింది. సరిగ్గా ఇదే సమయంలో మంత్రులు వరుసగా ముఖ్యమంత్రి పత్రికకు ప్రకటనలు ఇస్తుండటం విశేషం.

## అమరావతి అంతమే మీ లక్ష్యమా?

▸ కరోనా విజృంభిస్తున్న వేళా కుట్రలా?
▸ మీ నియంతృత్వ ధోరణికి భయపడం
▸ 116వ రోజు అమరావతి రైతుల ఆందోళనలు

గుంటూరు, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): 'కరోనా వైరస్ గురించి ఏ మాత్రమూ సీరియస్‌గా వ్యవహరించకుండా క్లిష్ట పరిస్థితుల్లో ప్రజలను గాలికి వదిలేస్తూ, మాపైనా కక్ష సాధిస్తున్నారు. అమరావతిని అంతం చేయటమే సీఎం జగన్ అంతిమ లక్ష్యంలా పని చేస్తున్నారు' అని ఆ ప్రాంత రైతులు మండిపడ్డారు. అమరావతి నుంచే పాలనంతా కొనసాగించాలని డిమాండ్ చేస్తూ రైతులు చేస్తున్న ఉద్యమం శనివారానికి 116వ రోజుకు చేరింది. ప్రభుత్వం తమతో చేసుకున్న ఒప్పందాలకు విరుద్ధంగా ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుంటోందని, ఇటువంటి నియంతృత్వ ధోరణికి భయపడబోమన్నారు. ప్రాణం ఉన్నంత వరకూ పోరాడి అమరావతిని సాధించుకుంటామని నీరుకొండ, పెదపరిమి, పెనమాక రైతులు దీక్షా శిబిరాల్లో కూర్చొని నిరసనలు తెలిపారు. తుళ్లూరు, వెంకటపాలెం, అనంతవరం, మందడం, ఉద్దండరాయునిపాలెం, రాయపూడి, వెలగపూడి, కృష్ణాయపాలెం, అబ్బరాజుపాలెం, ఎర్రబాలెం.. ఇలా 29 గ్రామాల రైతులు, రైతు కూలీలు, మహిళలు ఇళ్ల ముందే వివిధ రూపాల్లో నిరసనలు తెలిపారు. ప్రతి ఇంటిపైనా నల్ల జెండా, పచ్చజెండా ఎగురవేశారు. ఇదిలావుండగా, రాజధానిపై ప్రభుత్వ తీరు మార్చుకోవాలంటూ రాత్రి 7:30 గంటలకు ఐదు నిమిషాలపాటు విద్యుత్ నిలిపి కొవ్వొత్తులు వెలిగించి 'అమరావతి వెలుగు' పేరిట రాజధాని మహిళలు చేస్తున్న నిరసన ప్రదర్శన వరుసగా శనివారం కూడా కొనసాగించారు.




వీధుల్లో నిరసనలు తెలుపుతున్న వెంకటపాలెం మహిళలు

దక్షిణ మధ్య రైల్వే
Follow us on @SCRailwayindia ద.మ. రైల్వేలోని టెండర్లు ప్రకటనల వివరాలను మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.in పై చూడవచ్చును

న్యూ గువహటి - యశ్వంత్‌పూర్, యశ్వంత్‌పూర్ - హజ్రత్ నిజాముద్దీన్, CST ముంబై - చెన్నై మధ్యన పార్శిల్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు
....రండి సౌకర్యాన్ని వినియోగించుకోండి

ప్రకటన

వివిధ ప్రాంతాలకు అవశ్యక ఐటమ్‌ల సరఫరా నిర్వహణే లక్ష్యంగా, దిగువ విధంగా దక్షిణ మధ్య రైల్వేలో స్టాపేజీలతో దిగువ పార్శిల్ రైళ్లు నడపబడుతున్నాయి.

రైలు నం. 00610, న్యూ గువహటి- యశ్వంత్‌పూర్ పార్శిల్ ఎక్స్‌ప్రెస్

| న్యూ గువహటి- యశ్వంత్‌పూర్ | | స్టేషన్స్ | తేది |
|---|---|---|---|
| వచ్చే సమయం | వెళ్ళే సమయం | | |
| 23.15 | 23.25 | విజయవాడ | 11.04.2020 |
| 05.25 | 05.35 | సికింద్రాబాద్ | 12.04.2020 |
| 11.35 | 11.45 | గుంతకల్ | 12.04.2020 |

Ex. న్యూ గువహటి 10.04.2020న

రైలు నం. 00605/00606 యశ్వంత్‌పూర్ -హజ్రత్ నిజాముద్దీన్- యశ్వంత్‌పూర్ పార్శిల్ ఎక్స్‌ప్రెస్ (వయా రాయిచూర్)

| యశ్వంత్‌పూర్ - H.నిజాముద్దీన్ | | స్టేషన్ | H.నిజాముద్దీన్- యశ్వంత్‌పూర్ | |
|---|---|---|---|---|
| వచ్చే సమయం | వెళ్ళే సమయం | | వచ్చే సమయం | వెళ్ళే సమయం |
| 02.45 | 02.55 | రాయిచూర్ | 04.10 | 04.20 |

Ex. యశ్వంత్‌పూర్ 13.04.2020న (14.04.2020న రాయిచూర్ ద్వారా వెళ్తుంది)
Ex. H.నిజాముద్దీన్ 15.04.2020న (17.04.2020న రాయిచూర్ ద్వారా వెళ్తుంది)

రైలు నం.00115/00116 CST ముంబై -చెన్నై - CST ముంబై పార్శిల్ ఎక్స్‌ప్రెస్ (వయా రేణిగుంట, గుంతకల్)

| CST ముంబై- చెన్నై | | స్టేషన్స్ | చెన్నై - CST ముంబై | |
|---|---|---|---|---|
| వచ్చే సమయం | వెళ్ళే సమయం | | వచ్చే సమయం | వెళ్ళే సమయం |
| 11.35 | 11.45 | గుంతకల్ | 16.50 | 17.00 |
| 15.25 | 15.35 | రేణిగుంట | 13.00 | 13.10 |

Ex. CST ముంబై రోజూ 14.04.2020 వరకు ( 15.04.2020 వరకు గుంతకల్ మరియు రేణిగుంట ద్వారా వెళ్తుంది)
Ex. చెన్నై రోజూ 14.04.2020 వరకు ( 14.04.2020 వరకు రోజూ రేణిగుంట మరియు గుంతకల్ ద్వారా వెళ్తుంది)
బుకింగ్స్ కొరకు సంబంధిత స్టేషన్ల వద్ద పార్శిల్ సూపర్‌వైజర్స్‌ను సంప్రదించగలరు.
ఈ రైళ్ల ద్వారా ప్రయాణానికి ఎటువంటి ప్రయాణీకులు అనుమతించబడరు.
A0483 మనమంతా కలిసి #కోవిడ్-19పై పోరాడుదాం
ఆల్ ఇండియా ప్యాసింజర్ హెల్ప్‌లైన్ 138 సెక్యూరిటీ హెల్ప్‌లైన్ 182

తెలంగాణలో ఇవ్వాళ ఎవరైనా మనుగడ సాగించాలంటే ఆధునిక నిజాం ప్రభువుకు గులాంగిరి చేయాల్సిందే! వైద్యుల సమస్యను వెలుగులోకి తెచ్చిన పాపానికి 'ఆంధ్రజ్యోతి'కి అత్యంత కఠినమైన శిక్ష విధిస్తానని కూడా కేసీఆర్ హెచ్చరించారు. మంచిదే! అంతా తనకే తెలుసును అని భావిస్తున్న కేసీఆర్‌కు ఒక విషయం గుర్తుచేయాలి. ప్రభుత్వాలు కేసులు మాత్రమే పెట్టగలవు. శిక్షలు విధించే అధికారం న్యాయస్థానాలకే ఉంటుంది. అయినా వాళ్లకీ, వీళ్లకీ కరోనా సోకాలని శపించడం ద్వారా ఆ వైరస్ వ్యాప్తిని పరోక్షంగా ప్రోత్సహిస్తున్న మీకే న్యాయంగా శిక్ష పడాలి!

యూట్యూబ్‌లో 'కొత్త పలుకు' కోసం QR Code scan చేయండి

కొత్త పలుకు

ఆర్కే RK



# లోపాలు చూపితే శాపాలా?!

"నాకు కరోనా వైరస్ సోకాలని తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ శపించారు". అయితే ఆయన కంటే అత్యంత శక్తిమంతుడైన దేవుడి దయవల్ల నేను ఇప్పటివరకు క్షేమంగానే ఉన్నాను. అయినా మహమ్మారి కరోనా బారి నుంచి ప్రజలందరినీ రక్షించాల్సిన ముఖ్యమంత్రి ఫలానా వారికి కరోనా వైరస్ సోకాలని శపించడం ఏమిటి? హద్దులు లేని అసహనానికి ఇది నిదర్శనం కాదా? ఇంతకీ శాపం పెట్టాల్సినంత తప్పు నేను గానీ, 'ఆంధ్రజ్యోతి' గానీ ఏమి చేసినట్టు? 'వైద్యులకు రక్షణ ఏది?' అన్న శీర్షికన ప్రచురించిన వార్తలో పీపీఈ కిట్లు చాలినన్ని లేవు అని పేర్కొన్నాం. 40 వేలకు పైగా కిట్లు స్టాక్ ఉన్నాయని విలేకరుల సమావేశంలో

> సొంతంగా ఆలోచించే అవసరం లేకుండా తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ తీసుకుంటున్న నిర్ణయాలనే తాను కూడా ప్రకటిస్తూ వచ్చిన జగన్మోహన్‌రెడ్డిలో ఇప్పుడు అసహనం కట్టలు తెంచుకుంటోంది. ఈనెల ఐదవ తేదీన తొమ్మిది నిమిషాలపాటు ఇంటి బయటకు వచ్చి కొవ్వొత్తులు వెలిగించాలన్న ప్రధాని నరేంద్ర మోదీ పిలుపులో భాగంగా.. ఆ కార్యక్రమంలో పాల్గొన్న జగన్మోహన్‌రెడ్డిని గమనిస్తే ఆయన ఎంత అసహనంగా ఉన్నారో తెలుస్తుంది. ఇంటి వెలుపలకు మూడు నిమిషాలు ఆలస్యంగా వచ్చిన జగన్మోహన్‌రెడ్డి తొమ్మిది నిమిషాలు కూడా పూర్తికాక ముందే లోపలకు వెళ్లిపోవడానికి రెండు మూడు పర్యాయాలు ప్రయత్నించారు. అధికారులు వారించడంతో ఆగిపోయారు.

కేసీఆర్ చెప్పినప్పటికీ, గవర్నర్‌కు సమర్పించిన నివేదికలో ఆరు వేల కిట్లు మాత్రమే ఉన్నాయని తెలిపారు. అయినా రెండు నెలల క్రితం వరకు కరోనా మహమ్మారి గురించి మనకు తెలియదు కనుక ఏ ప్రభుత్వమైనా పీపీఈ కిట్లను సేకరించి పెట్టుకోదు. ముప్పు ముంచుకొచ్చినప్పుడు ఎదురవుతున్న ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తేవడం మీడియా బాధ్యత! ఇందులో మేం గానీ, మరొకరు గానీ బాధ్యతారహితంగా ప్రవర్తించింది ఎక్కడ? ఆ మాటకొస్తే కరోనా విషయంలో ముఖ్యమంత్రి కేసీఆరే తొలుత బాధ్యతారహితంగా వ్యాఖ్యలు చేశారు. "కరోనా కూడా మామూలు జ్వరం లాంటిదే. పారాసిటమాల్ ట్యాబ్లెట్ వేసుకుంటే తగ్గిపోతుంది" అని మాట్లాడటం బాధ్యతారాహిత్యం కాదా? ఇంద్రుడుకి ఒళ్లంతా కళ్లు అన్నట్టుగా కేసీఆర్‌కు లేవు కదా!? రాష్ట్రంలో ఎక్కడ ఏమి జరుగుతున్నదో మనో నేత్రంతో తెలుసుకోలేరు కదా? ప్రభుత్వ నిర్ణయాలలోని లోపాలను, వ్యవస్థలోని లొసుగులను పాలకుల దృష్టికి తీసుకురావడానికే మీడియా ఉంటుంది. లాక్‌డౌన్ వల్ల ఆదాయం తగ్గి ప్రభుత్వ ఉద్యోగులకు జీతాల్లో 50 శాతం కోత విధించాలని కేసీఆర్ సర్కార్ నిర్ణయం తీసుకున్నప్పుడు.. ఈ మహమ్మారి నుంచి ప్రజలను కాపాడటానికి అహర్నిశలు ప్రాణాలను పణంగా పెట్టి పోరాడుతున్న వైద్య సిబ్బందికి కూడా జీతాల్లో కోత విధించడం ఏమిటి? అని 'ఆంధ్రజ్యోతి' ప్రశ్నించడం వల్లనే కదా ప్రభుత్వం తన ఉత్తర్వులను సవరించుకుంది! సమీక్షల పేరిట అధికారులతో గంటల తరబడి సమావేశం అవుతున్న కేసీఆర్‌కు ఈ విషయం ఎందుకు తట్టలేదు? వైద్య సిబ్బందికి జీతాల్లో కోత విధించడం సబబు కాదని ఒక్కరు కూడా ముఖ్యమంత్రికి ఎందుకు చెప్పలేకపోయారు? మర్కజ్ వెళ్లి వచ్చిన ముస్లింలకు కరోనా వైరస్ సోకుతున్నందున హోం మంత్రి మహమూద్ అలీని కలుసుకోవడానికి కూడా ఇష్టపడకుండా, ఇంటికి వచ్చిన మనిషిని గేటు వద్ద నుంచే వెనక్కు పంపిన మీది మాత్రమే ప్రాణమా? రోగుల నుంచి తమకు కూడా వ్యాధి సోకుతుందని తెలిసినా ధైర్యంగా చికిత్స చేస్తున్న వైద్యులకు రక్షణ పరికరాలు సమకూర్చడం ప్రభుత్వం బాధ్యత కాదా? 'ఆంధ్రజ్యోతి' దుర్మార్గంగా రాసిందని మీరు విమర్శించిన మరుసటి రోజే గాంధీ ఆసుపత్రిలో పనిచేస్తున్న జూనియర్ డాక్టర్లు తమకు అవసరమైన సదుపాయాల కోసం విరాళాలు ఇవ్వాల్సిందిగా ప్రజలకు పిలుపు ఇచ్చింది వాస్తవం కాదా? నాకే అంతా తెలుసు, నా బాధ్యత ఇంకొకరు గుర్తుచేయాలా? అని హూంకరిస్తున్న కేసీఆర్ దీనికి ఏమి చెబుతారు? వివిధ కారణాల వల్ల తెలంగాణలో కేసీఆర్‌కు మీడియా పూర్తిగా సహకరిస్తున్నది. దీంతో చిన్న చిన్న విమర్శలను కూడా సహించలేని స్థితికి ఆయన వచ్చారు. తాను అద్భుతంగా పనిచేస్తున్నానని ప్రపంచానికి నిత్యం చెబుతుండాలని కోరుకుంటున్నారు. నిజానికి సమీక్షల పేరిట మీరు నిర్వహిస్తున్న సమావేశాలలో జరుగుతున్నది ఏమిటో ప్రజలకు తెలిస్తే ముక్కున వేలేసుకుంటారు! మీకు నచ్చిన అధికారులను, పార్టీ వాళ్లను పక్కన కూర్చోబెట్టుకుని గంటల తరబడి ముచ్చట్లు చెప్పే మీరు అధికారులను మాట్లాడనిస్తారా? పిల్లల కోడిలా కొంతమందిని వెంటేసుకుని విలేకరుల సమావేశం పెట్టి ఆ తర్వాత వెంటనే మాయమైపోవడం లేదా? గడిచిన పది రోజులలో మీరు ఎన్ని రోజులు ఫామ్‌హౌస్‌లో గడిపారో ప్రజలకు చెప్పారా? అదేమంటే నేను ఎక్కడ ఉంటే అక్కడే ప్రభుత్వం ఉంటుందంటారు! ఉమ్మడి రాష్ట్రంలో ఏర్పాటైన ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ హైదరాబాద్‌లో దండిగా ఉన్నందున ప్రభుత్వ యంత్రాంగానికి వెలితి ఉండటం లేదు. అది మీ గొప్ప కాదు. సమర్థులైన అధికారులు తెలంగాణలో ఉన్నందున కేసీఆర్ పట్టించుకున్నా, పట్టించుకోకపోయినా వ్యవస్థ తన పని తాను చేసుకుపోతున్నది. అదంతా మీ గొప్ప అన్నట్టుగా ప్రచారం చేసుకుంటూ పబ్బం గడపడం నిజం కాదా? కేసీఆర్ భాషలో చెప్పాలంటే.. అవతలివాడు నీకంటే సన్నాసి అయినప్పుడు నీకే మంచి పేరు వస్తుంది. కేసీఆర్ విషయంలో అదే జరుగుతోంది. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి వ్యవహార శైలి కారణంగా కరోనా విషయంలో కేసీఆర్ బాగా వ్యవహరిస్తున్నారన్న పేరు వచ్చిన విషయం వాస్తవం కాదా? డొనాల్డ్ ట్రంప్ మూర్ఖత్వం వల్ల ఇవ్వాళ అమెరికాలో కరోనా మహమ్మారి కరాళనృత్యం చేస్తున్నది. దీంతో లాక్‌డౌన్ ప్రకటించిన భారత ప్రధాని నరేంద్ర మోదీకి ప్రపంచంలోనే గుర్తింపు వచ్చింది. అభివృద్ధి చెందిన దేశాల నాయకులు ముందుచూపుతో వ్యవహరించకపోవడం వల్లనే ఆ దేశాలు ఇప్పుడు కుదేలయ్యాయి. నిజానికి అంతర్జాతీయ విమాన సర్వీసులను ఫిబ్రవరి మాసంలోనే నిషేధించి ఉంటే మన దేశంలోకి కరోనా ప్రవేశించి ఉండేది కాదు. అంతెందుకు.. లాక్‌డౌన్ నేపథ్యంలో వలస కార్మికుల సమస్య ఈ స్థాయిలో ఉంటుందని కాలజ్ఞాని అయిన మీరు ఎందుకు ఊహించలేకపోయారు? అంతా తనకే తెలుసన్న అహంకారపూరిత ధోరణి తలకెక్కడంతో కేసీఆర్‌లో అసహనం హద్దులు దాటుతోంది. మీడియా సమావేశాలలో ప్రశ్నలు అడిగిన విలేకరులను ఈసడించుకోవడం ఆయనకే చెల్లింది. తమను అంతలా అవమానిస్తున్న ముఖ్యమంత్రిని నిలదీసే పరిస్థితిలో ఇవ్వాళ జర్నలిస్టులు లేరు. యాజమాన్యాల సహకారం కూడా ఉండటం లేదు. నేను జర్నలిజంలోకి ప్రవేశించిన 1980వ దశకంలో విలేకరుల సమావేశంలో ముఖ్యమంత్రులు పరుషంగా మాట్లాడితే సదరు సమావేశాన్ని బహిష్కరించి విలేకరులు వెళ్లిపోయిన సంఘటనలను నా కళ్లతో చూశాను. అప్పట్లో జర్నలిస్ట్ సంఘాలు కూడా బలంగా ఉండేవి. ఇప్పుడు జర్నలిస్ట్ సంఘాలు చీలికలు పీలికలై కొన్ని ముఖ్యమంత్రి జేబులోకి దూరిపోయాయి. ఇందుకు అందరూ బాధ్యులే! జర్నలిస్టులు పూర్వంలా ఉండివుంటే కేసీఆర్ వంటివారి ఆటలు సాగేవి కావు. కేసీఆర్ ఏం మాట్లాడితే అది పోటీలు పడి మరీ రిపోర్టు చేయవలసిన దుస్థితిలో ఇప్పటి మీడియా ఉంది. ఈ కారణంగానే ప్రశ్నలను సహించలేకపోతున్నారు. ఉద్యోగ సంఘాలతో కనీసం మాట మాత్రమైనా సంప్రదించకుండా జీతాల్లో కోత విధించినా నోరెత్తలేని స్థితిలో ఆయా సంఘాలు ఉన్నాయి. తెలంగాణలో ఇవ్వాళ ఎవరైనా మనుగడ సాగించాలంటే ఆధునిక నిజాం ప్రభువుకు గులాంగిరి చేయాల్సిందే! వైద్యుల సమస్యను వెలుగులోకి తెచ్చిన పాపానికి 'ఆంధ్రజ్యోతి'కి అత్యంత కఠినమైన శిక్ష విధిస్తానని కూడా కేసీఆర్ హెచ్చరించారు. మంచిదే! అంతా తనకే తెలుసును అని భావిస్తున్న కేసీఆర్‌కు ఒక విషయం గుర్తుచేయాలి. ప్రభుత్వాలు కేసులు మాత్రమే పెట్టగలవు. శిక్షలు విధించే అధికారం న్యాయస్థానాలకే ఉంటుంది. అయినా వాళ్లకీ, వీళ్లకీ కరోనా సోకాలని శపించడం ద్వారా ఆ వైరస్ వ్యాప్తిని పరోక్షంగా ప్రోత్సహిస్తున్న మీకే న్యాయంగా శిక్ష పడాలి! మీడియాను బెదిరించడానికి అలవాటుపడిన కేసీఆర్, ఇప్పుడు సూచనలను కూడా స్వీకరించే స్థితిలో లేరు. శిక్షలు విధిస్తానని హెచ్చరికలు చేస్తున్నారు. 'ఆంధ్రజ్యోతి'కి ఇలాంటి హెచ్చరికలు అలవాటే! మీరు గుడ్లు ఉరిమితే ఇక్కడెవరూ భయపడరు! మీరు బెదిరిస్తే బెదిరిపోవడానికి మేము సిద్ధంగా లేము. ఆరేళ్లుగా ఫామ్‌హౌస్‌లోనో ప్రగతిభవన్‌లోనో సెల్ఫ్ ఐసొలేషన్‌లో ఉన్న మీకు ఇప్పటి లాక్‌డౌన్ వల్ల ప్రజలకు ఎదురవుతున్న ఇబ్బందులు తెలిసే అవకాశం లేనందున, ప్రజా సమస్యలను మేం బాజాప్తా ప్రచురిస్తాం. ప్రచురిస్తూనే ఉంటాం!




> నిజానికి ప్రజలందరికీ పరీక్షలు నిర్వహిస్తే మన దేశంలో, ముఖ్యంగా తెలుగునాట కొన్ని వేల కరోనా పాజిటివ్ కేసులు బయటపడే అవకాశం ఉందని వైద్యరంగ నిపుణులు చెబుతున్నారు. అయినా రాష్ట్రంలో జగన్మోహన్‌రెడ్డికి మాత్రం కరోనా కనిపించడం లేదు. తన ఎజెండా అమలుకు అడ్డుగా మారిన కరోనాపై ఆయనకు అంతులేని కోపం ఉంది. అలా అని కరోనాను అరికట్టడానికి చర్యలు తీసుకుంటున్నారా? అంటే అదీ లేదు. ఒక్క ఆసుపత్రిలో కూడా ప్రభుత్వ వైద్యులకు కనీస రక్షణ పరికరాలు లేవు. అదేమని ప్రశ్నించిన వారిని సస్పెండ్ చేస్తున్నారు. కరోనా భయంతో వీడియో కాన్ఫరెన్స్‌ల ద్వారా కేసుల విచారణ చేపట్టడాన్ని సుప్రీంకోర్టు చట్టబద్ధం చేసినా జగన్మోహన్‌రెడ్డికి కనిపించదు– వినిపించదు.

## దేవుడే కాపాడాలి!

'ఊరందరిది ఒకదారి అయితే ఉలిపికట్టెది మరో దారి' అంటారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ధోరణి ఇలాగే ఉంది. దేశంలోని ముఖ్యమంత్రులు అందరూ.. ఆ మాటకొస్తే ప్రపంచ దేశాల అధినేతలందరూ కరోనా మహమ్మారిని అరికట్టే విషయమై తలమునకలై ఉండగా, జగన్మోహన్‌రెడ్డి మాత్రం తనదైన శైలిలో ముందుకు పోతున్నారు. దేనికైనా సమయం– సందర్భం చూసుకోవాలి అని అంటారు. జగన్‌కు మాత్రం ఇలాంటివేమీ పట్టవు. ఆయనది విపరీత మనస్తత్వం అని నేను ఎప్పటి నుంచో చెబుతున్నాను. కరోనా మహమ్మారి నుంచి ప్రజలను కాపాడే విషయం ఆలోచించకుండా తన ఎజెండా అమలుకు ఆయన కట్టుబడి ఉన్నారు. ఈ కారణంగానే గుడ్‌ఫ్రైడే ప్రభుత్వానికి సెలవు అయినప్పటికీ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నియామకంలో సవరణలు చేస్తూ ఆర్డినెన్స్ జారీచేయడంతోపాటు ప్రస్తుత ఎన్నికల కమిషనర్ రమేశ్‌కుమార్‌ను తొలగిస్తూ జీవో విడుదల చేశారు. అంతేకాదు.. ఆయన స్థానంలో తమిళనాడుకు చెందిన హైకోర్టు రిటైర్డ్ జడ్జి కనగరాజ్‌ను రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌గా నియమించారు. రమేశ్‌కుమార్‌ను తొలగించడం సరైందా? కాదా? న్యాయ సమీక్షలో నిలబడుతుందా? లేదా? అన్న విషయాలు పక్కనపెడితే.. ఈ సమయంలో ఇటువంటి నిర్ణయం తీసుకోవడం కేవలం జగన్మోహన్‌రెడ్డికి మాత్రమే చెల్లుతుంది. కరోనా వైరస్‌ను ఆయన మొదటి నుంచీ తేలిగ్గానే తీసుకుంటున్నారు. "వైరస్ వచ్చిన విషయం, పోయిన విషయం కూడా మనకు తెలియదు" అని ఆయన తనను కలిసిన వారి వద్ద వ్యాఖ్యానిస్తున్నారు కూడా! కరోనా విషయంలో అధికారులు అనవసరంగా హైరానా పడుతున్నారని కూడా ఆయన విసుక్కుంటున్నారు. వెంటనే లాక్‌డౌన్ ఎత్తివేయాలని ఆయన వాదిస్తున్నారు. ఇందుకు కారణం ఏమిటంటే రాజధానిని వెంటనే విశాఖకు తరలించాలి. స్థానిక సంస్థలకు ఈ నెలలోనే ఎన్నికలు జరపాలి. అమరావతిలో ప్రభుత్వానికి దఖలుపడిన భూములను ఇళ్ల స్థలాల కింద పేదలకు పంపిణీ చేసి అమరావతిని చంపేయాలనుకోవడమే! దేశంలో కరోనా పాజిటివ్ కేసులు పెరుగుతున్నాయని కేంద్ర ఆరోగ్య శాఖ సంయుక్త కార్యదర్శి లవ్ అగర్వాల్ శుక్రవారం నాడే ప్రకటించారు. నిజానికి ప్రజలందరికీ పరీక్షలు నిర్వహిస్తే మన దేశంలో, ముఖ్యంగా తెలుగునాట కొన్ని వేల కరోనా పాజిటివ్ కేసులు బయటపడే అవకాశం ఉందని వైద్యరంగ నిపుణులు చెబుతున్నారు. అయినా రాష్ట్రంలో జగన్మోహన్‌రెడ్డికి మాత్రం కరోనా కనిపించడం లేదు. తన ఎజెండా అమలుకు అడ్డుగా మారిన కరోనాపై ఆయనకు అంతులేని కోపం ఉంది. అలా అని కరోనాను అరికట్టడానికి చర్యలు తీసుకుంటున్నారా? అంటే అదీ లేదు. ఒక్క ఆసుపత్రిలో కూడా ప్రభుత్వ వైద్యులకు కనీస రక్షణ పరికరాలు లేవు. అదేమని ప్రశ్నించిన వారిని సస్పెండ్ చేస్తున్నారు. కరోనా భయంతో వీడియో కాన్ఫరెన్స్‌ల ద్వారా కేసుల విచారణ చేపట్టడాన్ని సుప్రీంకోర్టు చట్టబద్ధం చేసినా జగన్మోహన్‌రెడ్డికి కనిపించదు–వినిపించదు. సొంతంగా ఆలోచించే అవసరం లేకుండా తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ తీసుకుంటున్న నిర్ణయాలనే తాను కూడా ప్రకటిస్తూ వచ్చిన జగన్మోహన్‌రెడ్డిలో ఇప్పుడు అసహనం కట్టలు తెంచుకుంటోంది. ఈనెల ఐదవ తేదీన తొమ్మిది నిమిషాలపాటు ఇంటి బయటకు వచ్చి కొవ్వొత్తులు వెలిగించాలన్న ప్రధాని నరేంద్ర మోదీ పిలుపులో భాగంగా.. ఆ కార్యక్రమంలో పాల్గొన్న జగన్మోహన్‌రెడ్డిని గమనిస్తే ఆయన ఎంత అసహనంగా ఉన్నారో తెలుస్తుంది. ఇంటి వెలుపలకు మూడు నిమిషాలు ఆలస్యంగా వచ్చిన జగన్మోహన్‌రెడ్డి తొమ్మిది నిమిషాలు కూడా పూర్తికాక ముందే లోపలకు వెళ్లిపోవడానికి రెండు మూడు పర్యాయాలు ప్రయత్నించారు. అధికారులు వారించడంతో ఆగిపోయారు. కేంద్ర ప్రభుత్వం అనుక్షణం పరిస్థితిని పర్యవేక్షిస్తున్నందున ముఖ్యమంత్రి అభిప్రాయంతో నిమిత్తం లేకుండా అధికారులు మాత్రం కరోనా నియంత్రణపై దృష్టిపెట్టారు. లాక్‌డౌన్ ఎత్తేసినా మరికొంత కాలంపాటు భౌతిక దూరం పాటించాల్సి ఉంటుందని కేంద్ర ప్రభుత్వం హెచ్చరిస్తున్నప్పటికీ స్థానిక సంస్థలకు ఎన్నికలు జరపాలని జగన్మోహన్‌రెడ్డి ఉవ్విళ్లూరడాన్ని ఏమనుకోవాలి? ఎన్నికల ప్రక్రియ ఇప్పటికే మొదలైంది. కరోనా కారణంగా ఎన్నికలను కొంతకాలంపాటు వాయిదా వేస్తున్నట్టు అప్పుడు ఎన్నికల కమిషనర్‌గా ఉన్న రమేశ్‌కుమార్ ప్రకటించారు. సుప్రీంకోర్టు కూడా ఈ నిర్ణయాన్ని సమర్థించింది. ఇప్పుడు జగన్మోహన్‌రెడ్డి కోరుకుంటున్నట్టు స్థానిక సంస్థలకు ఈ నెలలో పోలింగ్ నిర్వహిస్తే.. కేంద్ర ప్రభుత్వం చెబుతున్న భౌతిక దూరం సంగతేంటి? కేంద్ర ప్రభుత్వం లాక్‌డౌన్ పొడిగించే పక్షంలో ఆయన భావిస్తున్నట్టు ఎన్నికలు జరగవు. అది ఉభయభ్రష్టత్వమే అవుతుంది. అయినా సభ్య సమాజం నివ్వెరపోయే నిర్ణయాలు తీసుకోవడం ఒక్క జగన్మోహన్‌రెడ్డికే సాధ్యం! రాజ్యాంగబద్ధంగా ఏర్పడిన సంఘాలలో నియమితులైన వారిని తొలగించడానికై జగన్ అండ్ కో వినూత్న ప్రయోగానికి శ్రీకారం చుట్టింది. ఇందుకోసం రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పదవీ కాలాన్ని మూడేళ్లకు కుదించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి కూడా తిక్కరేగి దేశంలో ముఖ్యమంత్రుల పదవీకాలాన్ని రెండేళ్లకో, మూడేళ్లకో కుదిస్తూ రాజ్యాంగ సవరణకు పూనుకుంటే జగన్ సమర్థిస్తారా? ఇంత కాలంగా జగన్ తీసుకున్న అసంబద్ధ నిర్ణయాలను సమర్థిస్తున్న ఆయన మద్దతుదారులు ఇప్పుడు తాజాగా తీసుకున్న నిర్ణయాన్ని కూడా సమర్థించగలరా? తాను రూపొందించిన బిల్లును సెలెక్ట్ కమిటీకి పంపుతారా? అన్న కోపంతో శాసన మండలి రద్దుకు తీర్మానం చేసిన జగన్మోహన్‌రెడ్డి, ఇప్పుడు తన అభిమతాన్ని గుర్తించి అమలుచేయని రమేశ్‌కుమార్‌ను ఇంటికి పంపాలనుకోవడం మూర్ఖత్వానికి పరాకాష్ఠ అని విమర్శించిన వాళ్లను ఎందుకు తప్పుబట్టాలి? అయినా ఇంతటి అసంబద్ధమైన ఆర్డినెన్స్‌ను గంటల వ్యవధిలో గవర్నర్ ఎలా ఆమోదించారో తెలియదు! ఎన్నికలలో గెలుపు అనేది రాజ్యాంగ విఘాతానికి సమర్థన కాజాలదు అని జగన్ ప్రధాన సలహాదారుడు అజయ్ కల్లాం 'కల్లాంవారి మేలుకొలుపు' పేరిట రాసిన పుస్తకంలో పేర్కొన్నారు. ఇప్పుడు జగన్మోహన్‌రెడ్డి నిర్ణయాలను ఆయన ఎలా సమర్థిస్తున్నారో తెలియదు. రాజకీయ నాయకుడు అధికారంలోకి వస్తే అవినీతిపరుడుగా మారవచ్చు. నేరబుద్ధి ఉన్నవారు అధికారంలోకి వస్తే పాలన అంతా నేరమయంగా ఉంటుందని అంటారు. జగన్మోహన్‌రెడ్డి వంటి నేపథ్యం ఉన్నవారు అధికారంలోకి వస్తే పరిస్థితులు ఇలాగే ఉంటాయి. నిర్ణయాలు కూడా ఇంతకంటే ఉన్నతంగా ఎందుకు ఉంటాయి? ఆంధ్రప్రదేశ్‌ను ఆ దేవుడే కాపాడాలి! అంతవరకు పదేపదే విస్తుపోవడం మినహా చేయగలిగింది ఏమీ లేదు. అధికారం కట్టబెట్టిన ప్రజలే దాని పర్యవసానాలను కూడా అనుభవించాలి. జగన్ అధికారంలోకి వస్తే రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందని ఏడాది క్రితం ఇదే ఏప్రిల్ 11వ తేదీన ఆంధ్రప్రదేశ్‌లో అర్ధరాత్రి వరకూ క్యూలలో నిలబడి మరీ ఓట్లు వేశారు కనుక మంచికీ–చెడుకీ వారే బాధ్యులు!

> లాక్‌డౌన్ ఎత్తేసినా మరికొంత కాలంపాటు భౌతిక దూరం పాటించాల్సి ఉంటుందని కేంద్ర ప్రభుత్వం హెచ్చరిస్తున్నప్పటికీ స్థానిక సంస్థలకు ఎన్నికలు జరపాలని జగన్మోహన్‌రెడ్డి ఉవ్విళ్లూరడాన్ని ఏమనుకోవాలి? కరోనా కారణంగా ఎన్నికలను కొంతకాలంపాటు వాయిదా వేస్తున్నట్టు అప్పుడు ఎన్నికల కమిషనర్‌గా ఉన్న రమేశ్‌కుమార్ ప్రకటించారు. సుప్రీంకోర్టు కూడా ఈ నిర్ణయాన్ని సమర్థించింది. స్థానిక సంస్థలకు ఈ నెలలో పోలింగ్ నిర్వహిస్తే.. కేంద్ర ప్రభుత్వం చెబుతున్న భౌతిక దూరం సంగతేంటి? కేంద్ర ప్రభుత్వం లాక్‌డౌన్ పొడిగించే పక్షంలో ఆయన భావిస్తున్నట్టు ఎన్నికలు జరగవు. అది ఉభయభ్రష్టత్వమే అవుతుంది. అయినా సభ్య సమాజం నివ్వెరపోయే నిర్ణయాలు తీసుకోవడం ఒక్క జగన్మోహన్‌రెడ్డికే సాధ్యం!

# జానపదంలో క్వారంటైన్!

సాంక్రామిక వ్యాధులు భారతదేశ నగర సీమలకు గానీ, పల్లెసీమలకు గానీ ఏ మాత్రం కొత్త కాదు. మనకు ప్రతి సాంక్రామిక వ్యాధి కూడా ఒక అమ్మతల్లి రూపంలో ఉంటుంది. అమ్మతల్లులను కొలిచే సంప్రదాయం మనకు కొన్ని శతాబ్దాలుగా ఉంది. అంటు వ్యాధులకు అమ్మతల్లుల ఆరాధనా సంప్రదాయానికి విడదీయరాని సంబంధం ఉంది. ఈ సంబంధాన్ని చూచి అలనాటి వలస పాలనాధికారులలో ఉన్న పరిశోధక జిజ్ఞాసువులు ఆశ్చర్యపోయారు. అంతే కాదు, తమ పాలితులను అర్థంచేసుకోవాలంటే ఈ ఆచారాలన్నింటిని అవగతం చేసుకోవాలని, ఇందుకు వాటిని అధ్యయనం చేయాలని, ఇలా అధ్యయనం చేయడం ద్వారానే భారత ప్రజలను సమర్థంగా పరిపాలించవచ్చుననే ఆంతరికమైన సూత్రాన్ని వలస పాలకులు గ్రహించారు. ఈ క్రమంలోనే 'విలేజ్ గాడ్స్ ఆఫ్ సౌత్ ఇండియా' గ్రంథాన్ని హెన్రీ వైట్ హెడ్ రచించాడు. 'ద్రవిడియన్ గాడ్స్ ఇన్ మోడరన్ హిందూఇజమ్' అనే ఉద్గ్రంథం ఎల్మోర్ పరిశోధన ఫలితంగా వచ్చింది. ఈ ఇరువురూ ఈ దేశ జానపద ఆచారాలలోని మూఢవిశ్వాసాలను గుర్తించారే కానీ వాటిలో ఉన్న ఒక తర్కాన్ని గ్రహించలేదు. మనుషులకు కాని పశువులకు కాని వచ్చే వ్యాధులకు జానపదులు ఎలా సమాధానాలు కనుక్కుంటారో విశ్లేషించి చెప్పడంలో కూడా వారు విఫలమయ్యారనే చెప్పాలి. సాంక్రామిక వ్యాధులకు సంబంధించిన జానపద దేవతల ఆరాధనా సంప్రదాయాల విషయమై ప్రశస్త పరిశోధన చేసిన విలియం క్రూక్ అనే పరిశోధకుడి అవగాహనలో కూడా పైన చెప్పిన పరిమితులు ఉన్నాయి.

ప్రాకృతిక ఋతువులతో సంబంధం ఉండి వచ్చే సాంక్రామిక వ్యాధులు మన జానపదులకు కొన్ని శతాబ్దాలుగా సుపరిచిత మిత్రులు. ఒక అంటు వ్యాధి మనుషులకు లేదా వారింట్లో ఉండే పశువులకు కానీ వచ్చినప్పుడు అమ్మవారు తమను గుర్తు చేసుకుంటుందని, తనకు సేవచేయమని గుర్తు చేస్తుందని మన జానపదులు భావించడం కద్దు. అందుకే అంటు వ్యాధులు ప్రబలే వర్షాకాలంలోనే అమ్మవార్ల జాతరలు, కొలుపులు జరుగుతాయి. ఈ ఆరాధనా సంప్రదాయాలలో గ్రామం మొత్తం ఒక యూనిట్ గా మారుతుంది. గ్రామ ప్రజలు విడివిడిగా ఇంట్లో అమ్మవార్లను కొలుచుకున్నా గ్రామ స్థాయిలో మూడు లేదా వారం రోజులపాటు కొలుపులు జరుగుతాయి. స్ఫోటకం, దద్దు, కలరా ... వీటన్నింటిని మన జానపద సంప్రదాయంలో అమ్మవారు అనే అంటారు. అటు ఉత్తర భారతావనిలో కూడా స్మాల్ పాక్స్ ని శీతాళ దేవి అనే గ్రామదేవత పేరుతో కొలుస్తారు. ఈమెకు పుల్మాతి అని ఒక చెల్లెలు ఉంది. పుల్మాతి కాస్త తక్కువ ప్రమాదకారి అయిన దద్దుగా భావిస్తారు. మనకు స్ఫోటకం ప్రమాదకరమైన జబ్బు, దాని కన్నా తక్కువ ప్రమాదకారి దద్దు అని అంటారు. ఇది కొద్దిరోజులలోనే పోతుంది. స్ఫోటకాన్నే మశూచి అని అంటారు. ఇది ప్రాణాంతకం కూడా అవుతుంది. ఈ రెండింటిని అమ్మవార్లుగా భావిస్తారు. ఈ అమ్మవార్లు వేపచెట్టుమీద నివసిస్తారు అనే జానపద నమ్మకం ఒకటి ఉన్నది. అందుకే అమ్మవారు సోకిన వ్యక్తి చాపమీద పడుకోగా అతను లేదా ఆమెకు ఇరువైపులా వేపమండలు ఉంచడం పరిపాటి. ఇలా చాలా ఇండ్లలో అమ్మవారు సోకినప్పుడు దద్దు అయితే కొద్ది స్థాయిలో జాతర ఉంటుంది. ఇది సాధారణంగా ఒక రోజు లేదా మూడు రోజులు ఉంటుంది. ఊరివారందరూ వచ్చి ముత్యాలమ్మ (దద్దు దేవత)కు నీళ్ళు పోస్తారు. తర్వాత చాకలి వచ్చి కోళ్ళను కోస్తాడు. బంధుమిత్రులు, ఇతర వ్యక్తులు అమ్మవారికి తమ ఇంటి నుంచి కోళ్ళను తెచ్చి ఇస్తారు. ఇలా ఒక ఊరిలో అమ్మవారు వచ్చింది అని తెలిసినప్పుడు వేరే ఊరు వారు చుట్టరికం మీదగానీ లేదా ఏదైనా ముఖ్యమైన పనివున్నా గానీ అక్కడికి రారు. అలా వస్తే అమ్మవారు వారి వెంట ఇంకొక ఊరికి పోతుందని జానపదులు నమ్ముతారు. ఇది ఒక రకంగా మనం ఇప్పుడు చెప్పుకుంటున్న క్వారంటైన్ పద్ధతి. లేదా సామాజిక దూరం పెద్ద స్థాయిలో ఉంది అని చెప్పవచ్చు.



ఇక స్ఫోటకం వచ్చినప్పుడు లేదా గ్రామం లోని మొత్తం పశువులకు దొమ్మ, గాలికుంటు వ్యాధులు వచ్చినప్పుడు వాటికి జానపద సంప్రదాయాల పద్ధతిలో వైద్యం చేస్తారు. ఆకుపసరులతో పాటు చెంద్రికం పెడతారు. చెంద్రికం అంటే సున్నంలో పసుపు కలుపుతారు. దీనితో అది ఎర్రటి ద్రవంగా మారుతుంది దాన్ని పశువులకు తాపిస్తారు. ఇక్కడితో ఆగకుండా ఊరిజాతర చేస్తారు. దీన్నే కొలుపు అని కూడా అంటారు. ఈ కొలుపు, ఊళ్ళో ఉన్న ముత్యాలమ్మ, పెద్దమ్మ, ఎల్లమ్మ, లేదా పోచమ్మ విగ్రహాల దగ్గర జరుపుతారు. సాధారణంగా ఈ అమ్మవార్ల గుడులు లేని ఊర్లు ఉండవు. ఒకవేళ ఎక్కడైనా లేనప్పుడు ఊరి బొడ్డురాయి గ్రామ దేవత అవుతుంది అక్కడ కొలుపు చేస్తారు. బైండ్ల వారు ఈ కొలుపులు చేస్తారు. కాని ఖమ్మం జిల్లాలో కొన్ని ప్రాంతాలలో కొమ్ము మాదిగలు కొలుపులు కొలుస్తారు, వీరినే కొమ్మువారు అనిఅంటారు. సాధారణంగా మూడు నుంచి ఏడు రోజుల దాకా ఈ కొలుపులు సాగుతాయి. వ్యాధి బాగా ఉధృతంగా ఉంటే అరుదుగా పదకొండురోజులు కూడా ఈ కొలుపు కాలం ఉంటుంది.

ఈ కొలుపులో మొదటిగా చేసేది ఊరి గవన్ల దగ్గర పొలిమేర కట్టుకడతారు. ఊరి గవను అంటే గ్రామానికి ఎల్ల (బోర్డర్) అని అర్థం. దీన్నే పొలిమేర అని అంటారు. ప్రతి ఊరికి అన్ని వైపులా నాలుగు వైపులా ఊరినుండి బయటి ఊరికి పోయే దారిలో పొలిమేర ఉంటుంది. అక్కడ గుర్తుగా ఒక రాయి పాతి ఉంటుంది. ఈ పొలిమేర దగ్గరికి బైండ్ల వారు కాని కొలుపులు కొలిచే కొమ్ముల వారు కాని వచ్చి అమ్మవారి గుర్తుగా మూడు చిన్నచిన్న రాళ్ళకు పసుపు రాసి కుంకుమ బొట్లు పెట్టి అక్కడ పెడతారు. ఈ రాళ్ళు అమ్మవార్లు అని అర్థం. ఆ రాళ్ళ పక్కనే మంత్రాలు చదివి వేపమండలు కాని తంగేడు మండలు కాని వేస్తారు. సాధారణంగా పొలిమేర కట్టు దగ్గర తంగేడు మండలు వేస్తారు. కొన్ని గ్రామాల్లో తంగేడు దొరకకపోతే వేపమండలు వేస్తారు. ఇలా అన్ని పొలిమేరలు కట్టు కట్టడం పూర్తయినప్పుడు 'ఊరకట్టు' అయింది అంటారు. ఇలా చేయడాన్ని 'ఊరకట్టడి' అని అంటారు. అలా కట్టడి చేసే ముందు ఆ గ్రామస్తులు ఎవరైనా తమ బంధువులను వేరే గ్రామాలనుండి పిలుచుకోవాలనుకుంటే తమ గ్రామంలో కొలుపు జరుగుతుంది రండి అని పిలుచుకుంటారు. లేదా మెట్టినింట వున్న తమ ఆడ బిడ్డలను పిలుచుకోవాలనుకున్నా ఈ ఊరకట్టడికి మూడు నాలుగు రోజుల ముందే పిలుచుకుంటారు. ఒకసారి పొలిమేర కట్టు కట్టడం అయిపోతే బయటి ఊరి వారు ఎవరూ ఊరిలోనికి రారు. అలాగే ఆ గ్రామం వారు కూడా బయటికి పోవడానికి వీలు లేదు. వేరే గ్రామాల వారు పొలిమేర దగ్గరికి రాగానే అక్కడ పొలిమేర కట్టు కనబడితే దాన్ని దాటి ఊరిలోకి రారు. అలా వస్తే వారికి అమ్మవారి వల్ల కీడు జరుగుతుందని నమ్ముతారు. వెనక్కు వెళ్ళిపోతారు. ఈ నమ్మకం నేటికీ మన గ్రామీణులలో చాలా గట్టిగా ఉంది.

ఇక ఊర కట్టడి అయిన మరుసటి రోజున అమ్మవార్లకు కొలుపు మొదలౌతుంది. అమ్మవార్లకు కోళ్ళను మేకలను బలి ఇస్తారు. పెద్దజాతరలో ఊరి పెద్దమాదిగ దున్నపోతును బలి ఇస్తాడు. తలను తెచ్చి అమ్మవారి ముందు పెడతారు. దున్న ఎడమకాలు సగం విరిచిన దాన్ని దాని నోటిలో పెట్టి దాని కొవ్వునే దీపంగా చేసి నెత్తిన పెడతారు. కొమ్ములు వారుంటే వారు లేదా బైండ్ల వారు రాత్రి పూట అమ్మవారి కథలను చెబుతారు. ఈ కొలుపు మూడు రోజులు లేదా ఏడు రోజులు సాగవచ్చు. ఇక చివరి రోజున ఊరి మధ్యలో ఒక పందిని తల పైకి ఉండేలాగా పాతిపెడతారు. ఊళ్ళో ఉన్న ప్రతి ఇంటి వారి పశువులను ఆ పందిని తొక్కుకుంటూ పోయేలాగా తీసుకుపోతారు. అలా తొక్కడం వల్ల పట్టిన కింకలు అన్నీ పోయి పశువులకు వ్యాధులు తగ్గుతాయని గట్టిగా నమ్ముతారు. కాని ఈ నమ్మకంతోనే ఆగక సాంప్రదాయకమైన వైద్యం కూడా చేస్తారు.

ఇలా జాతరలు చేయడంతో పాటు జానపద వైద్యం కూడా చేస్తారు. మనుషులకు వ్యాధి తీవ్రత తగ్గడానికి చలువ చేసే పద్ధతులు కూడా పాటిస్తారు. వేపమండలతో విసరడం అందులో ఒకటి. ఇదికాక ఖమ్మం జిల్లాలో రాయలోరి టీకాలు అని టీకా వేయడం ఉంటుంది. ఖమ్మం పట్టణానికి దగ్గరలో ఉన్న ముదిగొండ గ్రామంలో రాయల వారు అనే కుటుంబాలు వారు ఉంటారు. వారిని ఆ వ్యాధి సోకిన గ్రామ ప్రజలు పిలిపిస్తారు. వారు వచ్చి టీకాలు తయారు చేసి గ్రామంలోని ప్రజలందరికీ టీకా వేస్తారు. స్ఫోటకం వచ్చిన వ్యక్తి దగ్గరికి పోయి స్ఫోటకపు కుండలు (ముత్యాలలాగా కందిగింజ పరిమాణంలో కనిపించే దద్దు) నుండి దానిలోని రసం తీసి చిన్న సీసాలో వేసుకొని వస్తారు. అలా వారు వెళ్ళే ముందు అమ్మవారికి పూజ చేసి వెళతారు. అలా వెళ్ళడం కూడా చాలా ప్రమాదమని అందరూ అంటారు. కాని వారు వెళ్ళి అలా తెచ్చిన ఆ ద్రవాన్నే అమ్మవారుగా భావించి వ్యాధి సోకని వారికి టీకాగా వేస్తారు. ఎడమచేతి మణికట్టువద్ద సూదులతో గుచ్చుతారు. పది పదిహేను సూదులను ఒక కట్టగా కట్టి వాటిని ఈ తెచ్చిన ద్రవంలో ముంచి ఆ సూదులతో మణికట్టు వద్ద ఐదారుసార్లు గుచ్చుతారు. దీనితో ఆ ద్రవం మనిషి రక్తంలోనికి పోతుంది. ఇది నేటి వ్యాక్సిన్ లాగా పనిచేసి మనిషి శరీరంలోని రక్షక శక్తులు ఏంటీబాడీస్ తయారై బయటినుండి వ్యాధిరాకుండా చేస్తాయి. ఇవాళ కరోనా చికిత్సలో వ్యాధి తగ్గి కోలుకున్న వ్యక్తి రక్తంలోనుండి ప్లాస్మాను వేరు చేసి వ్యాధి తగ్గించడానికి మందుగా చికిత్సకు ఇవ్వవచ్చు అని పరిశోధనలో తేల్చారు. ఇక్కడ చెప్పిన టీకా పద్ధతి ఇలాంటిదే. నేడు ఈ మశూచి లేదా స్ఫోటకం వ్యాధి అంతరించింది.

> ఒక ఊరిలో అమ్మవారు వచ్చింది అని తెలిసినప్పుడు వేరే ఊరు వారు చుట్టరికం మీదగానీ లేదా ఏదైనా ముఖ్యమైన పనివున్నా గానీ ఆ గ్రామానికి వెళ్ళరు. అలా వస్తే అమ్మవారు వారి వెంట ఇంకొక ఊరికి పోతుందని జానపదులు నమ్ముతారు. ఇది ఒక రకంగా మనం ఇప్పుడు చెప్పుకుంటున్న క్వారంటైన్ పద్ధతి. ఊరకట్టడి సంప్రదాయంలో ఒక సారి పొలిమేర కట్టు అయిన తర్వాత బయటనుండి లోనికికాని లోపలి నుండి బయటికి కానీ రావడానికి వీలు లేదు. ఇది పూర్తిగా శాస్త్రీయమైన క్వారంటైన్ పద్ధతే. ఒక గ్రామంలోని వ్యాధి బయటి గ్రామాలకు సోకకుండా తీసుకునే చర్య ఇది.

ఈ వ్యాసకర్త ఎనిమిది సంవత్సరాల వయస్సు ఉన్నప్పుడు (1966 కావచ్చు) ఖమ్మంజిల్లా మర్లపాడు గ్రామంలో మశూచి వచ్చి సుమారు పన్నెండు మంది చనిపోయారు. ఆసందర్భంలో రాయలవారు కుటుంబం వారు వచ్చి టీకాలు వేశారు. ఈ టీకా గుర్తు ఆ ఊరి వారి ఎడమచేయి మణికట్టుమీద నేటికీ కనిపిస్తాయి. అప్పటి జాతర కూడా ఏడు రోజులు సాగింది. ఈ రాయల వారి కుటుంబాలు నేటికీ ఖమ్మం దగ్గరి ముదిగొండలో ఉన్నారు. ఖమ్మం పట్టణంలోని ప్రముఖ కవి రావెల వెంకటరావుగారు ఆనాటి స్వాతంత్ర్య సమర యోధుడు ఈ రాయలోరి కుటుంబానికి చెందినవాడే. వీరు గత ఏడాది కాలంచేశారు.

గత మూడున్నర దశాబ్దాలుగా పైన చెప్పిన జాతరల వంటి జాతరలు, కొలుపులను నా పరిశోధనలను పురస్కరించుకుని చాలా గ్రామాలలో చూశాను. ఈ జాతరలు లేదా కొలుపులలో చాలా శాస్త్రీయమైన పద్ధతులు కనిపిస్తున్నాయి. ఊరకట్టడిలో ఒకసారి పొలిమేర కట్టు అయిన తర్వాత బయట నుండి లోనికికాని లోపలి నుండి బయటికి కానీ రావడానికి వీలు లేదు. ఇది పూర్తిగా శాస్త్రీయమైన క్వారంటైన్ పద్ధతే. ఆ గ్రామంలోని వ్యాధి బయటి గ్రామాలకు సోకకుండా తీసుకునే చర్య ఇది. కొలుపులు జరిగిన ప్రతిసారీ ఈ పద్ధతి ఉంటుంది. మామూలుగా వ్యాధులు లేని కాలంలో కూడా, ముఖ్యంగా ఆషాఢమాసంలో కొలుపులు చేస్తారు. కొలుపు ద్వారా వచ్చే పవిత్రతా గుణం బయటికి పోకుండా ఆపుతారు. అలాగే బయటి వారు అశుచిగా ఉంటారని ఆ అశుచి తమ గ్రామం లోనికి రాకూడదు అని దీనిలోని భావన. ఊరకట్టడి నేటికీ చాలా కచ్చితంగా పాటిస్తున్నారు కొలుపులు చేసే గ్రామాల వారు. ఊరకట్టడి, పొలిమేరకట్టడి సంప్రదాయాలలో నేడు మనం పాటిస్తున్న శాస్త్రీయమైన లాక్‌డౌన్ పద్ధతి, ఒక గ్రామం తనకు తానే క్వారంటైన్ చేసుకోవడం మనకు కనిపిస్తుంది. ఈ జానపద నమ్మకాల వ్యవస్థలో పూజలతోనే ఆగిపోవడం కాకుండా వ్యాధి నివారణకు ఫలితాలనిచ్చే చికిత్సావిధానం కూడా మనకు కనిపిస్తుంది. ఈ బలమైన సంప్రదాయాలు మన వద్ద ఉన్న కారణంగానే కరోనా వ్యాధి గురించి మాట్లాడే సందర్భంలో భారత దేశానికి ఇలాంటి వ్యాధులను ఎదుర్కొనే అనుభవం ఎంతోకాలంగా ఉందని బయటి దేశాల వారు వ్యాఖ్యానించారు. ఈ విషయంలో తెలుగు వారి సంప్రదాయాలు, దక్షిణ భారత జానపద సంప్రదాయాలు పైన చెప్పిన రీతిని గమనిస్తే ఈ కొలుపులు, అమ్మతల్లుల ఆరాధనలో నమ్మకాలతో పాటు శాస్త్రీయతను కూడా అర్థం చేసుకోవచ్చు.

❖ ప్రొఫెసర్ పులికొండ సుబ్బాచారి

# ఆశల రాదారిలో... పునరుత్థానం





ఇవాళ ఆదివారం... ఈస్టర్ ఆదివారం... శిలువ మీది క్రీస్తు సజీవుడై, ప్రాణికోటి కోసం పునరుత్థానం చెందిన రోజు! అజ్ఞానపు అంధకారం నుంచి... చుట్టూ నెలకొన్న ఆందోళన పూరిత వాతావరణం నుంచి... ప్రపంచాన్ని పట్టి పీడిస్తున్న మహమ్మారి నుంచి... పట్టుదలతో, విశ్వాసంతో, శాస్త్రీయ దృక్పథంతో మనిషి మళ్లీ పైకి లేచి రావాల్సిన తరుణమూ ఇదే! పరిశుభ్రత... ముఖానికి మాస్కు... ఇంటికే పరిమితం... ప్రతి ఒక్కరితో భౌతిక దూరం... ఇవన్నీ అందుకే!

ప్రపంచానికి లాక్‌డౌనే శరణ్యమైన పరిస్థితుల్లో... ఇటలీలోని వాటికన్ సిటీలో క్యాథలిక్కుల మతపెద్ద పోప్ ఫ్రాన్సిస్ శిలువను ఎత్తుకొన్నా... చెన్నపట్టణంలో చర్చి బయట భక్తులు ఆర్తితో దైవాన్ని ప్రార్థిస్తున్నా... వాటి పరమావధి ఆ పునరుత్థానమే! కూలి కోసం... కూటి కోసం... భయంతో, బెంగతో... దిక్కుతోచక దారితప్పిన గొర్రెపిల్లను ఆకలి, శోకం, భయం లేని నవీన ప్రపంచానికి నడిపించే కాపరి మనలోనే ఉన్నాడు. తానే మనమై ఉన్నాడు. అన్ని కష్టాల్లోనూ ఆశావాదమే పునరుత్థాన మార్గం!!

**పెళ్లి హడావిడిలో పరుగులు తీయాల్సిన ఆ హీరోలు... కరోనాపై యుద్ధంలో ప్రజలను చైతన్యవంతులు చేస్తున్నారు. సామాజిక బాధ్యతతో తమ వంతు సేవ చేస్తున్నారు. నితిన్... నిఖిల్... ఇద్దరూ ఈ వారంలో పెళ్లి పీటలు ఎక్కాల్సిన హీరోలు. కానీ, ఇద్దరూ పెళ్లి వాయిదా వేసుకున్నారు. కరోనా ప్రభావం, పెళ్లి వాయిదా విషయాల గురించి 'నవ్య'తో ప్రత్యేకంగా మాట్లాడారు.**

# ప్రాణమే మిన్న...




కాబోయే శ్రీమతితో...

**తెలుగు సినిమా కుటుంబం నుండి విరాళం ఇచ్చిన తొలి వ్యక్తి మీరే. చిరంజీవి, పవన్‌కల్యాణ్ సహా పలువురు మిమ్మల్ని ప్రశంసించారు!**

తొలుత విరాళం ఇచ్చేటప్పుడు నేనేదో గొప్ప పని చేస్తున్నాననుకోలేదు. జస్ట్... అయామ్ డూయింగ్ మై డ్యూటీ! ఇవాళ నేను హీరోగా ఉన్నానంటే కారణం ప్రజలే. ఇప్పుడు వాళ్లు కష్టాల్లో ఉన్నారు. నా వంతుగా నేను ఏదో ఒకటి చేయాలనుకున్నాను. విరాళం ఇచ్చాను. చిరంజీవి, పవన్‌కల్యాణ్‌గారు ప్రశంసించడం సంతోషమే. అయితే... ఎవరో మెచ్చుకోవాలని చేయలేదు.

**జనతా కర్ఫ్యూ, లాక్‌డౌన్ సమయంలో ప్రజలు బయటకు రావొద్దని మీరూ విజ్ఞప్తి చేశారు. అసలు, ఇలా జరుగుతుందని ఊహించారా?**

నిజాయతీగా చెప్పాలంటే... మనకు ఎప్పుడూ అలవాటు లేనిదిది. లాక్‌డౌన్ వల్ల బయటకు రాలేక కొందరు ఇబ్బందులు పడుతున్నారు. అయితే, చేతులు కడుక్కోవడం, మాస్క్ పెట్టుకోవడం వంటి జాగ్రత్తలు పాటిస్తూ ఇంట్లో ఉంటే కరోనా రాదు. ఇంకొక పాజిటివ్ సైడ్ ఏంటంటే... కుటుంబంతో చక్కటి సమయం గడుపుతున్నాం. మనం ఇంటి భోజనం తింటున్నాం. పక్షులు, జంతువులు స్వేచ్ఛగా విహరిస్తున్నాయి. వాయు, నీటి కాలుష్యం తగ్గుముఖం పట్టాయి. తెలిసో, తెలియకో... ప్రకృతి విషయంలో ప్రజలంతా కలిసి తప్పులు చేశాం. కానీ, రెండు వారాల లాక్‌డౌన్ వల్ల ఎంతో మార్పు కనపడుతోంది. ప్రకృతి కోలుకుంటోంది. ఏప్రిల్ రెండో వారం అంటే వేసవి మొదలైనట్టే. ఈపాటికి వేడి మొదలవుతుంది. కానీ, ఇప్పుడు అంత వేడి లేదు. కాలుష్యం, ఇవేవీ లేవు కనుక! కరోనా రావడం దురదృష్టకరమే. అయితే... అనుకోకుండా వచ్చిన ఈ విరామం వల్ల సంతోషంగానే ఉన్నా. ఎంజాయ్ చేస్తున్నా. దేవుడి గిఫ్ట్‌గా భావిస్తున్నా.

**షూటింగులు ఉంటే ఉదయమే నిద్ర లేవాలి. జిమ్‌కి వెళ్లాలి. తర్వాత సెట్స్‌కి వెళ్లాలి... ప్రతిదీ షెడ్యూల్ ప్రకారం ఉంటుంది. ఇప్పుడు ఆ టెన్షన్ లేదు. రోజూ మీ దినచర్య ఎలా ఉంటోంది?**

(నవ్వుతూ) రెగ్యులర్ షెడ్యూల్ మొత్తం పక్కన పెట్టేశా. ఇప్పుడు నా జిమ్ కోచ్ రాలేదు. నాకు బద్ధకం ఎక్కువ. ఒక్కడినే జిమ్ చేయలేను. అందుకని, హ్యాపీగా ప్రతిరోజూ అమ్మ చేసిన వంట తింటున్నా. అన్నం, పప్పు, ఆవకాయ్, ఆమ్లెట్... నచ్చినవన్నీ తింటున్నా. డిజిటల్, టీవీ మీడియమ్‌లో సినిమాలన్నీ చూస్తున్నా. ఒక్కోరోజు మిడ్‌నైట్ 2 వరకూ సినిమాలు చూస్తున్నా. తెల్లారి 11 గంటలకు నిద్రలేస్తున్నా. తినడం, సినిమాలు చూడడం... ఇదే నా దినచర్య.

**కిచెన్‌లోకి వెళ్లి వంట చేసే ప్రయత్నం చేస్తున్నారా?**

నా స్నేహితులందరూ చేస్తున్నారు. వాట్సాప్ గ్రూప్‌లో ఫొటోలు పోస్ట్ చేస్తున్నారు. అవన్నీ చూశాక నాకు ఏదొక వంట చేయాలనిపించింది. రేపో మాపో నేనూ వంటింటిలోకి వెళతా. నా జీవితంలో ఇప్పటివరకూ వంట చేయలేదు. ఈసారి ప్రయత్నం చేస్తా.

**కరోనా ప్రభావం ఇండస్ట్రీపై ఎంతవరకూ ఉండొచ్చని అనుకుంటున్నారు? నష్టాలు...**

సినిమా ఇండస్ట్రీపై ఎఫెక్ట్ పక్కన పెడితే... మొత్తం ప్రపంచమే స్తంభించిపోయింది. ప్రపంచంలో సినిమా అనేది చిన్నదే. అంత ఎందుకు? నా జీవితంలో గొప్ప వేడుక... నా పెళ్లి. నేను నా పెళ్లిని వాయిదా వేశా. ఇప్పుడు ప్రజల ప్రాణాలు ముఖ్యం. ప్రాణం కంటే ఏదీ ఎక్కువ కాదు కదా.

**కరోనా లేకపోతే... ఈపాటికి మీరు పెళ్లి పనుల్లో బిజీగా ఉండేవారు**

చాలా బిజీగా ఉండేవాణ్ణి. యాక్చువల్లీ... ఆదివారం (ఏప్రిల్ 12) నా పెళ్లి కొడుకు ఫంక్షన్. వెంటనే దుబాయ్ జర్నీ, పెళ్లి. లాక్‌డౌన్ ముందు పెళ్లి, సినిమాలు, షూటింగులు చిన్నవే. డబ్బులు పోతే మళ్లీ సంపాదించుకోవచ్చు. సినిమాలు పోతే మళ్లీ హిట్ సినిమాలు చేయవచ్చు. మనం బావుంటే మిగతావన్నీ బావుంటాయి. మనం బావుండాలంటే... ఇంట్లో ఉండాలి. జాగ్రత్తగా ఉండాలి. బ్యాడ్ ఫీలింగ్స్ ఏవీ లేకుండా మనస్ఫూర్తిగా పెళ్లిని వాయిదా వేశా. జీవితంలో పెళ్లి చేసుకునేది ఒక్కసారే. సంతోషంగా చేసుకోవాలి కానీ... భయంగా మాస్క్ వేసుకుని ఎవరినీ టచ్ చేయకుండా చేసుకోవడం ఎందుకని నా అభిప్రాయం. మళ్లీ సాధారణ పరిస్థితులు నెలకొన్న తర్వాత చేసుకుందామని చెప్పగానే.. మా ఇంట్లో, కాబోయే శ్రీమతి శాలిని వాళ్లింట్లో... సంతోషంగా సరేనని అన్నారు.

## డిజిటల్‌లో... ఏప్రిల్ 27న 'భీష్మ'

థియేటర్‌లో 'భీష్మ' చిత్రాన్ని రెండుసార్లు చూశా. మూడోసారి వెళదామనుకుంటున్న తరుణంలో థియేటర్లు బంద్, లాక్‌డౌన్ వచ్చాయి. ట్విట్టర్‌లో అభిమానులు 'అన్నా... మళ్లీ థియేటర్‌లో సినిమా చూద్దామంటే లాక్‌డౌన్ వచ్చింది. ఓటీటీలో వస్తే బావుంటుంది' అని అడుగుతున్నారు. 'ఓటీటీలో సినిమా ఎప్పుడొస్తుందా?' అని నేనూ వెయిటింగ్. నిర్మాతలు ఏప్రిల్ 27న వస్తుందన్నారు. లాక్‌డౌన్ లేకపోతే గ్యారెంటీగా ఇంకో రెండు మూడు వారాలు ఆడేది. ప్రేక్షకులు థియేటర్లలో 'భీష్మ' చూశారు. చూడనివాళ్లు ఓటీటీలో చూస్తారు.

**లాక్‌డౌన్ పొడిగింపుపై మీ అభిప్రాయం?**

ముఖ్యమంత్రి కేసీఆర్‌గారి మీడియా సమావేశం చూశా. నా అభిప్రాయమూ అదే. మరో రెండు వారాలు లాక్‌డౌన్ పొడిగించడమే మంచిది. గురు, శుక్ర వారాల్లో కొత్త కేసుల సంఖ్య తగ్గిందని విన్నాను. ఇలా మరో రెండు వారాలు లాక్‌డౌన్ ఉంటే మంచి ఫలితాలు ఉంటాయి. ఒకవేళ లాక్‌డౌన్ తీసేస్తే... కరోనా వ్యాప్తి పెరిగితే ఎక్కువ జనాభా ఉన్న మన దేశంలో కంట్రోల్ చేయడం చాలా కష్టం. పంజాబ్, రాజస్థాన్, మహారాష్ట్ర ఈ నెల 30 వరకూ లాక్‌డౌన్ కొనసాగించాలని నిర్ణయించాయి. తెలంగాణలోనూ అదే నిర్ణయం తీసుకోవడం సంతోషం.

**చివరగా... ప్రజలకు మీరిచ్చే సలహా**

స్టే హోమ్... స్టే సేఫ్! కూరగాయలు, పాలు కోసం బయటకు వెళ్లాల్సి వస్తే ఒక్కరే మాస్క్ వేసుకుని వెళ్లండి. నేను ఇంట్లోనే ఉన్నా... ప్రతిరోజూ కనీసం 20సార్లు చేతులు కడుగుతున్నా. శానిటైజర్ ఉపయోగిస్తున్నా. బయటకు వెళితే ఇంకెంత జాగ్రత్తగా ఉండాలి? కరోనాపై యుద్ధంలో మనం చేయగలిగింది ఇదొక్కటే. ప్రభుత్వాలు చెప్పిన మాట వినండి.

● సత్య పులగం

# ఎక్కడ వదిలినా బతకగలను!



**కరోనా లాంటి విపత్కర పరిస్థితి ఎవరూ ఊహించి ఉండరు కదా?**

ఊహ తెలిశాక నివారణ ఉన్న భయంకర వ్యాధులు, వరదలు లాంటి విపత్కర పరిస్థితులను ఎదుర్కొన్న బాధితులను చూశా. కానీ ఇలాంటి పరిస్థితిని నేను గానీ, మా ఇంట్లో ముందు రెండు తరాల వారుగానీ చూడలేదు. కంటికి కనిపించని ఓ క్రిమి మానవాళిని ఇలా హతమారుస్తుందని ఎవరూ ఊహించి ఉండరు. మందు లేని ఈ మహమ్మారిని తరిమి కొట్టడానికి మన దగ్గర ఉన్న ఆయుధం శుభ్రంగా ఉండడం, సామాజిక దూరం పాటించడం, ఇంటికి పరిమితం అవ్వడం ఒక్కటే మార్గం. ఈ సమయంలో మనుషుల్ని ఎడ్యుకేట్ చేయడం చాలా ముఖ్యం.

**అందరిలా కాకుండా మీరు డిఫరెంట్‌గా ఆలోచించి డాక్టర్ల జాగ్రత్త గురించి పట్టించుకున్నారు. వారికి తోడ్పాటునిస్తున్నారు!**

కరోనా బాధితుల సంరక్షణ ఎంత ముఖ్యమో, వారికి వైద్యం అందిస్తున్న డాక్టర్ల ఆరోగ్యమూ అంతే ముఖ్యం. కరోనాతో మరణించిన వారిని పూడ్చి పెట్టడానికి కూడా ఎవరూ రాని పరిస్థితిని చూస్తున్నాం. కానీ డాక్టర్లు తమ భార్యా, బిడ్డల్ని వదిలి, ప్రాణ భయం లేకుండా రాత్రింబవళ్లు ఆసుపత్రిలో ఉండి వైద్యం అందిస్తున్నారంటే అంతకన్నా గొప్ప వ్యక్తులు ఎవరుంటారు. డాక్టర్లు లేకపోతే ఆసుపత్రులు ఉండి ఉపయోగం ఏంటి? అసలు పోలీసులు, డాక్టర్లు కరోనాకు భయపడి డ్యూటీలకు హాజరు కాకపోతే.. మరణాలు వేల సంఖ్యకు చేరుకునేవి. ఇలాంటి కఠిన పరిస్థితుల్లో డాక్టర్లు, పోలీసులు, మున్సిపల్ సిబ్బంది మనిషి రూపంలో ఉన్న దేవుడిలా కనిపిస్తున్నారు. వారే నిజమైన హీరోలు. అందుకే వివిధ ఆసుపత్రుల్లో వైద్య సిబ్బందికి ప్రొటెక్షన్ కిట్స్, ఎన్95 రెస్పిరేటర్లు, గ్లౌజులు, కంటి అద్దాలు, శానిటైజర్లు, 10వేల మాస్కులు అందజేశాను. వైజాగ్, విజయవాడ, గుంటూరు, అనంతపురం ప్రాంతాల్లోని డాక్టర్లకు కూడా సరఫరా చేశాం. నేను ఈ చిన్న హెల్ప్ చేయడానికి కారణం ప్రజలే. హీరోగా నన్ను ఆదరించి, వారు డబ్బులు పెట్టి కొన్న టిక్కెట్‌తోనే నేనీ రోజు ఓ ముద్ద తింటున్నా. అలాంటి ప్రజలకు, వారిని రక్షిస్తున్న వైద్యులకు ఎంత సాయం చేసినా తక్కువే!



నిచ్చెలి...తో

**లాక్‌డౌన్‌లో ఏం చేస్తున్నారు? దీని నుంచి ఏం నేర్చుకున్నారు?**

పలు కారణాలతో షూటింగ్‌లు నిలిచిపోవడం, రెండు, మూడు రోజులు థియేటర్లు బంద్ చేయడం చూశాం. కానీ.. ఇలా అన్ని రకాల ఇండస్ట్రీలకు మూత వేసుకుని ఇంట్లో కూర్చోవడం ఎప్పుడూ చూడలేదు. దైనందిన జీవితంలో మనం కుటుంబానికి ఎంత దగ్గరగా ఉంటున్నాం? ఎంత ప్రేమ, ఆప్యాయతలతో మెలుగుతున్నాం అనేది అందరికీ తెలుసు. కరోనా భయంతో ఇంట్లో ఉండడం వల్ల మనిషికీ, మనిషికీ మధ్య బంధం బలపడింది. కుటుంబ సభ్యులతో గడిపే ఛాన్స్ దొరికింది. పేద, ధనిక తేడా లేకుండా అంతా సమానంగా ఉన్నారు. వంట దగ్గర నుంచి ఇంటి పనులు చక్కబెట్టడం ఎంత కష్టమో అమ్మ పక్కన ఉండి చూస్తే తెలిసింది. జంక్ ఫుడ్ తినే నేను ఇంట్లో అమ్మ చేతి రుచికరమైన భోజనం చేస్తున్నా. 'మాయాబజార్', 'గుండమ్మ కథ' లాంటి సినిమాలను మళ్లీమళ్లీ చూస్తున్నా. నటనను ఇంప్రూవ్ చేసుకునే ప్రయత్నాలు చేస్తున్నా. ఓ పక్క తమిళం నేర్చుకుంటున్నా. నా బాడీ సిక్స్‌ప్యాక్ లెవల్లో ఫుల్ ఫిట్‌గా ఉండాలని 'కార్తికేయ' డైరెక్టర్ చందు మొండేటి ఎప్పటి నుంచో అడుగుతున్నాడు. ఇప్పుడు అదే పనిలో ఉన్నా. లాక్‌డౌన్ వల్ల ఇంట్లోనే ఉండి అన్ని పనులు నేర్చుకున్నా. ఇప్పుడు ప్రపంచంలో నన్ను ఎక్కడ వదిలేసిన ధైర్యంగా బతకగలను.



సేవా సమయంలో...

**లాక్‌డౌన్ కొనసాగింపు మంచిదేనంటారా?**

డెఫినెట్‌గా మంచిదేనండీ! ప్రభుత్వాలు, పోలీసులు తీసుకుంటున్న నిర్ణయాలు కఠినంగా ఉన్నప్పటికీ ప్రజల ఆరోగ్యం బాగుండాలంటే అలా ఉండాల్సిందే! ఎందుకంటే కొద్దిరోజులు జాగ్రత్తగా ఉంటే భవిష్యత్తులో ఆనందంగా ఉండగలం. కొందరు లాక్‌డౌన్‌ను అతిక్రమించి బయట గుంపులు గుంపులుగా తిరుగుతున్నారు. వాళ్లకు ఈ జబ్బు గురించి సరైన అవగాహన లేదనుకుంటున్నా. కరోనా భయంతో ఇప్పుడు ఏమైతే జాగ్రత్తలు తీసుకుంటున్నామో.. భవిష్యత్తులోనూ వాటిని ఆచరించాలి.

**మీ కాబోయే శ్రీమతి పల్లవీ వర్మ ఎలా పరిచయం?**

పల్లవీ వర్మ వృత్తిరీత్యా డాక్టర్. ఓ ఫంక్షన్‌లో కామన్ ఫ్రెండ్ ద్వారా పరిచయం అయింది. మాటలు, చూపులు కలిశాయి. ఆరు నెలల్లో ప్రపోజ్ చేసుకున్నాం. ఇరువైపు పెద్దలు అంగీకరించడం పెళ్లికి సిద్ధమయ్యాం. మా ఇద్దరిదీ పర్ఫెక్ట్ వేవ్‌లెంగ్త్. అర్థం చేసుకునే విషయంలోనూ అంతే! పల్లవి నన్ను మించిన ఎనర్జీతో ఉంటుంది.

**గుళ్లో అయినా పెళ్లి చేసుకుంటానన్నారు?**

హంగులతో కాకపోయినా అనుకున్న ముహూర్తానికి గుళ్లో అయినా పెళ్లి చేసుకుందాం అనుకున్నా. కానీ కుదరలేదు. పెళ్లనేది జీవితంలో ఒక్కసారి వచ్చే వేడుక. మన అనుకున్న అందరి మధ్య వివాహం జరిగితేనే దానికి అందం, అర్థం. ఇలాంటి సమయంలో పెళ్లి పెట్టుకుని నిబంధనలకు వ్యతిరేకంగా అందరినీ ఒక చోటుకి తీసుకురావడం ఇబ్బందితో కూడిన పని. గేదరింగ్ వల్ల ఎవరికి ఏ ఇబ్బంది కలిగినా జీవితాంతం అది బాధగానే ఉంటుంది. అందుకే పెళ్లి వాయిదా వేశాం. పరిస్థితులన్నీ సర్దుకున్నాక ఓ పెద్ద వేడుకలా నా పెళ్లి జరుగుతుంది.

**ఇతర భాషల్లో నటించే అవకాశం ఉందా?**

అలాంటి ఆలోచన లేదు. కానీ 'కార్తికేయ'కు సీక్వెల్‌గా వస్తున్న సినిమాను నాలుగైదు భాషల్లో విడుదల చేయాలనుకుంటున్నాం. యూనివర్సెల్ కాన్సెప్ట్ కాబట్టి ఆ సినిమాకు డబ్బింగ్ క్రేజ్ బావుంది. 'ఆర్ఆర్ఆర్' టీజర్‌లో అన్ని భాషలకు ఎన్టీఆర్ డబ్బింగ్ చెప్పినట్లుగానే నేను నా సినిమాకు డబ్బింగ్ చెప్పాలనుకుంటున్నా.

● ఆలపాటి మధు

**ఇంట్లో... పెళ్లాం చెప్పిందే 'కరో'నా...**
**మన ఇంట్లో సంతోషంగా ఉండడానికి!!**
**'చౌరస్తా'లో... చేయి చేయి కలపకురా....**
**సమాజం సంతోషంగా ఉండడానికి!!**

# కుర్రకారు పాటల చౌరస్తా!

సాంగ్స్ కరోనా

కరోనాపై అవగాహన కల్పించేలా, సందేశమిచ్చేలా కొందరు పాటలు చేస్తున్నారు. అందులో యూట్యూబ్‌లో శ్రోతలను, హైదరాబాద్‌లో యువతను ఆకట్టుకుంటూ ఫేమస్ అవుతోన్న 'చౌరస్తా' బృందం చేసిన పాటలూ రెండు ఉన్నాయి. వాట్సాప్‌లో, యూట్యూబ్‌లో వినపడుతున్నాయి. రెండిటిలో 'చేయి చేయి కలపకురా' పాట ఈ కష్టకాలంలో ప్రజలు ఎలా ఉండాలనే సందేశాన్నిస్తే... 'మిస్టర్ పెళ్లాం' పాట ఇంట్లో కుటుంబ బాధ్యతలు మోసే అలుపెరగని స్త్రీమూర్తికి ఘన నివాళిగా నిలిచింది. ఈ రెండు పాటల గురించి చెప్పే ముందు... 'చౌరస్తా' బ్యాండ్ గురించి కాస్త చెప్పాలి. జమైకా మ్యూజిక్ జానర్ 'రేగే' స్ఫూర్తితో పాశ్చాత్య సంగీతంలో జానపద శైలిలో ఈతరం ప్రేక్షకులు సైతం మెచ్చేలా పాటలు వినిపించడం వీరి ప్రత్యేకత. సుమారు రెండేళ్ల క్రితం ఈ బ్యాండ్ ప్రారంభమైంది.

సామాజిక సమస్యలే 'చౌరస్తా' బృందం స్వరపరిచే పాటలకు ముడిసరుకు. ఇంతకు ముందు రైతు సమస్యల నేపథ్యంలో 'సాగు బరువాయనా రైతా', పట్నం నుండి పల్లెకు పోవాలనుకునే యువకుడి నేపథ్యంలో పల్లెతీరు ఎలా మారిందో వివరించే 'ఊరెళ్లిపోతా మామ' పాటల నుండి ఇప్పటి కరోనా పాటలు 'చేయి చేయి కలపకురా', 'మిస్టర్ పెళ్లాం' పాటలు చేశారు. మధ్యలో 'మాయ' అనే సరదా గీతాన్నీ వినిపించారు. 'చేయి చేయి కలపకురా'కు రామ్ మిరియాల బాణీ కట్టడంతో పాటు స్వయంగా రాసి, పాడారు. ఆనంద్ గుర్రం రాసిన 'మిస్టర్ పెళ్లాం' పాటను యశ్వంత్ నాగ్ స్వరపరచడంతో పాటు ఆలపించారు.




## బాధ్యతగా బతకమని...

"పాపులారిటీ కోసం చేసిన పాట కాదిది. ప్రస్తుత సందర్భంలో ప్రజలకు అవసరమని 'చేయి చేయి కలపకురా' చేశా. ఒక్క రాత్రి రెండు మూడు గంటలు కూర్చుని పాట రాసి, స్వరపరిచా. మొదట పాట రాద్దామని అనుకోలేదు. ఇన్‌స్టాలో నాలుగు లైన్లు పోస్ట్ చేయాలనుకున్నా. రాశాక, ఏదో వెలితిగా అనిపించి పాట చేశా. నాకు రాయడం, పాడడం, స్వరపరచడం వచ్చు కాబట్టి ఇంట్లో కూర్చుని చేయడానికి ఇబ్బంది అనిపించలేదు. వీడియో చేసేలోపు అభిప్రాయం తెలుసుకుందామని స్నేహితులకు పంపించా. అది వైరల్ కావడంతో పాటు 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' వరకూ వచ్చింది. కరోనా తీవ్రత చాలామందికి తెలియడం లేదు. టీవీల్లో చూస్తున్నాం... బడ్డీకొట్లు దగ్గర వెనుక నుండి సిగరెట్లు కొని కాలుస్తున్నారు. స్నేహితులతో సరదాగా కబుర్లు చెబుతున్నారు. పని లేకున్నా కొంతమంది రోడ్ల మీదకు వస్తున్నారు. దీని వల్ల వాళ్లకు కరోనా అంటుకోవడమే కాదు, వాళ్ల నుండి ఇంట్లో కుటుంబానికి అంటుతుంది. ఒక్కరి ఆరోగ్యం పాడైతే వాళ్ల కుటుంబం, తర్వాత సమాజం పాడవుతుంది."



**- రామ్ మిరియాల,** రచయిత-గాయకుడు-స్వరకర్త

## కుటుంబం విలువ తెలుస్తోంది!

"అమ్మ, అర్ధాంగి, అమ్మాయి, సోదరి... ఎవరైతే ఏమి? మన ఇంటి మహిళలు, 24/7 మన కోసం పని చేసేవాళ్లకు కృతజ్ఞతలు చెప్పాలనే ఉద్దేశంతో 'మిస్టర్ పెళ్లాం' పాట చేశాం. మహిళలకు ఎవరూ సాటి రారు. రోజంతా ఇంట్లో ఉంటే ఎలా ఉంటుందో మగవాళ్లకు తెలియదు. ఉద్యోగాలు, వ్యాపారాల కోసం బయటకు వెళతారు. ఇంట్లో ఉండేది తక్కువ. కరోనా వల్ల రోజంతా ఇంట్లో ఉంటే... మహిళలు వెలకట్టలేని పని ఎంత చేస్తున్నారో కూడా తెలుస్తోంది. వాళ్లకు ఘన నివాళి ఈ పాట. ఒక్క రోజులో పాటను కంపోజ్ చేశా. ఆనంద్ లిరిక్స్ రాశారు. కరోనా కారణంగా లాక్‌డౌన్ విధించడానికి ముందు ఫొటోగ్రాఫర్ నాగరాజ్ నా దగ్గరకు వచ్చారు. అప్పట్నుంచీ తను నాతో ఉండడంతో నేను పాడేటప్పుడు షూట్ చేశారు. ఇల్లు, కుటుంబ సభ్యులు ఎంత ముఖ్యమో తెలుసుకోవడానికి అందమైన సమయం ఇది. పనిలో పడి రాత్రి రెండు మూడు గంటలకు ఇంటికి వచ్చేవాణ్ణి. నాకోసం అమ్మ భోజనం వండి పెట్టేది. కరోనా వల్ల మనకూ ఏదో జబ్బు వస్తుందని భయపడి, బాధ పడడం కంటే మన సమయాన్ని ఇంటి పనులకు వాడుకుంటే చాలా బావుంటుందని 'మిస్టర్ పెళ్లాం' చేశాం."



**- యశ్వంత్ నాగ్,** గాయకుడు-స్వరకర్త

## వాళ్ల శ్రమను గుర్తించమంటూ...

"ఇంట్లో ఏం జరుగుతుందనేది మగవాళ్లు పెద్దగా పట్టించుకోరు. రోజంతా ఇంట్లో ఉంటే ఏం జరుగుతుందనేది అర్థమయ్యాక... ఇంటిపనిలో మగవాళ్లూ పాలుపంచుకుంటే బాగుంటుంది. ఇంటిపని చేయడంలో మహిళలు మాస్టర్స్. మనమెంత చేసినా పర్‌ఫెక్ట్ కాలేము. అలాగని, ఖాళీగా కూర్చోకుండా వాళ్లు అడిగిన సహాయం చేస్తే బావుంటుంది. ఆడవాళ్లకు ఆదివారం ఉండదు, సెలవులు ఉండవు అనేది తెలిసిందే. ఇప్పుడు వాళ్ల కష్టాన్ని చాలామంది కళ్లారా చూస్తున్నారు. ఇప్పుడైనా గుర్తించండని 'మిస్టర్ పెళ్లాం' పాట ద్వారా చెప్పాం. ఒక్క రాత్రిలో మూడు నాలుగు గంటల్లో రాశా. 'చౌరస్తా' బ్యాండ్‌కి పాటలు రాస్తుంటా కదా! 'అందరి గురించి రాస్తారు. మా గురించి రాయరా?' అని ఒకసారి నా వైఫ్ అడిగింది. ఆమె మాటలూ ఈ పాట రాయడానికి ఒకరకంగా స్ఫూర్తి. తనతో పాటు మా అమ్మ, అక్కలకు పాట నచ్చింది. ఆఫీసు నుండి ఇంటికి వెళ్లగానే 'బయటకు వెళ్దామా?' అని భార్య ఎందుకు అడుగుతుందనేది ఇప్పుడు చాలామంది భర్తలకు తెలుస్తుందని అనుకుంటున్నా."



**- ఆనంద్ గుర్రం,** గీత రచయిత

ఆంధ్రజ్యోతి
andhrajyothibusiness@gmail.com

# బిజినెస్ ప్లస్

విజయవాడ ● ఆదివారం 12 ఏప్రిల్ 2020

## ప్రీమియం చెల్లింపులకు మరింత గడువు: ఎల్ఐసీ

మార్చి, ఏప్రిల్ నెల ప్రీమియం బకాయిల చెల్లింపులకు 30 రోజుల గడువు ఇస్తున్నట్టు భారతీయ జీవిత బీమా సంస్థ (ఎల్ఐసీ) శనివారంనాడు ప్రకటించింది. లాక్‌డౌన్ కొనసాగుతున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఫిబ్రవరి నెలకు సంబంధించిన ప్రీమియంల గరిష్ఠ కాలపరిమితి మార్చి 22 తర్వాత ముగుస్తుంది. వీటికి ఏప్రిల్ 15 వరకు సడలింపు ఇచ్చారు. ఎల్ఐసీ పాలసీదారులు ఎల్ఐసీ డిజిటల్ పేమెంట్ సదుపాయాల ద్వారా ఎలాంటి సర్వీస్ చార్జీ చెల్లించకుండా ప్రీమియం చెల్లింపులు చేయవచ్చని సంస్థ తెలిపింది. తమ వెబ్‌సైట్‌లో రిజిస్టర్ చేసుకోవాల్సిన అవసరం లేకుండానే కొన్ని వివరాలు అందించడం ద్వారా ప్రీమియం చెల్లింపులు నేరుగా చేయవచ్చని పేర్కొంది. మొబైల్ యాప్ 'ఎల్ఐసీ పే డైరెక్ట్‌'ను డౌన్‌లోడ్ చేసుకుని కూడా ప్రీమియంను చెల్లించవచ్చని తెలిపింది. నెట్ బ్యాంకింగ్, డెబిట్ కార్డు, క్రెడిట్ కార్డులతోపాటు పేటీఎం, ఫోన్‌పే, గూగుల్‌పే, భీమ్, యూపీఐ తదితరాల ద్వారానూ చెల్లింపులు చేసే సదుపాయాన్ని కల్పిస్తున్నట్టు పేర్కొంది. ఇదిలా ఉంటే.. కరోనాతో మృతి చెందిన 16 మంది పాలసీదారుల క్లెయిమ్‌లను చెల్లించినట్టు తెలిపింది.

## బజాజ్ అలియాంజ్ 'ఆరోగ్య సంజీవనీ పాలసీ'

ప్రైవేటు రంగంలోని బజాజ్ అలియాంజ్ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ తన ప్రామాణిక ఆరోగ్య బీమా పథకం 'ఆరోగ్య సంజీవనీ పాలసీ'ని అందుబాటులోకి తెచ్చింది. ఐఆర్‌డీఏఐ తాజాగా జారీ చేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా ఈ పాలసీని కంపెనీ విడుదల చేసింది. ఇది వార్షిక పాలసీ. ఇందులో సమ్ ఇన్సూరెన్స్ రూ.లక్ష నుంచి రూ.5 లక్షల వరకు ఉంది. ఈ పాలసీని ఇండివిడ్యువల్స్‌కే కాకుండా కుటుంబానికి అంటే భార్య/భర్త, పిల్లలు, తల్లిదండ్రులు, అత్తామామకు ఫ్లోటర్ ప్లాన్ కింద పాలసీ తీసుకోవచ్చు. ఈ పాలసీ కింద ఆస్పత్రిలో చేరినప్పుడు అయ్యే వ్యయాలు, ఆయుష్ చికిత్స, మానసిక అనారోగ్యం, స్టెమ్‌సెల్ థెరపీ, రోబోటిక్ సర్జరీలు వంటి వాటికి కవరేజీ లభిస్తుంది. ఈ పాలసీ కింద ప్రీమియంను వాయిదాల్లో చెల్లించవచ్చు. అంటే వార్షికంగా లేదా ఆరు నెలలు, మూడు నెలలు లేదా నెలవారీగా చెల్లించవచ్చు. ఈ పాలసీలో కనీస ప్రీమియం రూ.2,400 (జీఎస్‌టీ కాకుండా) నుంచి ప్రారంభం అవుతుంది. పాలసీదారుని వయసు, సమ్ అష్యూరెన్స్‌ను బట్టి ప్రీమియం మారుతుంది. ఈ పాలసీ తీసుకోవడానికి కనీస వయసు 18 ఏళ్లు కాగా గరిష్ఠ వయసు పరిమితి 65 ఏళ్లు. తల్లిదండ్రుల మీద ఆధారపడిన పిల్లల వయసు 3 నెలల నుంచి 25 ఏళ్ల వరకు ఉండవచ్చు. ప్రీ హాస్పిటలైజేషన్ వ్యయాలకు 30 రోజుల వరకు, పోస్ట్ హాస్పిటలైజేషన్ వ్యయాలకు 60 రోజుల వరకు కవరేజీ లభిస్తుంది. ఈ పాలసీ కింద కోవిడ్-19 సంబంధిత హాస్పిటలైజేషన్ వ్యయాలకు కూడా కవరేజీ లభిస్తుందని కంపెనీ తెలిపింది.



| ఫారం గేటు అమ్మకం ధరలు ( నెక్ 100 గుడ్లు) | | | |
|---|---|---|---|
| 11వ తేదీకి.. | | విజయవాడ | 345 |
| హైదరాబాద్ | 365 | విశాఖపట్నం | 345 |
| 12వ తేదీకి.. | | వరంగల్ | 368 |
| చిత్తూరు | 443 | డజను గుడ్లు రూ. 54 | |
| గోదావరి | 280 | | |



| ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. | | వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్ | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 85 | విజయవాడ | 80 |
| వరంగల్ | 85 | గుంటూరు | 80 |
| మహబూబ్‌నగర్ | 85 | ఒంగోలు | 80 |
| కరీంనగర్ | 85 | చిత్తూరు | -- |
| కర్నూలు | 85 | నెల్లూరు | -- |
| విశాఖపట్నం | 75 | అనంతపురం | -- |
| గోదావరి | 85 | | |



# 6 ఆపత్కాలంలో ఆర్థిక సూత్రాలు

## సిద్ధంకండి.. గండం గట్టెక్కండి





కరోనా కాటుకు ప్రపంచ మంతా రోదిస్తోంది. లాక్‌డౌన్‌తో భారత్ సహా చాలా ఆర్థిక వ్యవస్థలు స్తంభించి పోయాయి. ఆర్థిక కార్యకలాపాలన్నీ నిలిచి పోయాయి. వ్యాపారులు, పరిశ్రమలు, కార్పొరేట్ కంపెనీలకు రాబడి ఆగిపోయింది. వ్యాపారాన్ని మరింత విస్తరించాలనుకున్న కంపెనీలు సైతం ఇప్పుడు ఉద్యోగాలకు కత్తెరేసే పనిలో ఉన్నాయి. లేదంటే జీతాలకు కోత పెడుతున్నాయి. కొన్ని సంస్థలు ఇప్పటికే అమలుపర్చాయి కూడా. ఇలాంటి సంక్షోభాల ప్రభావం నుంచి గట్టెక్కించే ఆర్థిక సూత్రాలు మీకోసం..

### అత్యవసర నిధితో భవిష్యత్‌కు భద్రత

ఆపద చెప్పిరాదు. అనుకోని అత్యవసరాలను తీర్చుకునేందుకు కొంత సొమ్మును పక్కన పెట్టుకోవాలి. ఇది ప్రతి ఒక్కరూ పాటించాల్సిన ఆర్థిక సూత్రం. అత్యవసర నిధిని ఏర్పాటు చేసుకుంటే సంక్షోభ కాలంలో మీ భవిష్యత్‌కు భద్రత కల్పిస్తుంది. ఈ ఫండ్ సదా అందుబాటులో ఉండేలా చూసుకోవాలి. ఈ డబ్బును ఇంటి లాకర్‌లో దాచుకోవడం లేదా బ్యాంక్ ఖాతాలో డిపాజిట్ చేయడం మేలు. కనీసం 3-6 నెలల ఇంటి ఖర్చులకు (ఈఎంఐ, క్రెడిట్ కార్డు బిల్లు చెల్లింపులతో సహా) సమానమైన నిధిని ఏర్పాటు చేసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

### ఆరోగ్య బీమా.. ఉంటే ధీమా

వైద్య ఖర్చులు తడిసిమోపెడవుతున్న కాలంలో పెద్ద జబ్బు చేస్తే ఆస్తులమ్ముకోవాల్సిందే. కుటుంబంలో ఎవరైనా తీవ్ర అనారోగ్యం పాలైనప్పుడు మిమ్మల్ని ఆర్థికంగా రక్షించగలిగేది ఆరోగ్య బీమా పాలసీనే. చాలా కంపెనీలు తమ ఉద్యోగులకు గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పిస్తున్నాయి. కానీ, ఉద్యోగంలో ఉన్నన్ని రోజులే ఈ బీమా కవరేజీ లభిస్తుంది. సంక్షోభ కాలంలో ఉద్యోగం ఊడితే ఏంటి పరిస్థితి..? అప్పటికప్పుడు బీమా పాలసీ తీసుకున్నా చాలా వరకు వ్యాధులు, జబ్బులకు వెంటనే కవరేజీ లభించదు. కాబట్టి గ్రూప్ ఇన్సూరెన్స్ ఉన్నా.. మీ కుటుంబం కోసం సొంతంగా ఓ పాలసీ కొనుగోలు చేయడం ఉత్తమం. ఆ పాలసీని ప్రతియేటా రెన్యువల్ చేయడమూ మరవొద్దు.

### ఖర్చులకు కత్తెర వేయండి..

ఆదాయం నిలకడగా వస్తున్నా, నిలిచిపోయినా ఒకేలా ఖర్చు చేస్తామంటే ఎలా..? రాబడిలో హెచ్చుతగ్గులకు అనుగుణంగా ఖర్చులోనూ పట్టు విడుపులుండాలి. భవిష్యత్‌పై కమ్ముకున్న కరోనా మబ్బులు ఎప్పుడు తొలుగుతాయనే స్పష్టత లేనందున అనవసరపు ఖర్చులకు అడ్డకత్తెరేయాలి. అత్యవసర వ్యయానికే కట్టుబడి ఉండాలి. ఇలాంటి పరిస్థితుల్లో వైద్య ఖర్చుల కోసమూ కూడా కొంత పక్కన పెట్టుకోవాలి.

### పెట్టుబడులుంటే పనికొస్తాయ్..

అవసరానికి మించి డబ్బు ఉంటే దేంట్లోనైనా పెట్టుబడి పెట్టేయ్. అత్యవసర సమయంలో పని కొచ్చేది దాచిన లేదా పెట్టుబడి సొమ్మే. ప్రస్తుత ఆపత్కర పరిస్థితుల్లో జీవనోపాధి కోల్పోవాల్సి వచ్చినా.. గత పెట్టుబడులను నగదు రూపంలోకి మార్చుకుని ఉపయోగించుకోవచ్చు. అయితే, ఆర్థిక సలహాదారుల మేరకు పెట్టుబడులు పెట్టడం మేలు. నష్ట భయాలు తక్కువగా ఉంటే పెట్టుబడి సాధనాలు, పథకాలను ఎంచుకోవాలి. సొమ్మంతా ఒకదాంట్లో పెట్టుబడిగా పెట్టవద్దు. ఫిక్స్‌డ్ డిపాజిట్లు, ప్రభుత్వ బాండ్లు, పొదుపు పథకాలు, మ్యూచువల్ ఫండ్స్, ఈక్విటీ, బంగారం, రియల్టీ.. ఇలా పెట్టుబడులను వీలైనంతగా వివిధీకరించుకోగలగాలి.

### భారీ వ్యయాలకు ఆమడ దూరం

కరోనా కనికరించినా అది తీసుకొచ్చిన ఆర్థిక మాంద్యం మాత్రం మనల్ని ఇప్పుడప్పుడే వదిలేలా లేదు. కాబట్టి, కొన్నాళ్లపాటు భారీ వ్యయాలు, కొనుగోళ్లకు దూరంగా ఉంటే మంచిది.

### రుణం.. ఏకీకరణం

గృహ రుణం, వాహన రుణం, కన్స్యూమర్ లోన్, క్రెడిట్ కార్డుపై ఈఎంఐ చెల్లింపులు.. ఇప్పటికే చేసిన పలు అప్పులను సంక్షోభ కాలంలో కన్సాలిడేట్ చేసుకోవడం మేలు. పెద్దమొత్తం అప్పుతో చిన్న మొత్తం రుణ బకాయిలను తీర్చేయగలిగితే వడ్డీ భారం తగ్గుతుందని ఆర్థిక సలహాదారులు సూచిస్తున్నారు. ఉదాహరణకు, ప్రాపర్టీ తాకట్టుపై తక్కువ వడ్డీకే లభించే రుణాలను ఇందుకు ఎంచుకోవడం మేలంటున్నారు.

## మరిన్ని పట్టణాలకు జియో ఫైబర్ సేవలు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): వినియోగదారులకు హైస్పీడ్ బ్రాడ్‌బ్యాండ్‌ను అందించడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు జియో ఫైబర్ స్పష్టం చేసింది. హైదరాబాద్, తెలంగాణలోని ముఖ్య నగరాల్లో హైస్పీడ్ బ్రాడ్‌బ్యాండ్‌తో ఉత్తమ సేవలను అందించడంతోపాటు కవరేజీని పెంచుతున్నట్లు తెలిపింది. లాక్‌డౌన్‌తో అనేక మంది ఉద్యోగులు ఇంటి నుంచే పని చేస్తున్నారు. హైదరాబాద్, వరంగల్, నిజామాబాద్, నల్గొండ తదితర పట్టణాల్లో ఇంటి నుంచి పని చేస్తున్నవారికి హై స్పీడ్ బ్రాడ్‌బ్యాండ్‌ను అందించడం ద్వారా మద్దతుగా నిలవాలని కంపెనీ భావిస్తోందని జియోఫైబర్ తెలిపింది. ప్రస్తుతం ఈ సేవలు అందుబాటులో ఉన్న పట్టణాలతో పాటు ఇతర ప్రధాన పట్టణాలకు ఈ సేవలను విస్తరిస్తున్నట్లు పేర్కొంది. 100 ఎంబీపీఎస్ నుంచి 1జీబీపీఎస్ వరకూ వేగంతో హైస్పీడ్ బ్రాడ్‌బ్యాండ్ సేవలను అందిస్తున్నట్లు వివరించింది. లాక్‌డౌన్‌లో స్టే కనెక్ట్, స్టే ప్రొడక్టివిటీ ఆఫర్ ద్వారా ఖాతాదారులకు డబుల్ డేటా ప్రయోజనాన్ని కల్పిస్తున్నట్లు తెలిపింది.

## బీమా ప్రీమియం చెల్లింపు గడువు పెంపు : ఇండియా పోస్ట్

పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్, రూరల్ పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లింపుల తుది గడువును జూన్ 30 వరకు పొడిగించినట్టు ఇండియా పోస్ట్ తెలిపింది.

## ఎన్‌పీఎస్ నిధుల ఉపసంహరణకు పీఎఫ్ఆర్‌డీఏ ఆమోదం

నేషనల్ పెన్షన్ స్కీమ్ (ఎన్‌పీఎస్) చందాదారులందరూ కోవిడ్-19 సంబంధిత చికిత్స కోసం వారి ఖాతాలోని సొమ్మును పాక్షికంగా తీసుకునేందుకు పీఎఫ్ఆర్‌డీఏ అనుమతి ఇచ్చింది. ఆ వ్యాధిని మహమ్మారిగా ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో ప్రాణాంతకమైన అనారోగ్యంగా దాన్ని పరిగణించి నిధుల ఉపసంహరణకు అనుమతించినట్టు పీఎఫ్ఆర్‌డీఏ తెలిపింది. చందాదారులు, వారి చట్టబద్ధమైన భార్య లేదా భర్త, పిల్లలు, వారిపై ఆధారపడిన తల్లిదండ్రులు ఎవరికైనా ఈ వ్యాధి సోకితే చికిత్సా వ్యయాల కోసం ఎన్‌పీఎస్‌లోని నిధులను పాక్షికంగా తీసుకోవచ్చునని తెలియచేసింది. అయితే అవ్యవస్థీకృత రంగాల్లోని కార్మికుల కోసం అమలు పరుస్తున్న అటల్ పెన్షన్ యోజన (ఏపీవై) చందాదారులకు మాత్రం ఇది వర్తించదని స్పష్టం చేసింది.

# స్పోర్ట్స్

## ధోనీలో ఇంకా సత్తా ఉంది


నాసిర్ హుస్సేన్


ధోనీ

ముంబై: 'ధోనీలాంటి ఆటగాడు తరానికి ఒక్కరే ఉంటారు. అలాంటి క్రికెటర్‌కు ఎప్పుడు ఆటకు వీడ్కోలు పలకాలో తెలుసు. అందువల్ల రిటైర్ కావాలంటూ అతడిని ఒత్తిడి చేయకండి' అని ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ నాసిర్ హుస్సేన్ సూచించాడు. 39 ఏళ్ల మహీలో ఆడే సత్తా ఇంకా ఎంతో ఉందన్నాడు. 'ధోనీ కనుక వెళ్లిపోతే.. మళ్లీ అతడిని తీసుకురావడం కష్టం. ఈ ఆటలో దిగ్గజాలు అనే వారు ఉంటారు. అలా వారిని కీర్తిస్తూనే త్వరగా రిటైర్ కావాలంటూ ఒత్తిడి చేయడం తగదు. తన మానసిక శక్తి సామర్థ్యాల గురించి ధోనీకే తెలుసు. ఆటగాడిని అంతిమంగా సెలెక్టర్లు ఎంపిక చేస్తారు. తనకు అవకాశం వచ్చినప్పుడు జట్టుకు ప్రాతినిధ్యం వహించడమే ఆ క్రికెటర్ చేయాల్సింది' అని ఓ క్రీడా చానెల్ షోలో హుస్సేన్ అన్నాడు. గత ఏడాది జూలైలో న్యూజిలాండ్‌తో వన్డే వరల్డ్ కప్ సెమీఫైనల్ తర్వాత ధోనీ ఆటకు దూరంగా ఉన్నాడు. ఇంత సుదీర్ఘకాల విరామం తర్వాత అంతర్జాతీయ క్రికెట్‌లో పునరాగమనం చేయడం ఎంఎస్‌కు కష్టమేనని దిగ్గజ ఆటగాళ్లు సునీల్ గవాస్కర్, కపిల్ దేవ్ ఇటీవల వ్యాఖ్యానించారు. కానీ నాసిర్ మాత్రం భిన్నంగా స్పందించాడు 'ధోనీకి టీమిండియాలో రీ ఎంట్రీకి అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. ఎందుకంటే భారత జట్టుకు అతడు చేయాల్సింది ఎంతో ఉంది' అని అన్నాడు.

## మూడేళ్లు ఇంటిమొహం చూడను!


చాహల్

న్యూఢిల్లీ: కరోనాపై పోరులో భాగంగా లాక్‌డౌన్ విధించడంతో క్రీడాకారులంతా ఇంటిపట్టునే ఉంటున్నారు. కొందరేమో ఇంట్లో పనులు చేస్తూ భార్యలకు సహకరిస్తుండగా.. మరికొందరు ఇండోర్ గేమ్స్ ఆడుతూ తమ సరదా తీర్చుకుంటున్నారు. అయితే, తనకు మాత్రం ఇంట్లో ఉండడం మహా బోర్‌గా ఉందంటున్నాడు టీమిండియా యువ స్పిన్నర్ యజ్వేంద్ర చాహల్. ప్రస్తుతం తాను కఠిన సమయాన్ని ఎదుర్కొంటున్నానన్న చాహల్.. లాక్‌డౌన్ ఎత్తేసిన తర్వాత మూడేళ్లపాటు ఇంటి మొహమే చూడొద్దనుకుంటున్నానని అన్నాడు. 'లాక్‌డౌన్ ఎత్తేస్తే ముందు ఇంటి నుంచి బయటపడతా. మూడేళ్ల దాకా ఇంటి మొహమే చూడకూడదనిపిస్తోంది. హోటల్‌లోనైనా ఉంటా కానీ.. ఇంటికి రాకూడదనుకుంటున్నా. వామ్మో.. ఇంతటి సుదీర్ఘమైన లాక్‌డౌన్‌ను ఎన్నడూ చూడలేదు. నాకు నిద్ర పట్టడం లేదు. ఎప్పుడెప్పుడు మైదానానికి వెళ్దామా, బంతులేద్దామా అనిపిస్తోంది. లాక్‌డౌన్ ముగిసిన వెంటనే ప్రతిరోజూ గ్రౌండ్‌కెళ్లి ఒక్క బంతైనా వేయాలనుంది' అని ఓ టెలివిజన్ చాట్‌షోలో చాహల్ చెప్పుకొచ్చాడు.

## 'విజ్డెన్'లో రోహిత్‌కు చోటు లేదా..?


లక్ష్మణ్

ముంబై: ప్రతిష్ఠాత్మక విజ్డెన్ జాబితాలో టీమిండియా ఓపెనర్ రోహిత్ శర్మకు చోటు దక్కకపోవడంపై మాజీ బ్యాట్స్‌మన్ వీవీఎస్ లక్ష్మణ్ ఆశ్చర్యం వ్యక్తం చేశాడు. గతేడాది అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన టాప్ క్రికెటర్లలో పురుషుల విభాగం నుంచి ఇంగ్లండ్ ఆల్‌రౌండర్ బెన్‌స్టోక్స్, మహిళల్లో ఆస్ట్రేలియాకు చెందిన ఎలిస్ పెర్రీని ఎంపికచేస్తూ మూడ్రోజుల క్రితం విజ్డెన్ అల్మానక్ ఎడిషన్ జాబితా ప్రకటించిన సంగతి తెలిసిందే. వరల్డ్‌కప్‌లో ఏకంగా ఐదు సెంచరీలు చేసిన రోహిత్ పేరును విస్మరించడమేంటో తనకు అర్థం కాలేదని లక్ష్మణ్ అన్నాడు. 'విజ్డెన్ జాబితాలో రోహిత్ పేరు లేకపోవడం క్రికెట్ ఇష్టపడే ప్రతి ఒక్కరినీ షాక్‌కు గురిచేసింది. ఒక మెగా ఈవెంట్‌లో ఐదు శతకాలు చేసి రోహిత్ తానేంటో నిరూపించుకున్నాడు' అని వీవీఎస్ అన్నాడు.

## పోలీసులకు సెల్యూట్


కోహ్లీ

న్యూఢిల్లీ: కొవిడ్-19 మహమ్మారిపై పోరాటంలో అవిశ్రాంతంగా కృషి చేస్తున్న పోలీసులను టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లీ, పేసర్ ఇషాంత్ శర్మ, డబుల్స్ మాజీ షట్లర్ గుత్తా జ్వాల, మాజీ లాంగ్‌జంపర్ అంజూ బాబీజార్జ్ ప్రశంసించారు. లాక్‌డౌన్ సమయంలో పోలీసులు చేస్తున్న సేవలు ప్రశంసనీయమని విరాట్, ఇషాంత్, జ్వాల, అంజూ చేసిన వీడియో సందేశాలను ఢిల్లీ పోలీసులు ట్విటర్‌లో పోస్ట్ చేశారు. 'ఈ క్లిష్ట సమయంలో ఢిల్లీ పోలీసులు నిజాయితీగా విధులు నిర్వర్తిస్తున్నారు. లాక్‌డౌన్ కారణంగా ఉపాధి కోల్పోయిన నిరుపేదలకు ఆహారాన్ని అందజేస్తున్నారు. వాళ్లకు సెల్యూట్ చేస్తున్నా. మీ సేవలను ఇలాగే కొనసాగించండి' అని తన వీడియోలో విరాట్ కొనియాడాడు. పగలు, రాత్రి అన్నది లేకుండా నిర్విరామంగా పోలీసులు కష్టపడుతున్నారని ఇషాంత్ పేర్కొనగా.. ఈ సమయంలో ప్రజలందూ ఇళ్లలోనే ఉంటూ పోలీసులకు సహకరించాలని జ్వాల, అంజూ ట్వీట్ చేశారు.


జ్వాల

## అవును.. మార్గదర్శకులు లేరు!


గంభీర్

న్యూఢిల్లీ: ప్రస్తుత టీమిండియాలో మార్గదర్శకులు కొరవడ్డారని యువరాజ్ సింగ్ వ్యక్తంజేసిన అభిప్రాయంతో మాజీ ఓపెనర్ గౌతమ్ గంభీర్ ఏకీభవించాడు. కెప్టెన్ కోహ్లీ, రోహిత్ మినహా భారత జట్టులో సరైన మార్గదర్శకులు లేరని యువరాజ్ ఇటీవల వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే. '2000లో ద్రావిడ్, కుంబ్లే, లక్ష్మణ్, సౌరవ్, సచిన్ మాదిరి జట్టుకు దిశానిర్దేశం చేసేవారు ప్రస్తుత జట్టులో లేరు. యువ క్రికెటర్లు క్లిష్ట పరిస్థితులు ఎదుర్కొంటే సీనియర్లు వారికి సలహాలు, సూచనలు చేసి అండగా నిలుస్తారు. కానీ ప్రస్తుతం టీమిండియాలో వ్యక్తిగత ప్రయోజనాలను పక్కకుపెట్టి జూనియర్లకు సాయం చేసేవారు లేరు' అని గంభీర్ అన్నాడు.



## ఒలింపిక్స్ వాయిదాతో... ఆ మొత్తం తిరిగొచ్చేనా?

లుసానే: కరోనా దెబ్బకు టోక్యో ఒలింపిక్స్ ఏడాది వాయిదా పడ్డాయి. దాంతో ఈ క్రీడలకు హాజరయ్యేందుకు విమాన టిక్కెట్లకు, హోటల్ గదులకు చెల్లించిన డబ్బులు వస్తాయో.. రావోనని వేలాదిమంది ఫ్యాన్స్ ఆందోళన చెందుతున్నారు. వాస్తవానికి ఈ జూలైలో జరగాల్సిన ఒలింపిక్స్‌ను కొవిడ్-19 దెబ్బకు 2021 జూలైకి ఐఓసీ వాయిదా వేసిన సంగతి తెలిసిందే. 2021 గేమ్స్‌కు హాజరుకాలేకపోతే..ఆయా క్రీడాంశాల పోటీలు చూసేందుకు కొన్న టిక్కెట్ల డబ్బును వాపసు చేస్తామని ఐఓసీ హామీ ఇచ్చింది. కానీ క్రీడల వాయిదాకు అనుగుణంగా విమాన టిక్కెట్లు, హోటల్ గదుల రిజర్వేషన్లను పొడిగించుకొనేందుకు అవకాశం ఉందో లేదో తెలియక అభిమానులు టెన్షన్ పడుతున్నారు. విమానయాన సంస్థలు, హోటల్ యజమానుల స్పందన కోసం ఎదురు చూస్తున్నామని వారు చెబుతున్నారు.



తైవాన్‌లో శనివారం మొదలైన చైనీస్ ప్రొఫెషనల్ బేస్‌బాల్ లీగ్ మ్యాచ్‌లో భాగంగా స్టేడియంలో ప్రేక్షకుల స్థానంలో మాస్క్‌లతో కూడిన బొమ్మలు దర్శనమిచ్చాయి.

## క్రికెట్ కోసం.. కాల్ లెటర్ చించేశా


క్రునాల్ పాండ్యా

ముంబై: పాండ్యా బ్రదర్స్..క్రునాల్, హార్దిక్ కొద్దికాలంలోనే క్రికెట్‌పై తమదైన ముద్ర వేసిన ఆటగాళ్లు. మేటి క్రికెటర్లుగా మారడానికి ముందు ఆ అన్నదమ్ములు ఎదుర్కొన్న ఆర్థిక ఇబ్బందులు ఎన్నో. అయితే క్రికెటర్లు కావాలన్న తమ కలను నిజం చేసుకొనేందుకు వారు వాటిని లెక్క చేయలేదు. ఈక్రమంలో తనకు వచ్చిన ప్రభుత్వోద్యోగ కాల్ లెటర్‌ను చించివేసిన ఉదంతాన్ని క్రునాల్ పాండ్యా గుర్తు చేసుకున్నాడు. 'కొద్ది సంవత్సరాలు వెనక్కు వెళితే..స్పీడ్ పోస్ట్ ఉద్యోగానికి నాకు కాల్ లెటర్ వచ్చింది. నెలకు రూ. 15 వేలనుంచి 20 వేలు వస్తాయి. మంచి ఉద్యోగం వదులుకోకు అని నాన్న చెప్పాడు. ఇంటర్వ్యూ రోజునే బరోడా జట్టుకు ముస్తాక్ అలీ ట్రోఫీకి ఎంపికలకు నేను హాజరుకావాల్సి ఉంది. నాలో అంతర్మథనం మొదలైంది.. ప్రభుత్వోద్యోగమా, క్రికెటా అని. క్రికెటర్ అవడంకోసం అహరహరం శ్రమించా. కానీ స్పీడ్ పోస్ట్ జాబ్ కోసం నేను కష్టపడలేదు. రాష్ట్ర జట్టుకు తొలిసారి ప్రాతినిధ్యం లభించే అవకాశం వచ్చింది. దాంతో క్రికెటర్‌గానే స్థిరపడాలని నిర్ణయించుకొని కాల్ లెటర్ చించేశా' అని వివరించాడు. 'ఎంపికలకు వెళ్లడమేకాదు అక్కడ సత్తా చాటి బరోడా జట్టులోనూ చోటు సంపాదించా. హార్దిక్ అప్పటికే ఆ జట్టులో ఉన్నాడు' అని తెలిపాడు. ఇక.. తమలో ప్రతిభను పసిగట్టి సాన బెట్టింది ముంబై ఇండియన్స్ మాజీ కోచ్ జాన్ రైట్ అని క్రునాల్ వెల్లడించాడు. 'మాకు బ్యాటింగ్‌తోపాటు బౌలింగ్‌లోనూ సత్తా ఉందని రైట్ గ్రహించి ప్రోత్సహించాడు. అలా మా నైపుణ్యం మరింత మెరుగుపడింది. ఆ రోజు నేను ఆ లెటర్‌ను చింపివేయకుంటే క్రికెటర్‌ను అయ్యేవాడినికాదు. మా జీవితాలు కూడా భిన్నంగా ఉండేవి' అని క్రునాల్ వివరించాడు.

## ఆ ఇన్నింగ్స్ ఎప్పటికీ మధురం


అజరుద్దీన్

న్యూఢిల్లీ: 'నా 30 అంతర్జాతీయ శతకాలలో 10-12 మాత్రమే గుర్తుంటాయి. అందులో న్యూజిలాండ్‌పై సునామీ ఇన్నింగ్స్ 31 ఏళ్ల తర్వాతా నా మదిలో మెదులుతూనే ఉంది' అని టీమిండియా మాజీ కెప్టెన్ మహ్మద్ అజరుద్దీన్ చెప్పాడు. ఆ రోజు ఇన్నింగ్స్‌లో తనకు పరిస్థితులన్నీ అనుకూలించాయని తెలిపాడు. 1988 డిసెంబరు 17న న్యూజిలాండ్‌తో ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా జరిగిన ఆ నాలుగో వన్డేలో అజర్ (65 బంతుల్లో 108 నాటౌట్) ఆకాశమేహద్దుగా చెలరేగి 62 బంతుల్లోనే సెంచరీ సాధించాడు. కివీస్ బౌలర్లను ఊతకోత కోస్తూ చేసిన 100 రన్స్ అప్పట్లో వన్డేల్లో అత్యంత వేగవంతమైన సెంచరీ కావడం విశేషం. ఆ మ్యాచ్ దూరదర్శన్‌లో ప్రత్యక్ష ప్రసారమైనా దానికి సంబంధించి ఫుటేజ్ ప్రస్తుతం అందుబాటులో లేకపోవడం గమనార్హం. ఆ రోజుల్లో దూరదర్శన్‌లో తరచూ లింక్ కట్ అవుతుండేది. భారత్ చేజింగ్‌లో అజర్ బ్యాటింగ్ సమయంలో అదే చోటు చేసుకుంది. దాంతో క్రికెట్ ఫ్యాన్స్‌కు ఆ అద్భుత ఇన్నింగ్స్ చూసే అవకాశం దక్కలేదు. ఆ క్షణాలను అజర్ గుర్తు చేసుకుంటూ.. 'వడోదరలోని మోతీబాగ్ ప్యాలెస్ గ్రౌండ్‌లో ఆ మ్యాచ్ జరిగింది. ఎండ తగలకుండా ప్రేక్షకులకోసం షామియానాలు వేశారు. ఆ మ్యాచ్‌లో మూడో నాలుగో సిక్సర్లు కొట్టా. వాటిలో రెండు గ్రౌండ్ బయటకు వెళ్లాయి. ఒకటేమో చెట్టుకు తగిలింది. ఆ రోజు తప్పులకు తావులేని విధంగా నా బ్యాటింగ్ సాగింది. 60 బంతుల్లోనే సెంచరీ చేశాననే విషయం నాకు కూడా తెలియలేదు' అని అజర్ అన్నాడు. కపిల్‌దేవ్‌లేని ఆ మ్యాచ్‌లో భారత బౌలర్లు భారీగా పరుగులు సమర్పించుకున్నారు. సంజీవ్ శర్మ (10 ఓవర్లలో 74), రషీద్ పటేల్ (10 ఓవర్లలో 58), చేతన్ శర్మ (10 ఓవర్లలో 1/54) ఏమాత్రం ప్రభావం చూపలేకపోయారు. 'నాడు 279 రన్స్ చేజ్ చేయడమంటే ఇప్పట్లో 340 పరుగులంత. ఆరోజు నేను ఆరో నెంబర్‌లో బ్యాటింగ్ చేయడం కలిసి వచ్చింది. సరిగ్గా గుర్తులేదు కానీ దిలీప్ భాయ్ (వెంగ్‌సర్కార్) లేదా సంజయ్ మంజ్రేకర్ అవుటయ్యాకో నేను క్రీజులోకి వచ్చా. అజయ్ శర్మ చక్కటి సహకారం అందించాడు. మేం వేగంగా 100 పరుగులకుపైగా భాగస్వామ్యం నెలకొల్పాం' అని 57 ఏళ్ల అజర్ చెప్పాడు. ఆ సిరీస్‌ను వెంగ్‌సర్కార్ కెప్టెన్సీలోని భారత్ 4-0తో నెగ్గింది.



కాశీ నుంచి తీసుకురావాలని వేడుకుంటున్న తెనాలివాసులు

## ఆరోగ్యం బాలేదు.. కాపాడండి!

- ప్రధానికి కాశీలో చిక్కుకున్న తెనాలివాసుల మొర

తెనాలి అర్బన్, ఏప్రిల్ 11: తీర్థయాత్రలకని వచ్చాం.. లాక్‌డౌన్ కారణంగా ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కాశీలో 20 రోజులుగా చిక్కుకుపోయాం. ఇందులో వృద్ధులు, పిల్లలున్నారు. ఆరోగ్యం సహకరించక ఇబ్బందులు పడుతున్నాం.. దయచేసి తమ ప్రాంతానికి పంపించాలంటూ తెనాలి, విజయవాడకు చెందిన పలు కుటుంబాల వారు ప్రధాని నరేంద్ర మోదీకి బహిరంగంగా వేడుకుంటున్నారు. లాక్‌డౌన్‌కు ముందు కాశీ యాత్రకు వెళ్లి అక్కడే చిక్కుకుపోయిన వీరు.. శనివారం 'ఏబీఎన్ ఆంధ్రజ్యోతి'కి ఫోన్ చేసిన తమ ఇక్కట్లను ఏకరువు పెట్టారు. వెంటనే తమ ప్రాంతాలకు చేర్చేలా చొరవ చూపాలని కోరారు. దీనిపై ఇంతకు ముందు తెనాలి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్‌కు కూడా విజ్ఞప్తి చేశారు. లాక్‌డౌన్ సడలించిన వెంటనే తెనాలి తీసుకువస్తామంటూ ఆయన వారికి ధైర్యం చెప్పారు.

## ముస్లింలకు ఇది కరెక్ట్‌కాదు!

- ప్లేట్లు, స్పూన్లు నాకుతూ కరోనా వ్యాప్తి చేస్తున్నట్టు వీడియోల్లో చూశా: నారాయణస్వామి

తిరుపతి, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): కరోనా వ్యాప్తిని అరికట్టే విషయంలో ముస్లింలు సహకరించడం లేదని వార్తలు వస్తున్నాయని, ఇది సరైన పద్ధతి కాదని డిప్యూటీ సీఎం నారాయణస్వామి అన్నారు. "ఐసోలేషన్‌కు తీసుకెళ్లిన ముస్లింలు వైద్యులకు సహకరించడంలేదని వార్తలు వస్తున్నాయి. ఇప్పటికైనా వారు సహకరించాలి" అని సూచించారు. అదేసమయంలో ముస్లింలు ప్లేట్లు, స్పూన్లు నాకుతూ కరోనా వ్యాప్తి చేసినట్టు అనిపిస్తోందని, దీనికి సంబంధించి కూడా వీడియోలు వచ్చాయని చెప్పారు. ఇది మంచి పద్ధతి కాదని అన్నారు. ఎవరైనా వైద్యులకు సహకరించాల్సిందేనన్నారు. ఈ మేరకు శనివారం తిరుపతిలో ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రతిపక్ష నేత చంద్రబాబుకు క్యారెక్టర్ లేదని విమర్శలు గుప్పించారు.

## క్వారంటైన్‌లో ఉన్న గర్భిణికి పండంటి బిడ్డ

గుజరాతీపేట(శ్రీకాకుళం), ఏప్రిల్ 11: శ్రీకాకుళం జిల్లా పాలకొండలోని క్వారంటైన్ కేంద్రంలో ఉన్న ఓ మహిళ శనివారం పండంటి బిడ్డకు జన్మనిచ్చింది. పాలకొండకి చెందిన ఓ గర్భిణి.. ఇటీవల ప్రకాశం జిల్లా నుంచి వచ్చింది. బయటి ప్రాంతం నుంచి వచ్చినందున.. కరోనా నియంత్రణలో భాగంగా అధికారులు ఆమెను క్వారంటైన్‌కు తరలించారు. శనివారం ఆమెకు పురిటినొప్పులు రావడంతో శ్రీకాకుళంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి తరలించారు. ఆమెకు అక్కడ సుఖ ప్రసవమై ఆడబిడ్డకు జన్మనిచ్చింది. అదే సమయంలో ఆస్పత్రి పరిశీలనకు వచ్చిన కలెక్టర్ నివాస్ ఆమెను పరామర్శించారు. బిడ్డ రక్షణ కోసం రూ.25 వేల చెక్కు అందజేశారు.

## ఆర్ఎంపీలూ.. వైద్యం చేయొద్దు: వైద్య శాఖ

అమరావతి, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): జలుబు, దగ్గు, జ్వరంతో వచ్చే వారికి ఆర్ఎంపీలు వైద్యం చేయొద్దని ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.ఎస్.జవహర్‌రెడ్డి ఆదేశించారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాల్లో ఆర్ఎంపీలు కరోనాకు సంబంధించిన వైద్యం చేస్తున్నట్లు ప్రభుత్వం దృష్టికి వచ్చిందని తెలిపారు. ఆదేశాలను పాటించకుంటే ఆర్ఎంపీలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో కేవలం ఎమర్జెన్సీ కేసులకు సంబంధించిన ఓపీలు మాత్రమే నడుస్తాయని జవహర్‌రెడ్డి స్పష్టం చేశారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకే ప్రత్యేక ఓపీని నడిపించాలన్నారు.

## కరోనా లక్షణాలుంటే చెప్పండి: ప్రభుత్వం

అమరావతి, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): కరోనా లక్షణాలపై చేస్తున్న సర్వేలో అందరూ వాస్తవాలు చెప్పి సహకరించాలని ప్రభుత్వ వర్గాలు విజ్ఞప్తి చేశాయి. 'నిజాలు దాచకండి. అలా దాస్తే మీకే ఇబ్బంది. ఏదో ఒకరోజు విషయం చెప్పక తప్పదు. అయితే తొలిదశలో నిజాలు దాచడం మీ ప్రాణాల మీదకు తెస్తుంది. ప్రభుత్వం ఇప్పుడు ఇంటింటి సర్వే నిర్వహిస్తోంది. ఆరోగ్య కార్యకర్తలు, మున్సిపల్, గ్రామ సిబ్బంది ప్రతి ఇంటికీ వస్తున్నారు. ఇంట్లో వారి వివరాలు, వారికేమైనా జలుబు, దగ్గు, జ్వరం లాంటివి ఉన్నాయా? అని అడుగుతున్నారు. అయితే ఈ సర్వే చేసేవాళ్లు ఏమీ ఇళ్లల్లో ఉన్నవారికి పరీక్షలు చేయరు. మీరు చెప్పింది రాసుకుని వెళ్లిపోతారంతే. కరోనా లక్షణాలు ఉంటే... క్వారంటైన్‌లో పెట్టడం, పరీక్షకు పంపించడం చేస్తారు. ఒకవేళ పాజిటివ్ వచ్చినా 99శాతం మంది రికవరీ అయిపోతారని, ఆస్పత్రిలో ఉండి కోలుకుని మళ్లీ సురక్షితంగా ఇంటికి చేరుకోవచ్చని భరోసా ఇచ్చింది.

## గవర్నర్ సంతకం పెట్టాల్సింది కాదు: అయ్యన్న

అమరావతి, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): ఎన్నికల కమిషనర్ మార్పునకు సంబంధించి ప్రభుత్వం పంపిన ప్రతిపాదనలపై గవర్నర్ సంతకం పెట్టకుండా ఉండాల్సిందని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు శనివారం మీడియాతో అన్నారు. 'దొంగ ముఖ్యమంత్రి పంపించిన ప్రతిదానిపై గవర్నర్ కళ్లు మూసుకొని సంతకం పెట్టడం తగదు. ప్రభుత్వ ప్రతిపాదన రాజ్యాంగ సూత్రాలకు అనుకూలంగా ఉందా? చట్టానికి లోబడి ఉందా? అనే విషయాలపై న్యాయ నిపుణులతో చర్చించకుండా గవర్నర్ ఎలా సంతకం పెడతారు? ముఖ్యమంత్రి తప్పు చేస్తే దానిని సరిదిద్దాల్సిన బాధ్యత గవర్నర్‌కు ఉంది. ఆ పని ఆయన ఎందుకు చేయలేకపోయారో అర్థం కావడం లేదు. కనీసం కేంద్రంతోనో... ప్రధానితోనో ఆయన మాట్లాడి ఉండాల్సింది. గవర్నర్ ఇచ్చిన ఆర్డినెన్స్ కోర్టుల్లో నిలబడదని నేను అనుకొంటున్నాను' అని అయ్యన్న వ్యాఖ్యానించారు.

## జగన్‌కు ఇంత అపరిపక్వతా?: రామ్మోహన్

అమరావతి, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): లాక్‌డౌన్ పొడిగింపు అవసరం లేదని, కొన్ని ప్రాంతాలకే పరిమితం చేస్తే సరిపోతుందని సీఎం జగన్ ప్రధాని మోదీకి చెప్పడాన్ని ప్రధాన ప్రతిపక్షం టీడీపీ తప్పుబట్టింది. ఆయన మరీ ఇంత అపరిపక్వతతో వ్యవహరిస్తారని ఊహించలేదని ఆ పార్టీ వ్యాఖ్యానించింది. 'పొరుగున ఉన్న ఒడిసాలో 50 కేసులే ఉన్నా ఆ రాష్ట్ర సీఎం అందరి కంటే ముందే లాక్‌డౌన్‌ను పొడిగించారు. మన రాష్ట్రంలో నమోదైన కేసులు 400 దాటిపోయాయి. ఆరుగురు చనిపోయారు. అయినా లాక్‌డౌన్ అవసరం లేదనటం సీఎం అపరిపక్వతకు నిదర్శనం.' అని టీడీపీ ఎంపీ రామ్మోహన్ నాయుడు వ్యాఖ్యానించారు.

## విమాన టికెట్లకు భారీ డిమాండ్

- బుకింగ్ ప్రారంభించిన స్పైస్‌జెట్, ఇండిగో

విజయవాడ, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): లాక్‌డౌన్ ఎత్తేసిన తర్వాత సర్వీసులు నడిపే అవకాశం ఉంటుందని భావించిన విమానయాన సంస్థలు తమ వెబ్‌సైట్ల ద్వారా బుకింగ్ అవకాశాన్ని కల్పించాయి. ఏప్రిల్ 15, 16 తేదీలకు గాను స్పైస్‌జెట్, ఇండిగో టికెట్ల బుకింగ్‌ను ప్రారంభించాయి. జనతా కర్ఫ్యూకు ముందు విజయవాడ వచ్చినవారు అప్పటినుంచి లాక్‌డౌన్ కారణంగా ఇక్కడే చిక్కుకుపోయారు. కృష్ణా, గుంటూరు, ప్రకాశం, ఉభయగోదావరి జిల్లాలతో పాటు తెలంగాణలోని ఖమ్మం జిల్లావారికి కూడా విజయవాడ విమానాశ్రయం అతి దగ్గరగా ఉంది. ఈ ప్రాంతాలకు వచ్చి ఉండిపోయిన వారు, ఇక్కడినుంచి దేశంలోని ఇతర ప్రాంతాలకు వెళ్లి అక్కడ చిక్కుకుపోయినవారు కూడా వేలల్లో ఉన్నారు. లాక్‌డౌన్ ముగుస్తుండటంతో వీరంతా రాకపోకలకు సిద్ధమయ్యారు. ముందస్తుగా టికెట్లు బుకింగ్ చేసుకుంటున్నారు. ఎయిర్ ఇండియా వాటి అనుబంధ సంస్థలన్నీ కూడా ఈ నెల 30 వరకు బుకింగ్ చేపట్టలేదు. ట్రూజెట్ కూడా ఇదే బాటలో ఉంది. స్పైస్‌జెట్, ఇండిగో మాత్రం బుకింగ్‌కు అవకాశం కల్పించాయి. దీంతో డిమాండ్ ఎక్కువై చార్జీలు కూడా అమాంతం పెరిగిపోయాయి. లాక్‌డౌన్ ముందు విజయవాడ నుంచి హైదరాబాద్‌కు రూ.961 కంటే దిగువకు టికెట్ ధర పడిపోతే ప్రస్తుతం రూ.2,683 నుంచి రూ.3,260వరకు ఉంది. ఇండిగో ఫ్లైట్‌లో ఏకంగా రూ.12,653కు పెరిగింది. విజయవాడ నుంచి బెంగళూరుకు స్పైస్‌జెట్‌లో రూ.3,262 నుంచి రూ.6,199 ధర ఉండగా, ఇండిగో విమానంలో రూ.15,640గా ఉంది. ఇంత రేటు ఉన్నప్పటికీ విమానంలో సీట్లకు వారం పాటు హౌస్‌ఫుల్ డిమాండ్ ఉంది. ఈ పరిస్థితుల్లో లాక్‌డౌన్‌ను పొడిగిస్తారన్న సమాచారంతో విమానయాన సంస్థలు ఆందోళన చెందుతున్నాయి. ప్రస్తుతం లాక్‌డౌన్ కొనసాగిస్తారనే ఆందోళన ఉన్నా, ప్రధాని మోదీ చేయనున్న ప్రసంగంలో మార్గదర్శకాల సడలింపులు ఉంటాయేమోని ఆశగా ఎదురు చూస్తున్నాయి.



పనిచేసిన కాలానికి కూలి డబ్బులు చెల్లించకుంటే లాక్‌డౌన్ సమయంలో బతికేదెలా అంటూ విశాఖపట్నం జిల్లా దేవరాపల్లి మండలం వాలాబులో శనివారం ఉపాధి కూలీలు వినూత్న రీతిలో నిరసన తెలిపారు. నోటికి ఆకులు కట్టుకుని, కంచాలు చేతపట్టి చేపట్టిన నిరసనలో భౌతికదూరం పాటించడం మరచిపోకపోవడం గిరిజనంలో వచ్చిన చైతన్యానికి నిదర్శనం.

- దేవరాపల్లి(విశాఖపట్నం జిల్లా)



చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర రెడ్డి తన నియోజకవర్గ ప్రజలకు 1600 టన్నుల కూరగాయలను శనివారం వితరణ చేశారు. ఇంటికి 10 కిలోల చొప్పున 10 రకాల కూరగాయలను పంపిణీ చేశారు. కూరగాయలను ప్రజల ఇంటివద్దకే పంపిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర రెడ్డి, టీటీడీ బోర్డు సభ్యురాలు ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

- తిరుపతి

# రెడ్ జోన్‌లలో చాలు

- మిగిలిన చోట్ల లాక్‌డౌన్ ఎత్తివేయాలి
- ఆర్థిక వ్యవస్థనూ చూడాలి
- కరోనాపై కేంద్రం చర్యలు భేష్
- రెడ్‌జోన్‌లో 37 మండలాలు
- ప్రధానితో వీడియో కాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి జగన్



కరోనాపై రాష్ట్ర ప్రభుత్వం సిద్ధం చేసిన యాప్‌ను ఆవిష్కరిస్తున్న సీఎం జగన్

"కరోనా వైరస్ విస్తరించకుండా దేవుడి దయతో అడ్డుకోగలుగుతున్నాం. మన కంటికి కనిపించని మహమ్మారి త్వరలోనే పోతుందని నమ్ముతున్నాను. ఈ యుద్ధాన్ని ఎదుర్కొనేందుకు ఒక్కటిగా ఉండాలి. మీ నాయకత్వంపై సంపూర్ణ విశ్వాసం ఉంది. మీరు సూచించే వ్యూహంతో ముందుకు సాగుతాం"

- ప్రధానితో సీఎం జగన్

అమరావతి, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): సంపూర్ణ లాక్‌డౌన్‌ను రెడ్ జోన్‌లకు మాత్రమే పరిమితం చేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రధాని నరేంద్ర మోదీకి సూచించారు. కరోనా నియంత్రణకు సమర్థ నిర్ణయాలు తీసుకుంటున్నారని ప్రశంసించారు. దేశంలో ప్రస్తుతం కరోనా పరిస్థితి, లాక్‌డౌన్ కొనసాగింపుపై ప్రధాని శనివారం అన్ని రాష్ట్రాల సీఎంలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా చర్చించారు. లాక్‌డౌన్‌పై జగన్ తన అభిప్రాయాన్ని వెల్లడించారు. "ప్రధానమంత్రిగా మీరు విశాల దృక్పథంతో తీసుకున్న గట్టి చర్యలను నేను బలంగా సమర్థిస్తున్నాను" అని అన్నారు. అదే సమయంలో... ఆర్థిక వ్యవస్థ వేగవంతంగా ముందుకు కదలాలని అభిప్రాయపడ్డారు. "ప్రజల కనీస అవసరాలకు తగ్గట్టుగానైనా గడవాలన్నదే నా అభిప్రాయం. 1918లో వచ్చిన ఫ్లూ కూడా భారత దేశాన్ని తీవ్రంగా ప్రభావితం చేసింది. దీన్ని మనం పరిగణనలోకి తీసుకుంటే... కరోనాపై దీర్ఘకాలం పోరాటం చేయాల్సి ఉంటుంది" అని సీఎం చెప్పారు. రాష్ట్ర స్థాయిలో తాము తీసుకుంటున్న చర్యలను కూడా వివరించారు. మూడు వారాల లాక్‌డౌన్ మంగళవారం ముగుస్తున్న సంగతి తెలిసిందే. "ఆంధ్రప్రదేశ్‌లో 676 మండలాలు ఉన్నాయి. కరోనా వైరస్ సోకిన 37 మండలాలు రెడ్ జోన్‌లో ఉన్నాయి. ఆరెంజ్ జోన్‌లో 44 ఉన్నాయి. మిగిలిన 595 మండలాలు గ్రీన్ జోన్‌లో ఉన్నాయి. ప్రస్తుతానికి కరోనా ప్రభావం వీటిపై లేదు. లాక్‌డౌన్‌ను రెడ్‌జోన్‌లకే పరిమితం చేయాలన్నది నా అభిప్రాయం. జనం గుమిగూడకుండా మాల్స్, సినిమా హాళ్లు, ప్రార్థనా మందిరాలు, ప్రజా రవాణా, పాఠశాలలపై ఇప్పుడున్న పరిస్థితి కొనసాగాలి" అని ప్రధానికి తెలిపారు. కరోనా నియంత్రణకు ప్రధాని తీసుకుంటున్న చర్యలను దక్షిణాసియాతోపాటు, ప్రపంచ దేశాలు కీర్తిస్తున్నాయన్నారు.

"మీ మార్గదర్శకాల మేరకు రాష్ట్రమంతా లాక్‌డౌన్ అమలు చేస్తున్నాం. 1.40 కోట్ల కుటుంబాలను నిరంతరం పరిశీలిస్తున్నాం. ప్రతి వ్యక్తి ఆరోగ్య సమాచారం సేకరించాం. వారందరి కాంటాక్టుల వివరాలు సేకరించి కరోనా వైరస్ పాజిటివ్ ఉన్నవారందరికీ వైద్య సేవలు అందిస్తున్నాం" అని మోదీకి జగన్ వివరించారు.

### లాక్‌డౌన్‌తో కష్టాలు...

సామాన్యులపై లాక్‌డౌన్ ప్రభావం చాలా ఉందని ముఖ్యమంత్రి చెప్పారు. రాష్ట్రాల మధ్య వ్యవసాయోత్పత్తుల రవాణా నిలిచిపోయిందని తెలిపారు. 25 శాతానికి మించి ట్రక్కులు తిరగడం లేదన్నారు. "రాష్ట్రంలో వ్యవసాయోత్పత్తులను నిల్వ చేసుకునేందుకు సరిపడేంత గోదాములు లేవు. మార్కెట్లు నడపకపోవడంతో ధాన్యం, మొక్కజొన్న, మిర్చి, పొగాకు, అరటి, బొప్పాయి, కూరగాయలను కొనుగోలు చేయాల్సిన అవసరం ఉంది. స్థానికంగా వీటిని ఎంత వరకు వినియోగించగలం? ఇప్పుడున్న పరిస్థితి కొనసాగితే లక్షలాది వ్యవసాయ కుటుంబాలు తీవ్రంగా నష్టపోతాయి. ఆక్వా రంగం కూడా తీవ్రంగా దెబ్బతింటోంది. పారిశ్రామిక రంగం విషయానికి వస్తే... 1,03,986 యూనిట్లకు గాను 7350 మాత్రమే పనిచేస్తున్నాయి. పంపిణీ వ్యవస్థ పూర్తిగా దెబ్బతింది" అని జగన్ వివరించారు. రోడ్డు, రైల్వే రవాణా నిలిచిపోవడం కూడా సంక్షోభం పెరగడానికి ప్రధాన కారణమన్నారు. "పరిశ్రమలు నడవనప్పుడు యాజమాన్యాలు జీతాలు చెల్లించాలని ఎలా ఆశించగలం? రాష్ట్రానికి ఆదాయం రాని పరిస్థితి ఏర్పడింది. వలస కార్మికులు, దినసరి కూలీలు, వ్యవసాయ, ఉద్యానవన, ఆక్వా రైతులు పూర్తిగా దెబ్బతిన్నారు" అని తెలిపారు.

"ప్రపంచ ఆరోగ్య సంస్థ మార్చి 11న కొవిడ్-19 విజృంభణపై హెచ్చరికలు జారీ చేసింది. ఆ సమయానికే రాష్ట్రంలో కరోనా నియంత్రణకు పటిష్ఠ కార్యాచరణతో సిద్ధంగా ఉన్నాం" అని ప్రధానికి జగన్ వివరించారు. ఈ ఏడాది మార్చి 12న రాష్ట్రంలో మొదటి కేసు గుర్తించేనాటికే.. కరోనా వైరస్ నియంత్రణకు సన్నద్ధతతో ఉన్నామన్నారు.

### రాష్ట్రానికి ఇవి ఇవ్వండి...

- ఆర్థికపరమైన ఇబ్బందులను కేంద్రం పరిష్కరించాలి.
- కరోనా వల్ల ఏర్పడే మాంద్యాన్ని తట్టుకునేందుకు ఆర్థిక ప్యాకేజీ ఇవ్వాలి.
- 15వ ఆర్థిక సంఘం సూచనలను పరిగణనలోకి తీసుకుని నిధులు మంజూరు చేయాలి.
- తక్షణమే పది కిలోల బియ్యం, లేదా గోధుమలు, రెండు కిలోల కందిపప్పు, ఒక కిలో వంట నూనె, ఇతర నిత్యావసర సరుకులను నిరుపేద కుటుంబాలకు అందించాలి.
- ప్రతి కుటుంబానికి జాతీయ ఉపాధి హామీ పథకం కింద 21 రోజుల వేతనం అందించాలి. ఉపాధి హామీ పథకం నిధులు రెట్టింపు చేయాలి.
- వైద్య ఆరోగ్య రంగానికి కనీసం 35 శాతం నిధులు కేటాయించాలి.

## దాచాలంటే దాగదులే!

(మొదటి పేజీ తరువాయి)

లెక్కల ప్రకారమే శుక్రవారమే ఏడు జిల్లాల్లో కరోనా పాజిటివ్ కేసులు 20కి మించి నమోదయ్యాయి. శనివారం సాయంత్రానికే ఆ సంఖ్య ఏడుకు చేరింది. చిత్తూరు, విశాఖల్లో సరిగ్గా 20 కేసులు ఉండటంతో 'రెడ్ జోన్'లో పడలేదు. మరొక్క కేసు అదనంగా నమోదైనా అవీ రెడ్‌లో పడేవి. అనంతపురం జిల్లాలో కేసుల సంఖ్య తక్కువే అయినప్పటికీ... ఒక మరణం చోటు చేసుకుంది. విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలు మాత్రం ఒక్క కేసు కూడా నమోదు కాకుండా పూర్తి భద్రంగా ఉన్నాయి. అసలు వాస్తవం ఇది కాగా... ప్రధానికి ఇచ్చిన ప్రజంటేషన్‌లో కేవలం రెండు జిల్లాలను మాత్రమే ఎరుపులో చూపించడం గమనార్హం. ప్రధానికి కరోనా పాజిటివ్ కేసుల లెక్కను వీలైనంత తక్కువ చేసి చూపించాలనే తాపత్రయం అడుగడుగునా కనిపించింది. శనివారం మధ్యాహ్నం వరకు మీడియా బులెటిన్ ఇవ్వకుండా పాత అంకెలతోనే నడిపించారు. ఆ తర్వాత బులెటిన్ విడుదల చేశారు. దీనిప్రకారం చూసినా 7 జిల్లాల్లో 20కిపైగా కరోనా కేసులు నమోదయ్యాయి. చిత్తూరు, విశాఖపట్నంలో సరిగ్గా 20 కేసులు లెక్క తేలాయి. మొత్తం కేసుల సంఖ్య 400 మార్కును దాటింది.

### మండలాల లెక్క దేనికి?

ప్రధానితో వీడియో కాన్ఫరెన్స్ సమయంలో ముఖ్యమంత్రి జగన్ కొత్తగా మండలాల లెక్క బయటికి తీశారు. ఏపీలో 676 మండలాలకుగాను 37 మండలాలు రెడ్ జోన్‌లో ఉన్నాయన్నారు. 44 ఆరెంజ్ జోన్‌లో ఉన్నాయని... 595 మండలాల్లో కరోనా ప్రభావం లేదని తెలిపారు. నిజానికి, కరోనా తీవ్రతను అంచనా వేసేందుకు కేంద్రం జిల్లాను యూనిట్‌గా తీసుకుంది. ఇతర రాష్ట్రాలు కూడా ఇదే సూత్రాన్ని పాటిస్తున్నాయి. మన రాష్ట్రంలోనూ జిల్లాల వారీగానే లెక్కలు విడుదల చేస్తున్నారు. కరోనా పాజిటివ్ కేసు నమోదైన ఇంటి చుట్టూ మూడు కిలోమీటర్ల పరిధిని 'రెడ్‌జోన్'గా పరిగణిస్తున్నారు. ఇలా రాష్ట్రంలో 133 రెడ్‌జోన్లు ఉన్నట్లు ప్రభుత్వం అధికారికంగా ప్రకటించింది. ఇప్పటిదాకా మండలాల వారీగా రెడ్, ఆరెంజ్, గ్రీన్ లెక్కలు చెప్పనే లేదు. "కేవలం 37 మండలాలనే రెడ్ జోన్లుగా గుర్తించి, లాక్‌డౌన్ వాటికి మాత్రమే పరిమితం చేయడం ఆచరణలో సాధ్యం కాదు. మిగిలిన మండలాల్లో ఏం చేద్దామని ప్రభుత్వం భావిస్తోంది? స్థానిక ఎన్నికలను నిర్వహించేందుకే ఈ మండలాల లెక్క తీశారా? అదే నిజమైతే ప్రమాదంతో చెలగాటమాడటమే! కరోనా వ్యాప్తిలో ఆంధ్రప్రదేశ్ 405 కేసులతో దేశంలో 8వ స్థానంలో ఉంది. 13 జిల్లాలున్న రాష్ట్రంలో 8 జిల్లాల్లో 20కి పైగా కేసులు నమోదయ్యాయి. కేసుల సంఖ్య మరింత పెరిగే ప్రమాదం పొంచి ఉంది. ఈ పరిస్థితుల్లో ముప్పును ఎదుర్కొనేందుకు ముందు జాగ్రత్తలు తీసుకోవాలి. అంతేకానీ, ముప్పును తక్కువచేస్తే మొదటికే నష్టం వస్తుంది" అని సీనియర్ అఖిల భారత సర్వీసు అధికారి ఒకరు అభిప్రాయపడ్డారు.



**దాతల స్ఫూర్తితో పది వేల మందికి బియ్యం**

కరోనా విపత్తును ఎదుర్కోవడానికి ప్రధాని, సీఎంల సహాయ నిధులకు భారీగా విరాళాలు అందజేసిన ప్రముఖుల స్ఫూర్తితో చిత్తూరు జిల్లా శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి 10 వేల కుటుంబాలకు శనివారం బియ్యం అందజేశారు. 50 టన్నుల బియ్యాన్ని 30 ట్రాక్టర్లలో భారీ కటౌట్లతో ర్యాలీగా తీసుకువచ్చి శ్రీకాళహస్తి పట్టణంలోని పేదలకు అందజేశారు. - శ్రీకాళహస్తి

## ఎస్ఈసీగా జస్టిస్ కనగరాజ్

(మొదటి పేజీ తరువాయి)

ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. సుమారు అరగంట పాటు వీరిరువురూ చర్చించారు. అనంతరం రాష్ట్ర ఎన్నికల కార్యాలయంలో సిబ్బందితో సమావేశమయ్యారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ గురించి సిబ్బందితో ఆయన సోమవారం చర్చించే అవకాశం ఉంది. మున్సిపల్, పట్టణాభివృద్ధిశాఖ ముఖ్యకార్యదర్శి శ్యామలరావు, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది, కమిషనర్ గిరిజాశంకర్ ఆయనతో భేటీ అయ్యారు. మీడియాతో ముచ్చటించడానికి ఆయన ఆసక్తి చూపలేదు. ఎస్ఈసీగా బాధ్యతలు స్వీకరించిన జస్టిస్ కనగరాజ్‌ను వైసీపీ రాజ్యసభ సభ్యుడు వి.విజయసాయిరెడ్డి దుశ్శాలువ కప్పి సన్మానించారు. నూతన రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌ను పురపాలకశాఖ కమిషనర్ అండ్ డైరెక్టర్ జేఎస్సార్కేఆర్ విజయ్‌కుమార్, డీజీపీ గౌతమ్ సవాంగ్, విజయవాడ సీపీ ద్వారకా తిరుమలరావు మర్యాదపూర్వకంగా కలిశారు.

### 69వేలకు పైగా తీర్పులు

ఎస్ఈసీగా నియమితులైన జస్టిస్ వి.కనగరాజ్‌కు దాదాపు 69వేలకు పైగా తీర్పులిచ్చిన రికార్డు ఉంది. తమిళనాడులోని వేలూరులో జన్మించిన ఆయన 1972లో మద్రాసు న్యాయకళాశాల నుంచి న్యాయశాస్త్రంలో పట్టభద్రులయ్యారు. 1973లో మద్రాసు బార్ కౌన్సిల్‌లో నమోదు చేసుకుని సేలంలో న్యాయవాద వృత్తిని ప్రారంభించారు. సివిల్, క్రిమినల్ కేసుల్లో పటిష్ఠమైన వాదనలతో మంచి లాయర్‌గా పేరొందారు. 1997, ఫిబ్రవరి 24న హైకోర్టు జడ్జిగా పదవీ బాధ్యతలు చేపట్టారు. విద్య, సామాజిక న్యాయం, సామాజిక ఆర్థిక పరిస్థితులపై ప్రభావం చూపే కేసులతో పాటు ప్రత్యేకించి మహిళ, శిశు సంక్షేమం, బలహీనవర్గాలకు సంబంధించిన కేసుల్లో ఆయన వెలువరించిన పలు విప్లవాత్మక తీర్పులు అన్ని వర్గాల ప్రశంసలందుకున్నాయి.

స్థానికం వాయిదా వేశాననే..

# నన్ను టార్గెట్ చేశారు!



- వాయిదా వేయకుంటే కరోనా హాట్‌స్పాట్‌గా రాష్ట్రం
- వైసీపీ నేతలపై వచ్చిన ఫిర్యాదులపై నివేదికలు కోరడమే తప్పా?
- రాజకీయ ప్రయోజనానికే ఆర్డినెన్స్, జీవోలు
- నిష్పాక్షిక విధులే తొలగింపునకు కారణం
- ఆ జీవోలను రద్దు చేయండి
- హైకోర్టును ఆశ్రయించిన నిమ్మగడ్డ రమేశ్

అమరావతి, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): కరోనా వైరస్ వ్యాపించే పెను ముప్పు పొంచి ఉన్నందున స్థానిక ఎన్నికలను ఆరు వారాలపాటు వాయిదా వేస్తూ తాను తీసుకున్న నిర్ణయం కారణంగానే ప్రభుత్వం తనను టార్గెట్ చేసిందని రాష్ట్ర ఎన్నికల మాజీ కమిషనర్(ఎస్ఈసీ) డాక్టర్ నిమ్మగడ్డ రమేశ్ కుమార్ హైకోర్టుకు తెలిపారు. ఎన్నికలు వాయిదా వేయకుంటే రాష్ట్రం కరోనా వైరస్‌కు హాట్‌స్పాట్‌గా మారి ఉండేదని, తద్వారా దారుణ పరిణామాలకు కేంద్ర బిందువయ్యేదని, అయితే అలా వాయిదా వేయడం వల్లనే ప్రభుత్వం తనతో ఘర్షణకు దిగిందని ఆయన వివరించారు. రాజకీయ ప్రయోజనాల కోసమే రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ తీసుకొచ్చిందని, దురుద్దేశంతోనే తనను తొలగించిందని పేర్కొన్నారు. ఈ క్రమంలో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పదవీ కాలాన్ని కుదిస్తూ చట్టవిరుద్ధంగా తీసుకువచ్చిన ఆర్డినెన్స్‌తో పాటు సర్వీసు నిబంధనలను మారుస్తూ జారీ చేసిన జీవోలను రద్దు చేయాలని హైకోర్టును అభ్యర్థించారు. ఈ మేరకు శనివారం సాయంత్రం ఆయన హైకోర్టులో అత్యవసర పిటిషన్ దాఖలు చేశారు. ఎస్ఈసీ పదవీ కాలం కుదించడం, తనను తొలగించడం, కొత్త ఎస్ఈసీ నియామకానికి సంబంధించి రాష్ట్ర పంచాయతీరాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖ జారీ చేసిన 617, 618, 619 జీవోలు చట్ట, రాజ్యాంగ విరుద్ధమని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఆర్డినెన్స్‌ను అత్యవసర సమయాల్లో మాత్రమే జారీ చేయాలని రాజ్యాంగం చెబుతోందని, అలాంటి పరిస్థితి లేకపోయినా ప్రభుత్వం ఆర్డినెన్స్ తీసుకొచ్చిందని వివరించారు. దేశ వ్యాప్తంగా వైద్య పరమైన అత్యవసర స్థితి నెలకొని ఉండగా, తన తొలగింపునకు సంబంధించి హడావుడిగా ఆర్డినెన్స్ తీసుకురావడాన్ని చూస్తే రాష్ట్ర ప్రభుత్వం ఉద్దేశం గ్రహించవచ్చునని కోర్టుకు తెలిపారు. తనను ఎన్నికల కమిషనర్ పదవి నుంచి తప్పించాలన్న లక్ష్యంతో ఆర్డినెన్స్ తీసుకొచ్చారని పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితుల్లోనే ఆర్డినెన్స్ తేవాలని, రాజకీయ ప్రయోజనాల కోసం తీసుకురావడం సరి కాదని కోర్టుకు తెలిపారు. ఆర్డినెన్స్ ఎల్లప్పుడూ న్యాయసమీక్షకు లోబడి ఉంటుందన్నారు. అధికార దుర్వినియోగంతో ఆర్డినెన్స్‌లను జారీ చేస్తున్నప్పుడు కోర్టులు జోక్యం చేసుకోవచ్చని తెలిపారు. కరోనా ప్రభావం ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి అభీష్టానికి విరుద్ధంగా స్థానిక ఎన్నికలను వాయిదా వేయడం వల్లే తనను తొలగించారన్న ఆరోపణలు కూడా ఉన్నాయని పేర్కొన్నారు. కరోనా కారణంగా ప్రజలంతా తమ మనుగడ కోసం అల్లాడుతున్న సమయంలో ప్రభుత్వం తన రాజకీయ ప్రయోజనాలకు ఒడిగట్టిందన్నారు. ఎన్నికల కమిషన్ తొలగింపు ప్రక్రియకు రాజ్యాంగంలో నిర్దేశిత విధానం ఉందని, దాని నుంచి తప్పించుకునేందుకే ప్రభుత్వం ఎస్ఈసీ పదవీ కాలాన్ని కుదిస్తూ నిర్ణయం తీసుకుందని వివరించారు. స్వయం ప్రతిపత్తి కలిగిన సంస్థ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకోలేదని హైకోర్టుకు తెలిపారు. ఎస్ఈసీగా నిష్పాక్షికంగా విధులు నిర్వర్తించడం వల్లనే తనను తొలగించినట్టు స్పష్టమవుతోందని పేర్కొన్నారు.

### అక్రమాలపై నివేదిక కోరడం తప్పా?

అధికార పార్టీ నేతలపై వచ్చిన ఫిర్యాదులపై నివేదికలు కోరడంతో పాటు అక్రమార్కులకు సహకరిస్తున్న అధికారులను బదిలీ చేయాలని ఆదేశించడమే తన తప్పని తన పిటిషన్‌లో రమేశ్‌కుమార్ తెలిపారు. ఎస్ఈసీగా తాను జారీ చేసిన ఆదేశాలను సైతం ప్రభుత్వం అమలు చేయలేదన్నారు. లాక్‌డౌన్ కారణంగా దేశమంతా రవాణా స్తంభించిపోయి ఉండగా, రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లతో చెన్నై నుంచి జస్టిస్ కనగరాజ్‌ను విజయవాడకు తీసుకొచ్చిందని తెలిపారు. అంటే ఈ వ్యవహారం కోర్టుకు రాకముందే ఎస్ఈసీగా జస్టిస్ కనగరాజ్ బాధ్యతలు స్వీకరించేలా ఏర్పాట్లు చేసిందని పేర్కొన్నారు. 243కె(2) ప్రకారం తన పదవీ కాలం తగ్గించడానికి వీలు లేదని, అందువల్ల తాను పూర్తికాలం కొనసాగేలా ఆదేశించాలని కోర్టును కోరారు. పిటిషన్‌లో సాధారణ పరిపాలనా శాఖ ముఖ్య కార్యదర్శి, పంచాయతీరాజ్ ముఖ్యకార్యదర్శి, రాష్ట్ర ఎన్నికల కమిషన్ కార్యదర్శిని ప్రతివాదులుగా పేర్కొన్నారు. అదేవిధంగా ఎస్ఈసీగా నియమితులైన జస్టిస్ వి. కనగరాజ్‌ను కూడా వ్యక్తిగత హోదాలో ప్రతివాదిగా పేర్కొన్నారు.

### సీపీఐ రామకృష్ణ సహా మరొకరి పిల్

ఎస్ఈసీ పదవీ కాలం కుదింపునకు సంబంధించి హైకోర్టులో రెండు ప్రజా ప్రయోజన వ్యాజ్యాలు(పిల్) దాఖలయ్యాయి. ప్రకాశం జిల్లాకు చెందిన న్యాయవాది తాండవ యోగేశ్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ ఈ వ్యాజ్యాలు దాఖలు చేశారు. తాండవ యోగేశ్ దాఖలు చేసిన వ్యాజ్యంలో.. "1994లో పంచాయతీరాజ్ శాఖ జారీ చేసిన జీవో 927 ప్రకారం రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఐదేళ్లపాటు ఆ పదవిలో కొనసాగవచ్చు. ఆ మేరకు 2016 ఏప్రిల్ 1న నియమితులైన రమేశ్ కుమార్ 2021 మార్చి 31 వరకు కొనసాగాల్సి ఉంది. రాజ్యాంగంలోని 243కె అధికరణ మేరకు ఎస్ఈసీని నియమించే అధికారం గవర్నర్‌కు మాత్రమే వుంటుంది. అదేవిధంగా ఒకవేళ కమిషనర్‌ను తొలగించాలంటే హైకోర్టు న్యాయమూర్తిని తొలగించేందుకు అనువైన ప్రక్రియనే అనుసరించాల్సి ఉంటుంది తప్ప మరొకటి లేదు. అయితే, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ రాజ్యాంగ విరుద్ధంగా జీవో 617 జారీ చేసింది. ఆ జీవో ప్రకారం ఎన్నికల కమిషనర్ పదవీ కాలాన్ని మూడేళ్లకు కుదించారు. రాజ్యాంగంలోని 243కె అధికరణ ప్రకారం ఎస్ఈసీ పదవీ కాలం ఐదేళ్లు ఉండగా, ప్రస్తుత జీవో ప్రకారం పదవీకాలం మూడేళ్లకే ముగిసిపోతుంది. ఈ జీవో తీసుకురావడమంటే ఎన్నికల కమిషన్ విధుల్లో జోక్యం చేసుకోవడమే. స్వతంత్ర సంస్థ అయిన ఎస్ఈసీకి ఇది బెదిరింపులాంటిదే. అందువల్ల ప్రభుత్వం చట్ట విరుద్ధంగా జారీ చేసిన జీవోను రద్దు చేయండి. తొలిగా ఆ జీవోను నిలుపుదల చేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయండి" అని అభ్యర్థించారు.

# కరోనా కల్లోలం

## రాష్ట్రాలకు ప్యాకేజీ మాటేమిటి?

» ప్రధానికి ముఖ్యమంత్రుల డిమాండ్ల వర్షం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): కరోనా నియంత్రణకు వనరుల లోటు ఉండరాదని, ఇందుకు కేంద్రం తమకు పెద్ద ఎత్తున నిధులు విడుదల చేయాలని దాదాపు అన్ని రాష్ట్రాలు ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కోరాయి. శనివారం మోదీతో జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో బీజేపీయేతర రాష్ట్రాల సీఎంలు కేంద్ర ప్యాకేజీ కావాలని స్పష్టంగా కోరగా, ఇతర రాష్ట్రాల సీఎంలు కూడా వనరుల కొరతను తీవ్రంగా ఎదుర్కొంటున్న విషయాన్ని ప్రధాని దృష్టికి తీసుకువచ్చారు. తమ రాష్ట్రాల్లో చిక్కుబడిన వలస కూలీలు తమ ప్రాంతాలకు వెళ్లాలనుకుంటున్నారని, వారిని ఎంత కాలం తమ వద్ద ఉంచుకోవాలని పలు రాష్ట్రాలు ప్రశ్నించాయి. మొత్తం దేశానికే జాతీయస్థాయిలో ప్యాకేజీని ప్రకటించాలని, అది జీడీపీలో ఆరు శాతం మేర ఉండాలని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ డిమాండ్ చేశారు. రాష్ట్రాల వద్ద ఉన్న పన్నుల ఆదాయం హరించుకుపోతోందని, తీవ్రమైన వనరుల కొరత ఏర్పడుతోందని ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ తెలిపారు.

## లాక్‌డౌన్ లేకపోతే ఇప్పటికి 8.2 లక్షల కేసులు

» ముందుగానే స్పందించి జాగ్రత్త చర్యలు

» దేశవ్యాప్తంగా 586 కొవిడ్ ఆస్పత్రులు

» బహిరంగ ప్రదేశాల్లో ఉమ్మివేయడంపై నిషేధం విధించాలని అన్ని రాష్ట్రాలకు లేఖ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 11: కరోనా నియంత్రణకు భారత ప్రభుత్వం లాక్‌డౌన్, ఇంతర ముందస్తు చర్యలు తీసుకోవడం వల్లనే భారీ సంఖ్యలో కేసులు పెరగకుండా నిరోధించగలిగామని కేంద్ర ఆరోగ్య శాఖ తెలిపింది. లేకపోతే ఈ నెల 15 నాటికి 8.2 లక్షల కేసులు నమోదయ్యేవని ఆరోగ్యశాఖ సంయుక్త కార్యదర్శి లవ్ అగర్వాల్ చెప్పారు. కట్టుదిట్టమైన నియంత్రణ చర్యలతో కేసులను చాలా తగ్గించగలిగామన్నారు. ఇప్పటి వరకు కొవిడ్ చికిత్స కోసం ప్రత్యేకంగా 586 ఆస్పత్రులను ఏర్పాటు చేశామన్నారు. వీటిలో లక్ష వరకు ఐసోలేషన్ బెడ్లు అందుబాటులో ఉన్నాయని, వాటిలో 11,500 ఐసీయూ బెడ్లు ఉన్నాయన్నారు. ఇప్పటివరకు 1.7 లక్షల నమూనాలను పరీక్షించామని, శుక్రవారం 16,564 నమూనాలను పరీక్షించామని భారత వైద్య పరిశోధన మండలి(ఐసీఎంఆర్) తెలిపింది. దేశవ్యాప్తంగా ఐసీఎంఆర్ పరిధిలో 167 కేంద్రాలు, ప్రైవేటుగా 67 కేంద్రాల్లో కరోనా పరీక్షలు నిర్వహిస్తున్నారు. కాగా, పొగాకు నమలడం, బహిరంగ ప్రదేశాల్లో ఉమ్మివేయడాన్ని నిషేధించాలని కేంద్ర ఆరోగ్య శాఖ అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలను కోరింది. ఈ మేరకు అన్ని రాష్ట్రాల సీఎస్‌లకు లేఖ రాసింది. “పొగాకు, పాన్ మసాలా, సుపారీ నమలడం వల్ల ఉమ్మి ఎక్కువగా వస్తుంది. దీంతో బహిరంగ ప్రదేశాల్లో ఉమ్మేస్తున్నారు. ఇది వైరస్ వ్యాప్తిని ఎక్కువ చేయవచ్చు” అని పేర్కొంది. ఇప్పటికే తెలంగాణ సహా పలు రాష్ట్రాలు పొగాకు ఉత్పత్తులపై, బహిరంగ ప్రదేశాల్లో ఉమ్మివేయడంపై నిషేధం విధించాయి.



సీఎంలతో ప్రధాని వీడియో కాన్ఫరెన్స్

# మరో 2 వారాలు

(మొదటి పేజీ తరువాయి)

లాక్‌డౌన్‌ను కొనసాగించాలని వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు ప్రధాని నరేంద్ర మోదీకి విన్నవించారు. లాక్‌డౌన్ ఎత్తివేతకు సంబంధించి మోదీ శనివారం 13 రాష్ట్రాల సీఎంలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. 4 గంటలకు పైగా జరిగిన ఈ చర్చలో దాదాపు అందరూ పొడిగింపు వైపే మొగ్గుచూపారని, దీనిని పరిశీలిస్తున్నామని ఆయన చెప్పారు. “ప్రస్తుతం మనం తీసుకుంటున్న చర్యల ప్రభావం ఎంతమేర ఉంటుందన్నది వచ్చే మూడు-నాలుగు వారాల్లో తెలుస్తుంది. ఈ నాలుగు వారాలూ నిరంతర నిఘా, అప్రమత్తత అవసరం” అన్నారాయన. షెడ్యూల్ ప్రకారం మోదీ శనివారంరాత్రే దేశప్రజలను ఉద్దేశించి ప్రసంగించాల్సి ఉంది. అయితే ఆయన ఆది లేదా సోమవారాల్లో ఈ ప్రసంగం చేస్తారని, ఎత్తివేత విషయం చెబుతారని అధికార వర్గాలు తెలిపాయి. దాదాపు అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులు లాక్‌డౌన్‌ను పొడిగించాలని అభిప్రాయపడగా, ఆంధ్రప్రదేశ్ సీఎం వైఎస్ జగన్ లాక్‌డౌన్‌ను పాక్షికంగా ఎత్తివేయాలని సూచించడం గమనార్హం.

### జాన్ భీ.. జహాన్ భీ.!

“జాన్ హై తో జహాన్ హై(మనం బతికుంటేనే ప్రపంచం ఉంటుంది) అని గతంలో లాక్‌డౌన్ విధించినపుడు నేను అన్నాను. ప్రజలు దానిని అర్థం చేసుకున్నారు. ఇపుడు జాన్ భీ, జహాన్ భీ(మనమూ ఉండాలి.. ప్రపంచమూ ఉండాలి) అని అంటున్నా. అంటే ప్రాణంతో పాటు జీవనమూ (ఆర్థిక కార్యకలాపాలూ) ముఖ్యమే..” అని మోదీ పేర్కొన్నారు. దీని అర్థం లాక్‌డౌన్ పొడిగించినా కొన్ని ప్రాంతాల్లో, రంగాల్లో సడలింపులు ఉంటాయని తెలుస్తోంది. దీనిపై కేంద్ర హోంశాఖ ఇప్పటికే వివిధ ప్రభుత్వాల అభిప్రాయాలు తీసుకుంది. ఏయే రంగాలకు మినహాయింపులివ్వాలన్నది పరిశీలిస్తున్నట్లు సమాచారం. “పారిశ్రామిక, నిర్మాణరంగాలకు దశలవారీగా ఎత్తివేత అమలు చేస్తాం. వ్యవసాయదారులకు ఆర్థిక ప్యాకేజీ అందజేస్తాం. ఒకవేళ మార్కెట్లను షట్‌డౌన్ చేసినా రైతులు వ్యవసాయ క్షేత్రాల నుంచే అమ్మకాలు జరపొచ్చు” అని ప్రధాని పేర్కొన్నారు. కొన్ని ఈశాన్య రాష్ట్రాలు, జమ్మూ కశ్మీర్లలో వైద్యులు, మెడికల్ సిబ్బందిపై దాడులు జరగడాన్ని ఆయన ఖండించారు. వారికి భద్రత కల్పించాలన్నారు. ఇప్పటికిప్పుడు లాక్‌డౌన్‌ను ఎత్తేసినా, పూర్తిగా సడలించినా తమకు ఇబ్బందేనని, ఎత్తేస్తే రోగుల సంఖ్య ఊహించనంతగా పెరిగిపోతుందని ముఖ్యమంత్రులు ప్రధానికి చెప్పారు. వేల సంఖ్యలో రోగులు వస్తే తాము తట్టుకోలేమని వారు అన్నట్లు తెలిసింది. “ఈ పొడిగింపు తొలిసారి ప్రకటించిన లాక్‌డౌన్ మాదిరి ఉండదు. చాలా వెసులుబాట్లు ఉంటాయి” అని కర్ణాటక సీఎం యడ్యూరప్ప వెల్లడించారు.

### లాక్‌డౌన్‌ను నీరుగారుస్తున్నారు: బెంగాల్‌పై కేంద్రం ఆక్షేపణ

లాక్‌డౌన్‌ను పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం కఠినంగా అమలు చేయడం లేదని కేంద్రం తప్పుబట్టింది. “దుకాణాలను తెరుస్తున్నారు. భౌతిక దూరం పాటించడం లేదు. కూరగాయలు, చేపలు, మటన్ మార్కెట్లలో జనం ఎగబడుతున్నారు. సామూహిక సమావేశాలు, మతపరమైన కార్యకలాపాలకు అనుమతిస్తున్నారు” అని కేంద్ర హోంశాఖ విమర్శించింది.

### కాటన్ మాస్క్ ధరించిన మోదీ

సీఎంలతో వీసీ సమయంలో ప్రధాని మోదీ కాటన్‌తో చేసిన మాస్క్‌ను ధరించారు. ఇంట్లో ఉన్న వస్త్రాలనే మాస్క్‌లుగా మార్చుకోవాలని గత వారం కేంద్రం సూచించడంతో ఆయన ఈ కాటన్ వస్త్రాన్ని మాస్క్ గా ధరించి సమావేశంలో పాల్గొన్నారు. దాదాపు ముఖ్యమంత్రులందరూ కూడా ఇదే రీతిన కాటన్ మాస్కులు పెట్టుకోవడం విశేషం. సంభాషణ జరిపిన నాలుగు గంటల పాటు ఆయన మాస్క్ పెట్టుకునే ఉన్నారు.

### లిక్కర్‌కు ఓకే..!

లాక్‌డౌన్‌ను పొడిగించాలని సూత్రప్రాయంగా నిర్ణయించిన కేంద్రం.. నగరాలు, పట్టణాల్లో రోగుల సంఖ్యను బట్టి జోన్లుగా విభజించాలని యోచిస్తోంది. సీఎంలతో వీడియో కాన్ఫరెన్స్‌లో ఈ ప్రస్తావన తేకపోయినప్పటికీ.. ఈ దిశగా కసరత్తు సాగుతున్నట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. రోగుల సంఖ్య ఎక్కువగా ఉంటే రెడ్‌జోన్‌గా ప్రకటిస్తారు. ఇది పూర్తి లాక్‌డౌన్‌లో ఉంటుంది. కాస్త తక్కువ కేసులుంటే ఆరెంజ్ జోన్‌గా ప్రకటిస్తారు. ఇక్కడ పరిమిత సంఖ్యలో ప్రజలకు, దుకాణాలకు అనుమతులుంటాయి. రోగుల్లేని చోట్ల గ్రీన్‌జోన్ ప్రకటిస్తారు. ఇక్కడ యథావిధిగా కార్యకలాపాలుంటాయి. అయితే నిర్దిష్ట వేళల్లో మాత్రమే! మద్యం దుకాణాలను అనుమతించే విషయాన్ని కూడా కేంద్రం చురుగ్గా పరిశీలిస్తోంది. ఇదే విషయాన్ని రాష్ట్రాల సీఎంలు కోరగా.. ప్రధాని వెంటనే ఏ నిర్ణయమూ ప్రకటించలేదు.

## ఎవరేమన్నారు?

లాక్‌డౌన్‌ను పొడిగించడం సరైన చర్య. చాలా దేశాల కంటే మనం ఇపుడు మెరుగైన స్థితిలో ఉన్నాం. కారణం... ముందస్తుగా లాక్‌డౌన్ ప్రకటించడం!

- కేజ్రీవాల్, ఢిల్లీ సీఎం

లాక్‌డౌన్‌ను మేం ఇప్పటికే 30వ తేదీ దాకా పొడిగించాం. పెద్దగా ప్రభావం లేని ప్రాంతాల్లో కాస్తంత సడలిస్తాం. మిగిలిన చోట్ల మరింత కఠినం చేస్తాం. 30 తరువాత పొడిగించేదీ లేనిదీ అప్పటి పరిస్థితి బట్టి నిర్ణయిస్తాం..

- ఉద్ధవ్ ఠాక్రే, మహారాష్ట్ర సీఎం

లాక్‌డౌన్ మరో 15 రోజులుంటుంది. దశలవారీగా సడలింపులు చేస్తాం. ముఖ్యంగా వ్యవసాయ రంగానికి వెసులుబాటు ఇవ్వాలని కోరాం

- యడ్యూరప్ప, కర్ణాటక సీఎం

అందరికంటే ముందు మేమే లాక్‌డౌన్‌ను 30 దాకా పొడిగించాం. ప్రాణాలు ముఖ్యమా, ఆర్థిక కార్యకలాపాలు ముఖ్యమా అన్నది సంక్లిష్ట నిర్ణయం

- నవీన్ పట్నాయక్, ఒడిసా సీఎం

ఇది పంట కోతల సమయం. వ్యవసాయ పనులు ముమ్మరంగా ఉంటాయి. రైతులు, కూలీలు పొలాల్లో, మండీల్లో పోటెత్తుతారు. అందుచేతే లాక్‌డౌన్‌ను 30 దాకా పొడిగించాం.

- అమరీందర్ సింగ్, పంజాబ్ సీఎం

ఆర్థిక కార్యకలాపాలను అంతర్గతంగా పరిమితం చేసుకోవడానికి రాష్ట్రాలకు అనుమతివ్వాలి. రాష్ట్రాల మధ్య రాకపోకలకు అనుమతివ్వాలి

- భూపేశ్ బాఘేల్, ఛత్తీస్‌గఢ్ సీఎం

లాక్‌డౌన్ పొడిగించాల్సిందే. సరిహద్దుల్లో మరింత నిఘా అవసరం. ఎవరూ దేశంలోకి జొరబడకుండా చూడాలి

- మమతా బెనర్జీ, పశ్చిమ బెంగాల్ సీఎం

మాకు తగినన్ని మౌలిక సదుపాయాలున్నాయి. ఇబ్బంది లేదు. లాక్‌డౌన్ పొడిగించండి

- శివరాజ్‌సింగ్ చౌహాన్, మధ్యప్రదేశ్ సీఎం

కొవిడ్ నియంత్రణకు అనేక చర్యలు తీసుకుంటున్నాం. కొందరు గవర్నర్లు, లెఫ్టినెంట్ గవర్నర్లు జోక్యం చేసుకుంటున్నారు. దీన్ని నివారించాలి

- వి నారాయణస్వామి, పాండిచ్చేరి సీఎం

## ఒకే కుటుంబంలో 11 మందికి

(మొదటి పేజీ తరువాయి)

నమోదైన వాటితో కలిపి ఈ జిల్లాలో మొత్తం కేసుల సంఖ్య 75కు పెరిగింది. వీరిలో ఇప్పటికే ఒకరు మరణించిన విషయం తెలిసిందే. దాచేపల్లికి చెందిన వ్యక్తి జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ శనివారం మరణించాడు. వైద్యపరీక్షల్లో ఆయనకు పాజిటివ్‌గా తేలినట్లు సమాచారం. అయితే ఈ విషయాన్ని ఇంకా అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. కర్నూలు జిల్లాలో మరో ఐదు పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. వీరంతా ఢిల్లీ వెళ్లి వచ్చినవారితో సంబంధం ఉన్నవారే. దీంతో ఈ జిల్లాలో కేసుల సంఖ్య 82కు చేరుకుంది. కడప జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన వ్యక్తి(40)కి పాజిటివ్ నిర్ధారణ అయింది. ఢిల్లీ కనెక్షన్‌తో కరోనా సోకిన వ్యక్తి ఇంటికి ఇతని ఇల్లు 400మీటర్ల దూరంలోనే ఉండటంతో ఈయనకూ వైరస్ సోకిందని భావిస్తున్నారు. ప్రకాశం జిల్లా ఒంగోలులోనూ మరో పాజిటివ్ కేసు నమోదైంది. కాగా, గుడ్లూరు మండలం అడవిరాజుపాలెం వాసి(22) కరోనా లక్షణాలతో రిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతిచెందాడు. అతను మూడురోజుల నుంచి అనారోగ్యంతో బాధపడుతున్నాడు. స్థానిక వైద్యుల వద్ద చూపించుకున్నా పరిస్థితి విషమించటంతో శుక్రవారం రిమ్స్‌కు తరలించగా, ఐసీయూలో ఉంచి చికిత్స అందిస్తున్నారు. నెమ్ము లక్షణాలతో బాధపడుతున్న ఆ యువకుడు శనివారం సాయంత్రం మరణించినట్లు వైద్యులు తెలిపారు. ఇతని నమూనాలను పరీక్షల కోసం పంపించారు. ఫలితాలు రావాల్సి ఉంది.

జిల్లాల వారీగా కేసుల వివరాలు...

| జిల్లా | పాజిటివ్ | డిశ్చార్జి |
|---|---|---|
| అనంతపురం | 15 | - |
| చిత్తూరు | 20 | 1 |
| తూర్పుగోదావరి | 17 | 1 |
| గుంటూరు | 75 | 1 |
| కడప | 30 | - |
| కృష్ణా | 35 | 3 |
| కర్నూలు | 82 | - |
| నెల్లూరు | 48 | 1 |
| ప్రకాశం | 41 | 1 |
| విశాఖపట్నం | 20 | 4 |
| పశ్చిమగోదావరి | 22 | - |
| మొత్తం | 405 | 12 |

### గుంటూరులో ఒకరు డిశ్చార్జ్

గుంటూరు జిల్లాలో కరోనా బారిన పడిన మొదటి వ్యక్తి ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యారు. ఓ ప్రజాప్రతినిధి బంధువు కూడా అయిన ఆయన ఢిల్లీ వెళ్లి వచ్చిన తర్వాత గత నెల 23న కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. అప్పటినుంచి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆరోగ్యం పూర్తిగా కుదుటపడటంతో వైద్యాధికారులు ఆయన్ను శనివారం డిశ్చార్జి చేశారు.

### » 11 రోజుల్లోనే 361 పాజిటివ్ కేసులు

అమరావతి, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కరోనా కేసుల సంఖ్య 400 దాటేసింది. 11 రోజుల వ్యవధిలోనే 361 పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. గతనెల 13న నెల్లూరు జిల్లాలో తొలి కేసు నమోదైంది. నెల తిరక్కముందే ఈ సంఖ్య 405కు చేరడంపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. మార్చి 31వరకూ పరిస్థితి అదుపులోనే ఉన్నా ఏప్రిల్ 1నుంచి రోజూ సగటున 30కి పైగా కేసులు నమోదవుతున్నాయి. 1న అత్యధికంగా 67 నమోదు కాగా 5న 60 పాజిటివ్‌లు వెలుగు చూశాయి. గత నెలాఖరు వరకూ రాష్ట్రంలో 44 కేసులు మాత్రమే ఉన్నాయి. కానీ, ఏప్రిల్ 1నాటికి వీటి సంఖ్య 111కు చేరింది. తొలి 100 కేసులు నమోదు కావడానికి 19 రోజులు పట్టింది. తర్వాత వంద కేసులు కేవలం 4 రోజుల వ్యవధిలోనే నమోదయ్యాయి. ఏప్రిల్ 4న 192 పాజిటివ్‌లు ఉండగా, 5నాటికి ఆ సంఖ్య 252కు చేరింది. ఆ తర్వాత రోజుకే వీటి సంఖ్య 303కు చేరింది. అప్పుడే పరిస్థితి చేయి దాటిపోతోందన్న అనుమానాలు వ్యక్తమయ్యాయి. ప్రస్తుతం అత్యధికంగా కర్నూలు జిల్లాలో 82, గుంటూరు జిల్లాలో 75 కరోనా కేసులున్నాయి. ఈ రెండు జిల్లాల్లోనూ కేసుల సంఖ్య 100 దాటుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఒకవైపు రాష్ట్రంలో కేసుల సంఖ్య పెరుగుతుంటే, అధికారుల నిర్లక్ష్య ధోరణితో కరోనా నియంత్రణ కష్టసాధ్యంగా మారింది. మరికొన్ని రోజులు ఇదే పరిస్థితి ఉంటే కరోనా తీవ్రత పెరిగే ప్రమాదం ఉందనే ఆందోళన వ్యక్తమవుతోంది.

### » ఇప్పట్లో శ్రీవారి దర్శనం లేనట్టే!

తిరుమల, ఏప్రిల్ 11: కరోనా ప్రభావంతో మరికొన్ని రోజులపాటు తిరుమల శ్రీవారి దర్శనానికి భక్తులు దూరం కానున్నట్టు సమాచారం. లాక్‌డౌన్‌ను పొడిగించాలనే అభిప్రాయాలు వెలువడుతున్నాయి. ఈ నేపథ్యంలో భక్తులకు దర్శనం రద్దు నిర్ణయాన్ని కొనసాగించనున్నట్టు తెలుస్తోంది.

## ఆ వైద్యుడు.. ఓ శిశువుకు దేవుడు!



ముంబై, ఏప్రిల్ 11: అమ్మ జన్మనిస్తే.. వైద్యుడు పునర్జన్మనిస్తాడన్న నానుడిని నిజం చేశాడో వైద్యుడు. పుట్టిన గంటల్లోపే అత్యవసర చికిత్స అవసరమైన ఓ బిడ్డను తన బైక్‌పై ఆసుపత్రికి తీసుకెళ్లి ఆ తల్లిదండ్రులకు పుత్రశోకాన్ని తప్పించాడు. వైద్యులపై గౌరవాన్ని మరింతగా పెంచిన ఈ ఘటన శనివారం ముంబైలో జరిగింది. అలీబాగ్ ప్రాంతానికి చెందిన శ్వేతాపాటిల్‌కు పురిటినొప్పులు రావడంతో ఆమె భర్త దగ్గర్లోని ఆసుపత్రిలో చేర్పించాడు. అక్కడ ఆమె ఓ మగబిడ్డకు జన్మనిచ్చింది. పుట్టిన వెంటనే ఆ బాబు తీవ్రమైన శ్వాసకోశ సమస్యను ఎదుర్కొన్నాడు. దీంతో అతడిని వెంటనే చిన్నపిల్లల ఆస్పత్రికి తీసుకెళ్లాల్సిందిగా డాక్టర్ రాజేంద్ర చందోర్కర్ సూచించాడు. అక్కడికి 1.5 కిలోమీటర్ల దూరంలో చిన్నపిల్లల ఆస్పత్రి ఉంది. కానీ లాక్‌డౌన్‌తో అక్కడి దాకా వెళ్లడానికి వీరికి రవాణా సదుపాయమూ లేదు. ఏం చేయాలో పాలుపోని స్థితిలో ఉన్న ఆ తల్లిదండ్రులకు అడక్కుండానే సాయం చేశాడా డాక్టర్. ఆ బాబుని తన బైక్‌పై ఆస్పత్రికి తీసుకెళ్లాడు. సమయానికి చికిత్స అందడంతో బాబు కోలుకున్నాడు.

## కరోనాకు విరుగుడు ప్లాస్మా చికిత్స!



» ఇన్ఫెక్షన్ వచ్చి కోలుకున్న వారి రోగ నిరోధక కణాలతో వైద్యం

» ‘ఆంధ్రజ్యోతి’ ఇంటర్వ్యూలో డా. ఆశాకిశోర్

కరోనాకు వ్యాక్సిన్ అందుబాటులోకి రావడానికి కనీసం ఆరు నెలలు పట్టొచ్చని అంచనాలు వెలువడుతున్నాయి. ఈలోగా ఇన్ఫెక్షన్ సోకిన వారిని రక్షించడానికి అందుబాటులో ఉన్న మార్గాలను వినియోగంలోకి తెచ్చేందుకు వైద్య నిపుణులు నానా ప్రయత్నాలు చేస్తున్నారు. ఈకోవలోకే వస్తుంది ‘ప్లాస్మా థెరపీ’. ఈ చికిత్సను అందించడానికి కేరళకు చెందిన శ్రీచిత్ర తిరుమాళ్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ మెడికల్ సైన్సెస్ అండ్ టెక్నాలజీ(ఎస్‌సీటీఐఎంఎస్‌టీ)కి భారత వైద్య పరిశోధనా మండలి(ఐసీఎంఆర్) నుంచి అనుమతి లభించింది. ఇక డ్రగ్ కంట్రోలర్ జనరల్ ఆఫ్ ఇండియా (డీసీజీఐ) అనుమతుల కోసం దరఖాస్తు చేశామని.. అవి రాగానే తమ ప్రయోగాలు ప్రారంభిస్తామని ఎస్‌సీటీఐఎంఎస్‌టీ డైరెక్టర్ డాక్టర్ ఆశాకిశోర్ తెలిపారు. ‘ఆంధ్రజ్యోతి’కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ‘ప్లాస్మా థెరపీ’కి సంబంధించి కీలక వివరాలు వెల్లడించారు. - స్పెషల్ డెస్క్

### ప్లాస్మా థెరపీ ప్రత్యేకత ఏమిటి?

మన శరీరంలోకి వైరస్ లేదా బ్యాక్టీరియా ప్రవేశించిన వెంటనే రోగనిరోధక వ్యవస్థ అప్రమత్తమవుతుంది. తెల్ల రక్త కణాలు ఆ వైరస్ లేదా బ్యాక్టీరియాను వెంటాడి.. వేటాడి చంపేస్తాయి. దీంతో మనకు వచ్చిన ఇన్ఫెక్షన్ తగ్గిపోతుంది. కరోనాలాంటి వైరస్‌లను మన రోగనిరోధక వ్యవస్థ అడ్డుకోలేదు. ఇలాంటి సమయాల్లో కరోనా వచ్చి తగ్గిన రోగుల నుంచి రోగనిరోధక కణాలను సేకరించి ప్రస్తుతం ఇన్ఫెక్షన్‌తో బాధపడుతున్న వారి శరీరంలోకి చొప్పిస్తే.. వైరస్‌ను సమర్థంగా ఎదుర్కోవచ్చు. ఈ వైద్య విధానాన్నే ప్లాస్మా థెరపీ అంటారు.

### ప్లాస్మా థెరపీ అందించేందుకు మీరు సిద్ధమా?

ఆ చికిత్స అందించగలం. ఇందుకోసం ఇప్పటికే ఐసీఎంఆర్ నుంచి అనుమతి వచ్చింది. డ్రగ్ కంట్రోలర్ అథారిటీ నుంచి మరికొన్ని అనుమతులు రావాల్సి ఉంది.

### రోగ నిరోధక కణాల సేకరణ ఎలా?

కరోనా వైరస్ సోకి.. దానిని తట్టుకొని ఆరోగ్యవంతులైన వ్యక్తుల నుంచి రక్తాన్ని సేకరిస్తాం. ఈ రక్తంలోని సీరంను వేరుచేసి దానిలోని రోగనిరోధక కణాలను బయటకు తీస్తాం. అయితే ఎవరి నుంచి పడితే వారి నుంచి రక్తాన్ని సేకరించకూడదు. కరోనా నుంచి కోలుకొని నెగెటివ్ వచ్చిన 28 రోజుల తర్వాత కూడా.. ఇన్ఫెక్షన్ లక్షణాలు లేని, ఇతర ఆరోగ్య సమస్యలు లేని వ్యక్తిని ఎంపిక చేసుకుంటాం. అలాంటి వాళ్ల నుంచే రోగ నిరోధక కణాలను సేకరించి రోగి శరీరంలోకి ప్రవేశపెడతాం. ఇలా ప్రవేశపెట్టిన కణాలు రోగి రక్తంలోకి ప్రవేశించి, 3, 4 రోజుల్లోనే రోగనిరోధక వ్యవస్థను బలోపేతం చేస్తాయి.

### అందరికీ ఈ చికిత్స అందిస్తారా?

ప్రస్తుతానికి కరోనా ఇన్ఫెక్షన్‌కు గురైన వాళ్లకే ఈ చికిత్సను అందిస్తాం. ఇవి కేవలం క్లినికల్ ట్రయల్స్ మాత్రమే! అందరికీ ఈ చికిత్సను అందించలేం.

### ప్లాస్మా థెరపీతో సత్ఫలితాలు ఉంటాయా?

ప్లాస్మా థెరపీతో మంచి ఫలితాలు వస్తాయని గతానుభవాలు చెబుతున్నాయి. 2018లో ఎబోలా వైరస్ వ్యాప్తి చెందినపుడు ఈ పద్ధతి మంచి ఫలితాలను ఇచ్చింది.

### వ్యాక్సినేషన్‌తో పోలిస్తే తేడా ఏమిటి?

వ్యాక్సిన్ వేసినపుడు మన శరీరం రోగనిరోధక కణాలను ఉత్పత్తి చేస్తుంది. ఇన్ఫెక్షన్ సోకినపుడు రోగనిరోధక వ్యవస్థ సంబంధిత కణాలను విడుదల చేసి, ఆ వైరస్‌ను చంపేస్తుంది. ప్లాస్మా థెరపీలో రోగనిరోధక కణాలు రక్తంలో ఉన్నంత కాలమే రక్షణ ఉంటుంది. ఆపై రోగి శరీరమే ఈ కణాలను ఉత్పత్తి చేసుకోవాల్సి ఉంటుంది.

### ఈ థెరపీ నేపథ్యం చెప్పండి..

ఈ చికిత్సా పద్ధతిని 1890లో జర్మన్ శాస్త్రవేత్త ఇమిల్ వాన్ బెహ్రింగ్ అభివృద్ధిచేశారు. ఇందుకుగానూ ఆయనకు 1901లో నోబెల్ బహుమతి లభించింది. వైద్య రంగంలో తొలి నోబెల్ దక్కింది ఆయనకే.

## కొత్తగా 768 మందికి పాజిటివ్

### 36 మంది మృతి

» దేశంలో కేసులు 7529.. మరణాలు 242

» వైద్యులకు భద్రత కల్పించాలి: హోం శాఖ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 11: దేశవ్యాప్తంగా కరోనా ఉధృతి కొనసాగుతూనే ఉంది. కొత్తగా 768 కరోనా కేసులు నమోదయ్యాయి. 36 మంది చనిపోయారు. దీంతో మొత్తం కేసుల సంఖ్య 7,529కి పెరిగింది. మరణాల సంఖ్య 242కు చేరింది. ఇప్పటివరకు మొత్తం 642 మంది కరోనా నుంచి కోలుకున్నారు. శనివారం నమోదైన కేసుల్లో మహారాష్ట్ర నుంచే 187 ఉన్నాయి. దీంతో మహారాష్ట్రలో మొత్తం కరోనా సోకిన వారి సంఖ్య 1761కి పెరిగింది. ఇక్కడ కరోనాతో శనివారం ఒక్కరోజే 17 మంది చనిపోయారు. ఢిల్లీలో శనివారం 166 కేసులు నమోదయ్యాయి. మొత్తం కేసుల సంఖ్య 1069కి పెరిగింది. సెంట్రల్ ఢిల్లీలోని చాందినీ మహల్ ప్రాంతంలో 102 మందికి కరోనా పరీక్షలు నిర్వహించగా అందులో 52 మందికి పాజిటివ్ అని తేలింది. వీరంతా ఆ ప్రాంతంలో ఉన్న 13 మసీదుల్లో నివాసం ఉంటున్నారు. ఇందులో విదేశీయులు కూడా ఉన్నారు. వీరిలో చాలా మంది ఇటీవల మర్కజ్‌కు వెళ్లివచ్చినట్లు అధికారులు భావిస్తున్నారు. మసీదుల్లో ఉన్న 102 మందిని అదుపులోకి తీసుకొని పరీక్షలు నిర్వహించారు. రాజస్థాన్‌లో శనివారం కొత్తగా 117 కేసులు నమోదు కాగా మొత్తం కరోనా కేసుల సంఖ్య 678కి పెరిగింది. బికనేర్‌లో ఒకే ఇంటిలో నలుగురికి కరోనా పాజిటివ్ వచ్చింది. ఆ ఇంట్లో ఇప్పటికే ఓ వృద్ధురాలు కొవిడ్‌తో చనిపోయింది. యూపీలో మేరట్‌లోని జలీ కోఠీ ప్రాంతంలో కొవిడ్ బాధితున్ని చికిత్స కోసం తీసుకెళ్లడానికి వచ్చిన అధికారులపై దాడి జరిగింది. ఈ ఘటనలో పోలీసులు నలుగురిని అరెస్టు చేశారు. మధ్యప్రదేశ్‌లో ఇండోర్ కరోనాకు హాట్‌స్పాట్‌గా మారింది. రాష్ట్రంలో నమోదైన మొత్తం 451 కేసుల్లో సగానికిపైగా అక్కడే నమోదయ్యాయి. రాష్ట్రంలో సంభవించిన మొత్తం 36 కరోనా మరణాల్లో 27 ఇండోర్ నుంచే నమోదయ్యాయి. కేరళలో కొవిడ్ చికిత్స పొందుతున్న ఓ మహిళ బిడ్డకు జన్మనిచ్చింది. బిడ్డకు కూడా వైరస్ సోకిందా.. లేదా.. అన్న విషయాన్ని నిర్ధరించుకోవడం కోసం నమూనాలను పరీక్ష కోసం పంపారు. కాగా, కొవిడ్ ఆస్పత్రుల్లో, క్వారంటైన్ సెంటర్లలో సేవలందిస్తున్న వైద్యులకు, సిబ్బందికి తగిన పోలీసు భద్రత కల్పించాలని కేంద్ర హోం శాఖ ఆదేశించింది.



ఢిల్లీలో కరోనా హాట్‌స్పాట్ జాకిర్ నగర్‌లో వైరస్ నిరోధక ద్రవ్యం స్ప్రే

### ఇంట్లో పెట్టి తాళం వేశారు

ఆ ఊళ్లో చాలా మంది లాక్‌డౌన్ నిబంధనలు పాటించడం లేదు. అవసరం లేకున్నా రోడ్లపైకి వస్తున్నారు. అధికారులు ఎంత చెప్పినా అర్థం చేసుకోలేదు. దీంతో విసుగెత్తిపోయిన అధికారులు ఎవరిళ్లలో వారిని తోలి బయటి నుంచి తాళం వేశారు. ఈ ఘటన మధ్యప్రదేశ్‌లోని ఛతార్‌పూర్ జిల్లా రాజ్‌నగర్‌లో జరిగింది. అందరూ లాక్‌డౌన్ రూల్స్ పాటిస్తామని చెప్పడంతో అధికారులు తాళాలు తీశారు. ఇంకా 50 ఇళ్లకు తాళాలు అలాగే ఉన్నాయి. వారంతా క్వారంటైన్‌లో ఉండాల్సిన వాళ్లని, ఆ గడువు ముగిసిన తర్వాత తాళాలు తీస్తామని చెప్పారు.

### ముగ్గురి ఆత్మహత్య

కరోనా భయంతో మహారాష్ట్రలో ఇద్దరు, తమిళనాడులో ఒకరు ఆత్మహత్య చేసుకున్నారు. ఇక, కర్ణాటకలోని హుబ్బళ్లిలోని ముల్లా ప్రాంతానికి చెందిన కరోనా సోకిన వ్యక్తితో కమరిపేట పోలీసుస్టేషన్‌కు చెందిన ఐదుగురు కానిస్టేబుళ్లు సన్నిహితంగా మెలిగినట్టు ప్రాథమికంగా నిర్ధారణ అయింది.

## తెలంగాణలో మరో ఇద్దరు మృతి

హైదరాబాద్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో కరోనాతో ఇద్దరు మరణించినట్లు ప్రభుత్వం ప్రకటించింది. హైదరాబాద్‌కు చెందిన ఓ వృద్ధుడు గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందారు. మర్కజ్‌కు వెళ్లివచ్చిన వ్యక్తి ద్వారా ఇతనికి వైరస్ సోకినట్లు అధికారులు చెప్పారు. సోమాజిగూడలోని ఓ కార్పొరేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మహిళను గాంధీకి తరలిస్తుండగా మరణించారు. దీంతో తెలంగాణలో కరోనా మరణాల సంఖ్య 14కు పెరిగింది. ఇక, రాష్ట్రంలో కొత్తగా మరో 16 పాజిటివ్ కేసులు నమోదైనట్లు వైద్య ఆరోగ్య శాఖ వెల్లడించింది.

### లక్షణాలు కనిపించకుండా పాజిటివ్

కరోనా సోకితే 4 నుంచి 14 రోజుల్లో లక్షణాలు బయటపడతాయి. అయితే, ఒకసారి పరీక్షించినపుడు నెగెటివ్ వచ్చిన అనుమానితులకి ఏకంగా 22 రోజుల తర్వాత పాజిటివ్ వస్తోంది. అదికూడా ఎలాంటి లక్షణాలూ కనిపించకుండానే! ఇలాంటి వారే ఈ వ్యాధి ఇంత వేగంగా వ్యాపించడానికి కారకులవుతున్నారని నిపుణులు చెబుతున్నారు. ఇలాంటి వైరస్ క్యారియర్లే అమెరికా, యూరోప్ దేశాల్లో కరోనా విలయానికి కారకులని భావిస్తున్నారు. మనదేశంలో కూడా ఇలాంటి పరిస్థితి ఉందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తెలంగాణలో సైతం ఈ తరహాలో ఓ మూడు కేసులు బయటపడ్డాయి.

## 7 రాష్ట్రాల్లో లాక్‌డౌన్ పొడిగింపు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 11: కేంద్రంతో సంబంధం లేకుండా ప్రతీ రాష్ట్రమూ లాక్‌డౌన్‌ను పొడిగించేస్తున్నాయి. పంజాబ్, ఒడిసా ఇప్పటికే ప్రకటించగా- తాజాగా తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర, రాజస్థాన్, పశ్చిమబెంగాల్ కూడా ఈనెల 30 దాకా లాక్‌డౌన్‌ను పొడిగిస్తున్నట్లు వెల్లడించాయి. బీజేపీ అధికారంలో ఉన్న కర్ణాటక కూడా ప్రధాని ప్రకటన దాకా ఆగలేదు. అయితే పారిశ్రామిక, వ్యవసాయ రంగాలకు కొన్ని వెసులుబాట్లు కల్పిస్తున్నట్లు కర్ణాటక సీఎం బీఎస్ యడ్యూరప్ప శనివారంనాడు చెప్పారు.




Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

epaper.andhrajyothy.com